PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 280 | విజయవాడ, బుధవారం 15 మే 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 15 May 2024 | Rs

'మత' రాజకీయ ప్రకటనలు !

- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌కు కోట్లలో చెల్లింపులు, సింహభాగం బిజెపిదే
- ఆ పార్టీకి అనుకూలంగా అదృశ్య ఖాతాలు, విద్వేషాలు రెచ్చగొట్టడమే వాటి లక్ష్యం

3



గెలిచినా.. ఢిల్లీకి కష్టమే..

- ఓటమితో లక్నో ఆశలూ ఆవిరి

8

ఆగని హింస

వైసిపి దాడిలో టిడిపి అభ్యర్థికి అస్వస్థత ● ఆత్మరక్షణ కోసం గాలిలోకి గన్‌మేన్ కాల్పులు ● తాడిపత్రిలో భాష్పవాయువు ప్రయోగం ● పల్నాడులో ఎస్‌సి, బిసిల ఇళ్లపై దాడులు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో పోలింగ్ ముగిసినా ఘర్షణలు ఆగలేదు. అనంతపురం, పల్నాడు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో మంగళవారం కూడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. టిడిపి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నానిపై వైసిపి వారు దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం ఎమ్మెల్యే గన్‌మేన్ గాలిలోకి కాల్పులు జరిపారు. పల్నాడులో ఘర్షణలను అదుపు చేయడానికి వెళ్లిన సిఐకి గాయాలయ్యాయి. ఘర్షణలను అదుపు చేయడానికి తాడిపత్రిలో పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూములను పరిశీలించేందుకు వచ్చిన చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని కారును కొందరు దుండగులు అడ్డగించి సమ్మెట, రాడ్లు, బీరు బాటిళ్లు, క్రికెట్ స్టిక్స్, రాళ్లతో దాడి చేశారు. రాళ్లు ఛాతీకి తగలడంతో ఆయన అస్వస్థతకు గురయ్యారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన నాని గన్‌మేన్ ధరణిపైనా దుండగులు దాడికి పాల్పడ్డారు. దీంతో, ఆత్మరక్షణ కోసం గన్‌మేన్ ఒక రౌండ్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటన తెలిసి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పద్మావతి మహిళా యూనివర్సిటీ వద్దకు చేరుకున్నారు. వైసిపి కార్యకర్తలు సైతం పెద్ద ఎత్తున అక్కడికి రావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరుగ్రూపులనూ చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. నానిని, ఆయన గన్‌మేన్ ధరణిని స్విమ్స్‌కు తరలించారు. తమకు అందిన వీడియోల ఆధారంగా ఈ ఘటనకు పాల్పడింది రామచంద్రాపురం మండలం వైసిపి జెడ్‌పిటిసి సభ్యుడు భానుప్రకాష్ (భాను), ఆయన అనుచరులని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లు తీవ్రంగా ఖండించారు.



తిరుపతిలోన పద్మావతి మహిళ యూనివర్సిటీ ప్రాంగణంలో మోహరించిన టిడిపి, వైసిపి గ్రూపులు



తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నాని

పల్నాడులో సిఐకి గాయాలు

పల్నాడు జిల్లా కారంపూడి మండలం పేటసన్నగండ్ల గ్రామంలో సోమవారం రాత్రి కొందరు వైసిపి నాయకుల ఇళ్లపై టిడిపి వారు దాడులు చేయడంతో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఆ గ్రామానికి మంగళవారం వచ్చారు. ఈ సమయంలో పిన్నెల్లి సోదరులపై టిడిపి వారు రాళ్లు విసరడంతో వైసిపి వారు కర్రలు, రాడ్లతో ఎదుర్కొన్నారు. టిడిపి ఆఫీసుపై దాడి చేసి, టిడిపికి చెందిన జానీ బాషా కారును తగులబెట్టారు. అదుపు చేసేందుకు వెళ్లిన సిఐ నారాయణస్వామి తీవ్రంగా గాయపడ్డారు. టిడిపి సానుభూతిపరుల ఇళ్లపైనా, దుకాణాలపైనా వైసిపి వారు దాడులకు పాల్పడ్డారు. గ్రామంలో మళ్లీ ఘర్షణలు తలెత్తడంతో పోలీసులు కేంద్ర బలగాలను రప్పించి దుకాణాలను పూర్తిగా మూయించారు. 144 సెక్షన్ ప్రకటించారు. మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామంలోని వైసిపికి చెందిన బిసిలు, ఎస్‌టిలపైనా, వారి ఇళ్ల ఇళ్లపైనా టిడిపి వారు మూక్మడి దాడులకు పాల్పడ్డారు. దీంతో, ఆ ఇళ్లలోని పురుషులు ప్రాణభయంతో మహిళలు, చిన్నారులను వృద్ధులను తీసుకొని పొలాల దారిలో పారిపోయారు. కొందరు గ్రామ మిగతా 2లో

ఎన్నికల బాండ్ల స్కామ్‌పై
సిట్ దర్యాప్తు కోరుతూ పిటిషన్

- సత్వర విచారణకు సుప్రీం హామీ

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల కుంభకోణంపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను త్వరలో విచారణ చేపట్టేలా చూస్తామని సుప్రీం కోర్టు హామీ ఇచ్చింది. ప్రముఖ న్యాయవాది, ప్రశాంత్ భూషణ్ మంగళవారం నాడు సిట్ దర్యాప్తు పిటిషన్ గురించి ప్రస్తావించినప్పుడు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా ఆయనకు ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ పిటిషన్ భారత ప్రధాన న్యాయమూర్తి ముందు వుందని, ఆయన విచారణకు ఒక తేదీని కేటాయించి, బెంచ్‌ను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ప్రశాంత్ భూషణ్, ఇతర న్యాయవాదులు చెరిల్ డిసౌజా, నేహా రాథీలు ప్రాతినిధ్యం వహిస్తున్న 'కామన్ కాజ్', 'ది సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్' తరపున ఈ పిటిషన్ వేశారు. దేశంలోని ప్రధాన దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఇడి, ఆదాయపన్ను శాఖ వంటి సంస్థలు అవినీతికి అనుబంధ సంస్థలుగా మారాయని ఆ పిటిషన్ పేర్కొంది. ఈ సంస్థల దర్యాప్తును ఎదుర్కొంటున్న పలు కంపెనీలు, సంస్థలు, దర్యాప్తు ఫలితాలను ప్రభావితం చేసేందుకు గానూ పాలక పార్టీకి పెద్ద మొత్తాల్లో విరాళాలు అందచేశాయని పిటిషన్‌లో ఆరోపించారు. అందువల్ల, ఈ కేసులో దర్యాప్తు జరిపితే ప్రతి సంఘటన వెనుక గల కుట్ర కుతంత్రాలు బయటపడడమే కాకుండా ఈ కుట్రలో భాగస్వాములైన ఇడి, ఐటి, సిబిఐ అధికారుల బండారం కూడా బయటపడుతుందని పిటిషనర్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు చేసిన క్విడ్ ప్రొ కో ఏర్పాట్లుగా ఈ బాండ్లు కనిపిస్తున్నాయని పేర్కొంటూ, హిందూ, ఇతర మీడియా సంస్థలు జరిపిన విస్తృతమైన డేటా తవ్వకాలను, వార్తలను ఈ సందర్భంగా పిటిషన్ ప్రస్తావించింది.

81శాతం పైనే పోలింగ్

- ఇసి అంచనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 81శాతంపైనే పోలింగ్ జరిగి ఉంటుందని ఎన్నికల కమిషన్ అంచనా వేస్తోంది. తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంగళవారం మాట్లాడిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ఈ విషయం తెలిపారు. ఓటు వేయడానికి ఓటర్లు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారని, కొన్ని నియోజకవర్గాల్లో మంగళవారం తెల్లవారు జాము రెండు గంటల వరకు పోలింగ్ జరుగుతూనే ఉందని చెప్పారు. దీంతో మంగళవారం సాయంత్రానికి కూడా పోలింగ్‌కు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలు అందలేదని అన్నారు. అయితే భారీ స్థాయిలో పోలింగ్ జరిగిఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి 12గంటల వరకు 78.25 శాతం పోలింగ్ నమోదైందని, పోస్టల్ బ్యాలెట్ 1.2శాతం తో కలుపుకుని 79.4శాతం నమోదైందన్నారు. వివిధ జిల్లాల నుండి అందుతున్న సమాచారం మేరకు 81.3శాతం శాతం పోలింగ్ నమోదై ఉంటుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. తుది నివేదిక చేరిన వెంటనే అధికారికంగా పోలింగ్ పర్సెంటేజీని వెల్లడిస్తామన్నారు. విశాఖ.శ్రీకాకుళం, సత్యసాయి,. మచిలీపట్నం, నెల్లూరు, తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాల్లోని 47చోట్ల మంగళవారం వేకువజాము వరకు పోలింగ్ జరిగినట్లు ఆయన చెప్పారు.

ఓటర్ల కోసం గ్రీన్‌ఛానెల్‌లో రైలు:

కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా మొదటిసారి ఓటు కోసం ఒక ట్రెయిన్‌కు గ్రీన్ ఛానెల్ సౌకర్యాన్ని కల్పించినట్లు సిఇఓ మీనా వెల్లడించారు. పోలింగ్ సమయానికి రైలు విశాఖకు చేరుకునే పరిస్థితి లేక పోవడంతో నాందేడ్ నుంచి విశాఖపట్నం బయలు దేరిన రైలులో ఉన్న రెండు వేల మంది ఓటువేయలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ విషయం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లిందని, సిఇసి ఆదేశాల మేరకు రైల్వే శాఖతో మాట్లాడి, ఆ రైలుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో పోలింగ్ సమయానికంటే ముందుగానే ఆ రైలు విశాఖకు చేరుకుందని తెలిపారు. అడిషనల్ సిఇఓ కోటేశ్వరరావు ఈ మొత్తం వ్యవహారాన్ని సమన్వయం చేశారని చెప్పిన సిఇఓ, ఆయనను అభినందించారు.

కోనసీమలో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - అమలాపురం (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా వ్యవసాయ కార్మికులే.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం మండలంలోని ఊడిమూడి వద్ద రోడ్డు పక్కన ట్రాక్టర్ పెట్టి ధాన్యం బస్తాలను ఎక్కిస్తున్నారు. ఆదిమూలంవారిపాలెం, గంటి పెదపూడికి చెందిన పది మంది వరకూ వ్యవసాయ కార్మికులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. అదే సమయంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వేగంగా వెళ్తున్న ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి వీరిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వారిలో బెల్లంపూడి పంచాయతీ పరిధిలోని ఆదిమూలంవారి పాలేనికి చెందిన చిలకలపూడి మణి (26), గంటిపెదపూడికి చెందిన వాసంశెట్టి సూర్యప్రకాశరావు (30), నూకపెయ్యి శివ (35), ఈరి కట్లయ్య (38) ఉన్నారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అమలాపురంలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన నలుగురిలో చిలకలపూడి సురేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రస్తుతం ఆయనకు ఐసియులో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో అభివాదం చేస్తున్న మోడీ, అమిత్‌షా, చంద్రబాబు తదితరులు

అట్టహాసంగా మోడీ నామినేషన్

వారణాసి : వారణాసి లోక్‌సభ స్థానం నుంచి వరుసగా మూడవసారి బరిలోకి దిగుతున్న ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం నాడు నామినేషన్‌పత్రాలను దాఖలు చేశారు. బిజెపి కార్యర్తలు, మద్దతుదారులతో ఊరేగింపుగా వెళ్లి వారణాసిలో ఆయన నామినేషన్ వేశారు. అయోధ్యలో రాముని ప్రాణ ప్రతిష్టకు గుర్తుగా పండిట్ గణేవ్వర్ శాస్త్రిని తన నలుగురి ప్రతిపాదకులలో ఒకరిగా పక్కన కూర్చోబెట్టుకున్నారు. మిగతా ముగ్గురు ప్రతిపాదకుల్లో ఆరెస్సెస్ కార్యర్త బైద్యనాథ్ పటేల్, ఒబిసి సభ్యుడు లాల్‌చంద్ కుష్వాహా, దళిత సభ్యుడు సంజయ్ సోంకర్ ఉన్నారు. నామినేషన్ వేసేందుకు ఆయన వెంట జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయానికి వెళ్లిన వారిలో ఎన్డీయేలో భాగస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు నాయుడు, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ ఉన్నారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోడీ వారణాసి నుండి పోటీ చేసి గెలుపొందారు నామినేషన్ పత్రాలు సమర్పించడానికి ముందు భారత రాజ్యాంగం పట్ల నాకు విశ్వాసం, విధేయత ఉంటుందని ప్రమాణం చేస్తూ ఒక పత్రాన్ని ఎన్నికల రిజిస్ట్రార్‌కు ఆయన అందజేశారు. జూన్1న చివరి విడతలో ఎన్నికలు జరిగే పార్లమెంటరీ నియోజకవర్గాల్లో వారణాసి ఒకటి. మొదటి రెండు దశల్లో ఓట్లు తక్కువగా పోలవడంతో ఓటమి భయం పట్టుకున్న ప్రధాని మోడీ దేశంలో ఇస్లామిక్ ఫోబియోను రెచ్చగొట్టే యత్నం చేశారు. ఎన్నికల కోడ్‌ను బేఖాతరు చేస్తూ ముస్లింలను చొరబాటుదారులుగాను, ఎక్కువ మంది పిల్లలను కనేవారిగాను నిందిస్తూ ఎన్నికల ప్రసంగాలు చేశారు.

రీ - పోలింగ్ పెట్టండి

ఇసిని కోరిన టిడిపి, వైసిపిలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల రీపోలింగ్ నిర్వహించాలని టిడిపి, వైసిపిలు ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాను మంగళవారం ఆయా పార్టీల ప్రతినిధులు కలిసి వినతులు అందజేశారు. హింస చోటుచేసుకోవడం, గాల్లోకి కాల్పులు అభ్యర్థుల మీద దాడులు, గృహ నిర్బంధాల వంటి సంఘటనలతో పాటు ఇవిఎంలు పలు చోట్ల మొరాయించాయని వినతిపత్రాల్లో ఆ పార్టీలు పేర్కొన్నాయి,.

31 చోట్ల జరపండి : టిడిపి డిమాండ్

రాష్ట్ర వ్యాప్తంగా 31 చోట్ల రీ పోలింగ్‌కు డిమాండ్ చేస్తూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఎన్నికల కమిషన్‌ను కోరింది. మాచర్లలో 114, 115,116,117, సత్తెనపల్లిలో 234, 235, 241, 242, 243, 244, దర్శిలో 88, 93, 97, 155, 156, ఒంగోలులో 5, 6, 57,194 ,195 పోలింగ్‌బూత్‌ల్లో రీ పోలింగ్ నిర్వహించాలని సిఇఓను కోరారు. వీటితో పాటు శ్రీకాళహస్తిలో 126, చిత్తూరులో 210, మదనపల్లిలో221, అనంతపురం అర్బన్‌లో 143,144,145,146,147, 255, 256, పుట్టపర్తిలో 147, 203 పోలింగ్‌బూత్‌ల్లో రీ పోలింగ్ నిర్వహించాలని టిడిపి ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, గుంటూరు మిర్చి యార్డు మాజీచైర్మన్ మన్నవ సుబ్బారావు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండూరి అఖిల్ సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనాను కలిసిన వారిలో ఉన్నారు.

ఆరు చోట్ల రీపోలింగ్ : వైసిపి వినతి

సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఆరు బూతుల్లో రీపోలింగ్ నిర్వహించాలని వైసిపి ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సిఇఓను కలిసి వినతిపత్రం అందచేశారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని దమ్మాలపాడులో 253, 254, నార్నెపాడులో 236,237, చీమలమర్రిలో 197,198 బూత్‌ల్లో టిడిపి రిగ్గింగ్ చేసిందని, ఆయా పోలింగ్ స్టేషన్లలోని వెబ్‌కెమెరాలను పరిశీలించి రీ పోలింగ్ నిర్వహించాలని సిఇఓకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కొత్త గణేశునిపాడులో టిడిపి దాడులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి అంబటి మీడియాతో మాట్లాడుతూ పోలీసుల వైఫల్యాలపై ఎన్నికల కమిషన్ సమీక్ష నిర్వహించాలని, లా అండ్ ఆర్డర్‌ను ఎందుకు కాపాడలేక పోయారని ఆయన ప్రశ్నించారు.

నేడు గవర్నర్‌ను కలవనున్న టిడిపి

రిజర్వ్ బ్యాంకు నుంచి అప్పు తీసుకున్న నగదును అస్మదీయ కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు కాంట్రాక్టర్లకు నగదు చెల్లింపులు చేయకుండా నిలువరించాలని కోరుతూ బుధవారం టిడిపి ప్రతినిధుల బృందం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వనుంది. ఆరోగ్యశ్రీ , ఫీజు రీఎంబర్స్‌మెంట్ పోలీసులకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వకుండా దారిమళ్లించే కుట్ర చేస్తున్నారని టిడిపి ఆరోపించింది. ఇదే విషయంపై టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు మంగళవారం గవర్నర్‌కు లేఖ రాశారు.




జగన్ విదేశీ పర్యటనకు సిబిఐ కోర్టు అనుమతి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు సిబిఐ కోర్టు మంగళవారం అనుమతి ఇచ్చింది. ఫోన్ నెంబర్, మెయిల్ ఐడి వివరాలు కోర్టుకు, సిబిఐకి సమర్పించాలని న్యాయస్థానం ఆయనను ఆదేశించింది. అక్రమాస్తుల కేసులో షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్న వైఎస్ జగన్... ఈ నెల 16 నుంచి జూన్ ఒకటి వరకు లండన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లో పర్యటించేందుకు అనుమతించాలని కోరుతూ సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని కోర్టును సిబిఐ కోరింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు పై మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఢిల్లీ ఐటి ఆఫీసులో అగ్ని ప్రమాదం


- ఒక ఉద్యోగి మృతి



న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఒక ఆదాయ పన్ను కార్యాలయంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక ఉద్యోగి మరణించారు. మంగళవారం మధ్యాహ్నం సెంట్రల్ రెవిన్యూ భవనంలో ఉన్న ఆదాయ పన్ను కార్యాలయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది 21 అగ్నిమాపక యంత్రాలతో అక్కడకు చేరుకున్నారు. సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఏడుగురిని కార్యాలయం నుంచి రక్షించారు. ఒక వ్యక్తి స్పృహ తప్పి ఉండగా గుర్తించి, ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతున్ని 46 ఏళ్ల ఆఫీస్ సూపరింటెండెంట్‌గా గుర్తించారు. ప్రమాదంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా వెల్లడి కాలేదు.

సెల్‌ఫోన్ ఛార్జీల సెగలు

- ఎన్నికలు పోలింగ్ ముగియగానే బాదుడు
- 25 శాతం పెంచేందుకు ప్రయివేటు టెల్కోల యోచన
- ఆక్సిస్ కాపిటల్ రిపోర్ట్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగాన్ని కుంగదీసి ప్రయివేటు టెలికాం కంపెనీలకు పట్టం కట్టడం వల్ల వినియోగదారులపై ఇప్పటికే విపరీత భారాలు పడుతున్నాయి. యాక్టివిటీ, వాయిస్‌కాల్, ఇంటర్నెట్ ఇలా రకరకాలుగా సేవలను విడదీసి బాదేస్తున్న ప్రయివేటు టెలికాం కంపెనీలు త్వరలోనే మరోమారు ధరల మోత మోగించనున్నాయి. సార్వత్రిక ఎన్నికలు ముగియగానే మొబైల్ ఫోన్ రీఛార్జి బాదుడు షురూ చేయనున్నాయని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ ఆక్సిస్ కాపిటల్ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుత ధరలపై 25 శాతం వరకూ అధికంగా పెంచాలని టెల్కోలు యోచిస్తున్నాయి. టెలికం పరిశ్రమలో పోటీ, టెక్నాలజీ కోసం పెట్టుబడులు పెరిగాయనే సాకుతో టారిఫ్ ధరల పెంపునకు ప్లాన్లు వేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బిఎస్‌ఎన్‌ఎల్‌ను చావుదెబ్బ తీసినందున మరో ప్రత్యామ్నాయం లేదు కాబట్టి.. ధరలు పెంచినా భరించక తప్పని పరిస్థితిలో వినియోగదారులున్నారని, 25 శాతం వరకూ మోత మోగించవచ్చునన్న ధీమాతో ప్రయివేటు టెల్కో సంస్థలున్నట్లు తెలుస్తోంది.

జూన్ 1 నాటికి దేశంలో ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు పూర్తి కానున్నాయి. జూన్ 4న ఓట్లను లెక్కించనున్నారు. ఆ తర్వాత ఛార్జీల పెంపును ప్రకటించాలని టెలికం కంపెనీలు యోచిస్తున్నాయి. చివరి సారిగా 2021 డిసెంబర్‌లో దాదాపు 20 శాతం టారీఫ్‌లను పెంచాయి. 2023 ముగింపు నాటికి వొడాఫోన్ ఐడియా 19.3 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 33 శాతం, రిలయన్స్ జియో 39.7 శాతం చొప్పున మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. జియో మార్కెట్లోకి వచ్చిన సమయంలో రూ.149కే అన్‌లిమిటెడ్ ఉచిత కాల్స్, డేటాను అందించింది. ప్రస్తుతం ఈ ప్లాన్‌ను ధరను రూ. 209కి చేర్చింది. ఇదే బాటలో మిగితా ప్రయివేటు టెల్కోలు ప్రయాణించాయి. చాపకింద నీరులా దాదాపుగా మూడు, నాలుగుసార్లు పెంచాయి. మొబైల్ ఛార్జీలను 25 శాతం మేర పెంచడం ద్వారా వినియోగదారుడి నుంచి నెలకు సగటు రెవెన్యూ (ఎఆర్‌పియు) 16 శాతం పెరగనుందని అంచనా. మార్చితో ముగిసిన త్రైమాసికంలో జియో ఎఆర్‌పియు మిగతా 2లో

రూ.34 వేల కోట్ల డిహెచ్‌ఎఫ్‌ఎల్ బ్యాంకు స్కామ్
ధీరజ్ వాధ్వాన్ అరెస్ట్

న్యూఢిల్లీ : దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలిచిన డిహెచ్‌ఎఫ్‌ఎల్ కేసులో ఆ సంస్థ మాజీ డైరక్టర్ ధీరజ్ వాధ్వాన్‌ను సిబిఐ అరెస్టు చేసింది. సోమవారం సాయంత్రం ముంబాయిలో ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మంగళవారం ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు జ్యుడిషియల్ కస్టడికి తరలించారు. 2010-18 సంవత్సరాల మధ్య చోటుచేసుకున్న ఈ స్కామ్ 2020లో వెలుగులోకి వచ్చింది. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా (యుబిఐ) నేతృత్వంలోని 17 బ్యాంకుల కన్సార్టియంను అప్పట్లో డిహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్లుగా ఉన్న కపిల్ వాధ్వాన్, ధీరజ్ వాధ్వాన్‌లు రూ.34,615 కోట్ల మేర మోసం చేశారు. వీరిద్దరు మరికొందరితో కలిసి డిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు భారీ మొత్తంలో రుణం ఇచ్చేలా బ్యాంకుల కన్సార్టియంపై ఒత్తిడి తీసుకువచ్చారు. అనేక బోగస్ పత్రాలను సమర్పించారు. వీరి మా యాజాలంలో చిక్కుకున్న బ్యాంకుల రూ.42,871.42 కోట్లు రుణంగా ఇచ్చాయి. ఆ తరువాత డిహెచ్‌ఎఫ్‌ఎల్ పుస్తకాల్లో తప్పుడు వివరాలను నమోదు చేయడం, నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు గుర్తుతెలియని ఇతర ఖాతాలకు పెద్ద మొత్తంలో నిధులను తరలించారు. సకాలంలో వాయిదాలను చెల్లించలేదు. దీంతో రూ.34,615 కోట్ల రుణాలను నిరర్ధక ఆస్తులుగా గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2020లో వెలుగులోకి వచ్చిన ఈ స్కామ్ పెద్దఎత్తున చర్చనీయాంశమైంది. 2021లో యూనియన్ బ్యాంకు ఫిర్యాదుతో సిబిఐ, ఇడిలు రంగంలోకి దిగాయి. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున మనీలాండరింగ్, చీటింగ్ వంటి అంశాలు చోటుచేసుకున్నట్లు గుర్తించాయి. కపిల్, ధీరజ్ వాధ్వాన్‌లపై సిబిఐ కేసు నమోదు చేసింది. 2022లో సిబిఐ ఛార్జిషీట్ నమోదుచేసింది. బ్యాంకుల కన్సార్టియంను వివిధ పద్ధతుల్లో మోసం చేసిన వీరు సొంత ఆస్తులను భారీగా పెంచుకున్నారని ఛార్జిషీట్‌లో సిబిఐ ఆరోపించింది. ఈ కేసులో తాజాగా అరెస్ట్ అయిన ధీరజ్ వాధ్వాన్ ఎస్ బ్యాంకు అవినీతి కేసులో గతంలోనే అరెస్ట్ అయి బెయిల్‌పై ఉన్నారు. ఇప్పటి వరకు దేశంలో నీరవ్ మోడీ రూ.13వేల కోట్లు, ఎబిజి షిప్‌యార్డ్ రూ.23వేల కోట్లకు బ్యాంక్‌లను ముంచిన కేసులు.. అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణాలుగా ఉన్నాయి.



చల్లని కబురు

- 19 కల్లా అండమాన్‌కు నైరుతి రుతుపవనాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేసవి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే అండమాన్‌ను తాకనున్నాయి. ఈ నెల 19వ తేదీకల్లా దక్షిణ అండమాన్ సముద్రం, దాన్ని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించనున్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. మరోవైపు దక్షిణ కర్ణాటక నుండి వాయువ్య మధ్యప్రదేశ్ వరకూ విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణశాఖ తెలిపింది. మంగళవారం కొన్నిచోట్ల వడగాడ్పులు ఉన్నా, ఎక్కువచోట్ల వర్షాలు పడ్డాయి. వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని గతంలో వాతావరణశాఖ, ప్రకృతి విపత్తులశాఖ హెచ్చరికలు జారీ చేశాయి. అయితే కొద్దిరోజులుగా ఉదయం వేడిగా ఉన్నా మధ్యాహ్నం నుండి చల్లబడటం, అప్పటికప్పుడు వర్షం పడుతుండటంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. అయినా వడగాడ్పులు, తీవ్ర ఉష్ణోగ్రతల నుండి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకృతి విపత్తులశాఖ సూచించింది.

జెసి ప్రభాకర్‌రెడ్డిపై ఇడి ఛార్జిషీట్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

మనీలాండరింగ్ కేసులో అనంతపురం జిల్లా టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డిపై మంగళవారం ఇడి ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో మొత్తం 17 మందిపై ప్రాసిక్యూషన్ ఫిర్యాదును నమోదు చేసింది. జెసి ప్రభాకర్‌రెడ్డి కంపెనీలకు చెందిన వాహనాలకు మన రాష్ట్రంలోనూ నాగాలాండ్, కర్ణాటక రాష్ట్రాల్లోనూ తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి 2022లో జెసి ఆస్తులను ఇడి అటాచ్ చేసింది. అందులో భాగంగా ప్రస్తుతం ప్రభాకర్‌రెడ్డిపై ఛార్జిషీట్ దాఖలు చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సెల్‌ఫోన్ ఛార్జీల సెగలు

(మొదటిపేజీ తరువాయి)

రూ.181.7గా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ ఎఆర్‌పియు రూ.209గా ఉంది. 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో వొడాఫోన్ ఐడియా ఎఆర్‌పియు రూ.145గా ఉంది. 'ఎఆర్‌పియు సగటున 10-15 శాతం పెరిగిన ఏడాదిలో వినియోగదారుడిపై అదనంగా రూ.100 భారం పడనుంది. ధరల పెంపు 4జి, 5జి ప్యాక్‌లపై ఉండొచ్చు. దీంతో ముందు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ లాభపడొచ్చు. వొడాఫోన్ ఐడియా రెవెన్యూ పెరగనుంది.' అని డెలాయిట్ సౌత్ ఏసియా టిఎంటి ఇండస్ట్రీ లీడర్ పియూష్ వైష్ పేర్కొన్నారు. 2023-24లో జియో స్థూల రెవెన్యూ 10.4శాతం పెరిగి రూ.లక్ష కోట్లను చేరగా.. నికర లాభాలు 11.48 శాతం ఎగిసి రూ.20,607 కోట్లుగా నమోదయ్యాయి. 2023-24లో భారతీ ఎయిర్‌టెల్ నికర లాభాలు 10.5 శాతం తగ్గి రూ.7,467 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. సంస్థ రెవెన్యూ 7.8 శాతం పెరిగి రూ.1.50 లక్షల కోట్లకు చేరింది. భారత టెల్కోలు లాభాలు, రెవెన్యూలను దండిగానే ఆర్జిస్తున్నప్పటికీ.. వినియోగదారులపై మళ్లీ భారం మోపాలనే యోచన ఆందోళకరం.

ప్రధానిపై సానుకూలత అంతంతే

- సిఎఎపై వివిధ దేశాల్లో వ్యతిరేకత
- తేల్చి చెప్పిన 'గ్లోబ్‌స్కాన్' సర్వే



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారత్ పేరు ప్రతిష్టలు ఇనుమడించాయంటూ అధికార బిజెపి ఎన్ని కథనాలు రూపొందిస్తున్నప్పటికీ వాటిలో ఏ మాత్రం వాస్తవం లేదని తాజా అధ్యయనం తేల్చింది. 2014కు ముందే భారత్‌కు అంతర్జాతీయంగా మంచి పేరు ఉండేదని, ఇప్పుడది ఎండమావిగా మారిందని ఆ అధ్యయనం తెలిపింది. 'గ్లోబ్‌స్కాన్' అనే సంస్థ మార్చి 29-ఏప్రిల్ 8 తేదీల మధ్య అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల్లో ఓ సర్వే నిర్వహించింది. భారత్‌తో తమ దేశాల సంబంధాలు పటిష్టంగా ఉండాలంటే ముందుగా అక్కడ మానవ హక్కులకు, ప్రజాస్వామ్యానికి రక్షణ లభించాల్సి ఉంటుందని సర్వేలో పాల్గొన్న 89% మంది కుండబద్దలు కొట్టారు.

హత్యా యత్నాలపై ఆందోళన

భారత్‌కు తమ దేశాల నుండి పారిశ్రామిక, ఇతర వాణిజ్య పెట్టుబడులు రావాలంటే ముందుగా ఆ దేశంలో మానవ హక్కులకు రక్షణ కల్పించడం అవసరమని 90 శాతం మంది స్పష్టం చేశారు. భారత సంతతికి చెందిన అమెరికా, కెనడా పౌరులను హతమార్చేందుకు భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింలు భారత పౌరులుగా మారడానికి అవరోధంగా ఉన్న పౌరసత్వ సవరణ చట్టంపై సర్వేలో పాల్గొన్న ప్రతి నలుగురిలో ముగ్గురు అభ్యంతరం తెలిపారు. ముస్లింలు మినహా బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ నుండి మన దేశానికి వచ్చిన మతపరమైన మైనారిటీ శరణార్థులకు త్వరితగతిన భారత పౌరసత్వం కల్పించేందుకు ఈ చట్టాన్ని ఉద్దేశించారు. వారు భారత్‌లో ఆరు సంవత్సరాలు నివసించి ఉండాలని, 2014 డిసెంబర్ 31 నాటికి దేశంలో ప్రవేశించి ఉండాలని షరతు పెట్టారు. ఈ చట్టాన్ని 2019లోనే పార్లమెంట్ ఆమోదించినప్పటికీ ఈ సంవత్సరం మార్చిలో అమలు చేశారు. 'మోడీ ఎండమావి' పేరిట రూపొందించిన ఈ సర్వేను మంగళవారం విడుదల చేశారు. నెదర్లాండ్స్‌లోని గ్రానింజెన్ యూనివర్సిటీ, లండన్ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌కు చెందిన విద్యావేత్తలు దీనిని నిర్వహించారు. సర్వేలో పాల్గొన్న వారిలో బ్రిటన్‌కు చెందిన 10 శాతం మంది, అమెరికాకు చెందిన 22 శాతం మంది మాత్రమే మోడీ పట్ల సానుకూలత వ్యక్తం చేశారు. అమెరికా యువతలో ఈ సానుకూలత మరింత తగ్గింది. సర్వేలో పాల్గొన్న అమెరికా యువతలో తొమ్మిది శాతమే మోడీకి మద్దతు తెలపడం గమనార్హం.

భారత్ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి

భారత ఆర్థిక, భౌగోళిక రాజకీయ ప్రయోజనాల రీత్యా ప్రపంచ దేశాల్లో దాని పేరు ప్రతిష్టలు ఇనుమడించాల్సిన అవసరముందని ప్రధాని మోడీ సరిగానే చెప్పారని నివేదిక రూపకర్తల్లో ఒకరైన జార్జిటౌన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇర్ఫాన్ నూరుద్దీన్ తెలిపారు. 'అయితే భారత్ పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేశానని మోడీ చెప్పుకోవడం తప్పని మా సర్వేలో తేలింది. వాస్తవానికి మానవ హక్కులు, ప్రజాస్వామ్యం విషయాల్లో భారత్ పనితీరు బాగా లేకపోవడం దాని ప్రయోజనాలను దెబ్బ తీస్తోందని మా సర్వే వెల్లడించింది' అని ఆయన చెప్పారు.

పిఎంఒ ఆదేశాల మేరకే ఆ కథనాలు

మీడియాపై సెన్సార్‌షిప్ విధించడం, బలప్రయోగం చేయడం, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం సాగించడం వంటి చర్యల కారణంగా ప్రపంచ వేదికపై భారత్ పేరు ప్రతిష్టలను, గౌరవాన్ని మోడీ నాటకీయంగా పెంచారన్న అభిప్రాయం కలిగిందని సర్వే నివేదిక తెలిపింది. 'ప్రధానమంత్రి కార్యాలయం నుండి అందిన ఆదేశాల మేరకు ప్రముఖ మీడియా సంస్థలు కథనాలు అందించాయి. అంతర్జాతీయ వ్యవహారాల్లో మోడీ పాత్రపై స్టోరీలు రూపొందించడం కోసం అవి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాయి. ఇవి అంతర్జాతీయ కవరేజీపై కొంత ప్రభావం చూపి ఉండవచ్చు. ఎందుకంటే విదేశాల్లోని మీడియా సంస్థలు తరచూ తమ న్యూఢిల్లీ ప్రతినిధుల నుండి సమాచారాన్ని సేకరిస్తుంటాయి. వారిని జాతీయ మీడియా వాతావరణం ప్రభావితులను చేసింది' అని సర్వే నివేదిక వ్యాఖ్యానించింది.

నగదు బదిలీపై నాన్చుడు

నిధులు అందుబాటుపైనా సందిగ్ధత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పోలింగ్‌కు ముందు వరకు డిబిటి పథకాలకు నగదు చెల్లింపుపై హడావిడి పడిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నాన్చుడు ధోరణిని అవలంబిస్తోంది. ముఖ్యమంత్రి ఎప్పుడో బటన్ నొక్కిన పథకాలకు పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు నగదు చెల్లించడం ఓటర్లను ప్రలోభపెట్టడంగానే చూడాల్సివస్తుందన్న వైఖరిని ఎన్నికల కమిషన్ తీసుకుంది. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లడం, కోర్టు ఆదేశాల నేపథ్యంలోనూ ఇసి వైఖరి మారకపోవడంతో డిబిటి పథకాలకు బ్యాంకుల్లో నిధులు జమచేసే ప్రక్రియ నిలిచిపోయింది. పోలింగ్ ముగిసిన తరువాత నిధులను విడుదల చేయడానికి ఇసి అనుమతించడంతో సోమవారం సాయంత్రం నుండి లబ్ధిదారులు నగదుకోసం ఎదురు చూశారు. అయితే మంగళవారం గడిచినా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిసారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం నగదు బదిలీ కోసం ఉంచిన నిధులను గడిచిన రెండు, మూడు రోజుల్లో ఇతర అవసరాల కోసం మళ్లించారు. దీంతో నిధుల అందుబాటుపైనా సందిగ్ధత నెలకొంది. రిజర్వు బ్యాంకు నుండి మంగళవారం 4 వేల కోట్ల రూపాయలను రుణంగా సమీకరించారు. ఈ మొత్తాన్న డిబిటి పథకాలకు వినియోగించాలని భావించినప్పటికీ, కొంత మొత్తాన్ని అత్యవసర చెల్లింపులకోసం వాడుకోక తప్పని స్థితి ఉందని తెలిసింది. మరో 21 రోజుల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేదెవరో తేలనుండటంతో ఆ తరువాతే చెల్లింపులు చేయడం మేలన్న అభిప్రాయంలో ఉన్నతాధికారుల్లో కొందరు ఉన్నట్లు సమాచారం.

కాంట్రాక్టర్లకు చెల్లించారా?

నగదు బదిలీకి సిద్ధం చేసుకున్న వేల కోట్ల రూపాయలను కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు వినియోగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిలిపివేసింది. ఫలితాల తరువాత రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైతే అదే మాదిరి పరిస్థితి ఏర్పడుతుందని భావిస్తున్న కొందరు కాంట్రాక్టర్లు నిధుల చెల్లింపు కోసం అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది.

అధ్యాపకులతో తెలంగాణ ఇంటర్ బోర్డు చెలగాటం

ఇంకా చెల్లించని స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులతో తెలంగాణ ఇంటర్ బోర్డు అధికారులు చెలగాటమాడుతున్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,78,718 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,02,260 మంది కలిపి మొత్తం 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గతనెల నాలుగో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో జరిగింది. గతనెల 24న ఇంటర్ ఫలితాలను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. ఇంటర్ పరీక్షలు ముగిసి దాదాపు రెండునెలలు, మూల్యాంకనం ప్రక్రియ ముగిసి 50 రోజులు దాటింది. అయినప్పటికీ ఇంత వరకు స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్‌ను అధ్యాపకులకు చెల్లించలేదు. ఇంటర్ బోర్డు అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షల విధులు, స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉద్యోగులకు రెమ్యూనరేషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

ఎపిఆర్‌జెసి ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గురుకుల పాఠశాలలు, గురుకుల జూనియర్ కళాశాలలు, డిగ్రీ కాలేజీలకు సంబంధించి 2024-25 సంవత్సరపు ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయంలో ఈ ప్రవేశపరీక్ష ఫలితాలను పాఠశాల విద్యాకమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, ఎపి గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి హెచ్‌ఎమ్‌డి ఉబేదుల్లా, లైజన్ అధికారి పివి మల్లేశ్వర్ విడుదల చేశారు. ఎపి గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన ఏప్రిల్ 25న నిర్వహించిన ప్రవేశ పరీక్షల ద్వారా 38 సాధారణ గురుకుల పాఠశాలలో 5వ తరగతికి, 12 మైనార్టీ పాఠశాలల్లో గల సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే 6, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు కూడా ప్రవేశాలను నిర్వహిస్తున్నామని అన్నారు. 5వ తరగతిలో 3,195 సీట్లకు 17,312 మంది విద్యార్థులు ప్రవేశపరీక్షకు హాజరయ్యారని తెలిపారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన కీర్తికి అత్యధికంగా 99 మార్కులు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే 6వ తరగతిలో 257 సీట్లకు 3,969 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే విజయనగరం జిల్లాకు చెందిన సి సోమేశ్వరరావుకు అత్యధికంగా 87 మార్కులు వచ్చాయన్నారు. 7వ తరగతికి 146 సీట్లకు 1,750 మంది పరీక్షలు రాస్తే శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె ఖగేంద్రకు 88 మార్కులు వచ్చాయని తెలిపారు. 8వ తరగతికి 172 సీట్లకుగానూ 2,185 మంది పరీక్షలు రాస్తే విజయనగరం జిల్లాకు చెందిన వై మేఘాశ్యామ్‌కు 83 మార్కులు అత్యధికంగా వచ్చాయన్నారు. అలాగే 7 సాధారణ జూనియర్ కాలేజీలు, మూడు మైనార్టీ కాలేజీల్లో 474 ఎపిసి, ఇఇటి గ్రూప్‌లకు గానూ 35,872 మంది పరీక్షలు రాస్తే తూర్పుగోదావరికి చెందిన జి యశ్వంత్‌సాయికి 142 మార్కులు వచ్చాయన్నారు. 334 బైపిసి, సిజిటి సీట్లకుగానూ 11,031 మంది పరీక్షలు రాశారని, ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్ మహితకు 137 మార్కులు వచ్చాయన్నారు. ఎమ్ఇసి, సిఇసిలో 341 సీట్లకు 2,405 మంది పరీక్షలు రాస్తే తూర్పుగోదావరికి చెందిన సత్యరామ్‌మోహన్‌కు 140 మార్కులు వచ్చాయన్నారు. అలాగే నాగార్జునసాగర్‌లోని డిగ్రీ కాలేజీలోని 40 బిఎ డిగ్రీ సీట్లకు గానూ 150 మంది పరీక్షలు రాస్తే ఏలూరు జిల్లాకు చెందిన ఎం రవీంద్ర వరప్రసాద్‌కు 113 మార్కులు వచ్చాయన్నారు. అలాగే 40 బికామ్ సీట్లకు 394 మంది పరీక్షలకు హాజరైతే అన్నమయ్య జిల్లాకు చెందిన టి గణేష్‌కు 112 మార్కులు వచ్చాయన్నారు. 36 బిఎస్‌సి (ఎంపిసి) సీట్లకు 312 మంది పరీక్ష రాస్తే శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి సాయికృపారెడ్డికి 118 మార్కులు వచ్చాయన్నారు. అలాగే బిఎస్‌సి (ఎమ్ఎస్‌సిఎస్)లో 36 సీట్లకు 107 మంది పరీక్షలు రాస్తే కడప జిల్లాకు చెందిన బి రాజశేఖర్‌కు 103 మార్కులు అత్యధికంగా వచ్చాయన్నారు. ఈ విద్యాసంస్థల్లో ఎంపిక జాబితాను, ఇతర వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 15వ తేదీలోపు ఎస్ఎమ్ఎస్‌ల ద్వారా సమాచారాన్ని అందిస్తామన్నారు.

స్ట్రాంగ్ రూముల్లో ఇవిఎంలు

ప్రజాశక్తి - అమరావతి

ఓట్లకు జనం పోటెత్తడంతో సోమవారం అర్ధరాత్రి వరకు పోలింగ్ సాగడంతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) స్ట్రాంగ్ రూములకు చేర్చడం ఆలస్యమైంది. సోమవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇవిఎంలను తరలించారు. నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారీగా స్ట్రాంగ్‌రూంలో ఇవిఎంలు భద్రపరిచి అధికారులు సీలు వేశారు. స్ట్రాంగ్‌రూముల వద్ద మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. నిరంతరం సిసి కెమెరా పర్యవేక్షణ కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రాల నుంచి పకడ్బందీ బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనాల్లో ఇవిఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలించి భద్రపరిచారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 234 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఇవిఎంలను ఇబ్రహీంపట్నంలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. నందిగామకు చెందిన 222 ఇవిఎంలను సైతం ఇదే కళాశాలలో భద్రపరిచారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఇవిఎంలను ఒక చోటకు చేర్చి అక్కడి నుంచి భారీ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూములకు తరలించారు.

నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల్లో భద్రపరిచిన ఇవిఎంలను కలెక్టర్ పరిశీలించారు. గుడివాడ, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రుకు చెందిన ఇవిఎంలను కృష్ణా యూనివర్సిటీలోని ప్రధాన స్ట్రాంగ్‌రూంకు తరలించారు. స్ట్రాంగ్‌రూముల వద్ద కేంద్ర పారామిలటరీ బలగాలతోపాటు రాష్ట్ర పోలీసులు పహారా కాస్తున్నారు.

గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వివిఎంలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1900 పోలింగ్ కేంద్రాల నుంచి ఇవిఎంలను పటిష్టమైన భద్రత మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్‌రూంకు తరలించారు. సత్యసాయి జిల్లా హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఇవిఎంలను తరలించి భద్రపరిచారు. మడకశిర, పెనుగొండ, కదిరి, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటుకు సంబంధించిన ఇవిఎంలను అధికారులు భద్రపరిచారు.

కర్నూలు జిల్లాలోని ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీకి తరలించారు. 8 అసెంబ్లీ, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గాల ఇవిఎంలు వర్సిటీలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. అనంతపురం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తెల్లవారుజామున జెఎన్‌టియు స్ట్రాంగ్‌రూంకు ఇవిఎంలను తరలించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలోని ఇవిఎంలను రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలకు తరలించి స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు.

రాష్ట్రంలో భారీగా నమోదైన పోలింగ్

అత్యధికంగా ఒంగోలులో 87, అత్యల్పంగా విశాఖలో 71 శాతం

ప్రజాశక్తి - యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 25 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కొన్నిచోట్ల అర్ధరాత్రి రెండు గంటల వరకూ ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. అత్యధికంగా ఒంగోలులో 87శాతం నమోదుకాగా అత్యల్పంగా విశాఖపట్నంలో 71 శాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ వారీగా ఓటర్ల సంఖ్య, పోలైన ఓట్లు, శాతం క్రింది విధంగా ఉన్నాయి.

పార్లమెంట్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
అనంతపురం	17,67,591	14,23,441	80.53
హిందూపురం	16,56,774	14,05,276	84.82
కర్నూలు	17,22,857	13,23,071	76.80
నంద్యాల	17,03,797	13,59,975	79.82
కడప	16,39,066	13,04,256	79.57
రాజంపేట	14,26,834	10,86,106	76.12
తిరుపతి	17,29,832	13,68,362	79.10
చిత్తూరు	16,40,202	14,06,880	85.77
ఒంగోలు	16,07,832	14,01,614	87.17
బాపట్ల	15,06,354	12,48,767	82.90
నెల్లూరు	17,12,274	13,37,285	78.10
గుంటూరు	17,91,543	14,11,989	78.91
నరసరావుపేట	17,34,858	14,86,594	85.69
విజయవాడ	17,04,077	13,52,411	79.36
మచిలీపట్నం	15,39,460	12,93,603	84.45
నరసాపురం	14,72,923	12,16,667	82.60
ఏలూరు	16,37,430	13,69,862	83.65
రాజమండ్రి	16,23,149	12,89,298	79.43
కాకినాడ	16,34,122	13,12,255	80.30
అమలాపురం	15,31,410	12,73,061	83.13
విశాఖపట్నం	19,27,303	13,70,484	71.11
అరకు	15,54,633	11,45,426	73.68
అనకాపల్లి	15,96,916	12,73,920	79.77
విజయనగరం	13,40,446	12,84,900	81.06
శ్రీకాకుళం	18,75,934	14,12,416	75.29



దీక్షలో కూర్చున్న ఉక్కు ఉద్యోగులకు మద్దతు తెలిపిన విద్యార్థులు


'ఉక్కు' ఉద్యమానికి విద్యార్థుల మద్దతు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు మద్దతు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకుంటామని వారు నినదించారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1188వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్ విభాగానికి సంబంధించిన ఉద్యోగులు కూర్చున్నారు. వారికి ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు జత కలిశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిసి హెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాల ద్వారా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విశాఖ ఉక్కు ఉత్తరాంధ్రకు ఎంత అవసరమన్నదానిపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా పోరాటాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లవచ్చని తెలిపారు.

ముఖేశ్ అంబానీ అదాయం గంటకు రూ.90 కోట్లు

- ఐఐఎఫ్ఎల్ హురూన్ వెల్లడి



ముంబయి : శ్రమజీవుల కష్టార్జితంతో అనునిత్యం శ్రమ దోపిడితో దేశంలోని శత కోటీశ్వర్లు కోట్లకోట్లకు పడగలెత్తుతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అండదండలతో ఆక్టోపస్‌లా అన్ని రంగాల్లోకి చొరబడి దేశ వాణిజ్య రంగంలో గుత్తాధిపత్యం చలాయిస్తున్న రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ, అదానీ గ్రూపు సంస్థల అధిపతి గౌతమ్ అదానీ వంటి వాళ్ల ఆదాయం ఆకాశమే హద్దుగా పెరిగిపోతంది. ఆసియాలోని అత్యంత సంపన్న వ్యక్తిగా, ప్రపంచంలోనే 11వ అత్యంత ఐశ్వర్యవంతుడిగా రికార్డులకెక్కిన ముకేశ్ అంబానీ కొనసాగుతున్న సంపద ఏకంగా 106 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.9,15,405 కోట్లు. ఆయన గంటకు రూ.90 కోట్లు ఆర్జిస్తున్నారు. విస్తుపోయే ఈ అంశాలను ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురూన్ ఇండియా సంస్థ ఒక నివేదికలో వెల్లడించింది. ఆక్స్‌ఫామ్ రిపోర్టు కూడా ఇదే విషయాన్ని పేర్కొంది. 2020లో కోవిడ్ మహమ్మారి దేశమంతటా విస్తరించి అల్లకల్లోలం సృష్టించిన సమయంలోనూ భారత కార్పొరేట్ దిగ్గజాలకు ఆదాయాలు రెట్టించాయే కానీ ఇసుమంతైనా తగ్గింది లేదు. కోవిడ్ క్లిష్టపరిస్థితుల్లోనూ ముకేశ్ అంబానీ గంటకు రూ.90 కోట్లు చొప్పున సంపాదించినట్లు ఐఐఎఫ్ఎల్ పేర్కొంది. దేశంలో దాదాపు 24 శాతం మంది ప్రజలు నెలకు కేవలం రూ.3000 లోపు మాత్రమే సంపాదిస్తున్నారు. ముకేశ్ అంబానీలా సగటు భారతీయుడు సంపాదించాలంటే కలలో కూడా సాధ్యం కాదేమో. ఎందుకంటే స్టాటిస్టికా అంచనాల ప్రకారం..నెలకు రూ.33 వేలు (ఒక సంవత్సరానికి రూ.4 లక్షలు) ఆర్జించే సగటు వేతనజీవి అంబానీ ఒక గంటలో సంపాదించే రూ.90 కోట్ల మొత్తాన్ని సంపాదించాలంటే ఏకంగా 1.74 కోట్ల సంవత్సరాలు పడుతుందని పేర్కొంది. వాస్తవానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అండ్ మేనిజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ముకేశ్ అంబానీ వార్షిక వేతనం రూ.15 కోట్లు మాత్రమే. ఆయన ఒక రోజులో ఒక గంటలో సందించే ఆర్జనతో పోల్చితే ఇదే ఏమూలకూ సరిపోదు. ముకేశ్‌కు పెట్రో కెమికల్స్, రిఫైనింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ ఎక్స్‌ప్లోరేషన్, టెక్స్‌టైల్స్, రిటైల్, టెలికమ్యూనికేషన్స్ లాంటి భారీ వ్యాపార సామ్రాజ్యాలే ఉన్నాయి. వీటన్నంటిలో పనిచేస్తున్న లక్షలాది మంది కష్టజీవులు శ్రమను దోపిడి చేసినందునే అంబానీ గంటగంటకూ కోట్లకు కోట్లు పోగేసుకుంటున్నారని, ఇలాంటి సంపద కేంద్రీకరణతో దేశంలో తీవ్రమైన ఆర్థిక అసమానతలు ఏర్పడి పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలు తీవ్రమవుతాయని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ప్రకృతి సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను ఇలా కార్పొరేట్ వ్యక్తులకు దోచిపెట్టే విధానాలు మారాలని కోరుతున్నారు.

ఆగని హింస

(మొదటిపేజీ తరువాయి)

శివారులోని గంగమ్మ దేవాలయంలో రాత్రంతా తలదాచుకున్నారు. రాత్రి 8 గంటల నుండి 11 గంటల వరకు దాడులు కొనసాగాయని, ఇళ్లను, వాటిలోని బీరువాలను, టివిలను, ఫ్రిజ్‌లను, బయట ఉన్న ద్విచక్ర వాహనాలను, జీవనోపాధిగా ఉన్న ఆటోలను ధ్వంసం చేశారని, దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం విడిచి వెళ్లిపోవాలని, లేదంటే చంపేస్తామని హెచ్చరించారని వారు వాపోయారు.

తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత

అనంతపురం జిల్లా తాడిపత్రిలో టిడిపి, వైసిపి నేతల మధ్య దాడులు, ప్రతిదాడులు మంగళవారం కూడా కొనసాగాయి. టిడిపి నాయకులు సూర్యముని ఇంట్లోని ఫర్నీచర్‌ను కొందరు ధ్వంసం చేశారు. వైసిపి వారే ఈ ఘటనకు పాల్పడ్డారని టిడిపి వారు ఆరోపించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న టిడిపి నాయకులు ప్రతి దాడిగా రాళ్లురువ్వారు. తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో ఇరుగ్రూపులనూ పోలీసులు చెదరగొట్టారు. ఈ క్రమంలో తాడిపత్రి పట్టణ సిఐ మురళీకృష్ణ తలకు రాయి తగిలి గాయమైంది. సూర్యమునిపై దాడిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి మద్దతుదారులతో కలిసి ఆందోళనకు దిగారు. అనంతరం అక్కడి నుంచి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని అడ్డుకోవడానికి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అయినా, టిడిపి మద్దతుదారులు ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటి వైపు వెళ్లారు. వందలాదిమంది వైసిపి కార్యకర్తలు ఎదురుగా వచ్చారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ఇరుగ్రూపుల వారు ఒకరిపై ఒకరు దాదాపు మూడు గంటలపాటు రాళ్లు రువ్వుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనలో ఒక వైసిపి కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రకాశం జిల్లాలో రాళ్లతో పరస్పరం దాడులు
వాదంపల్లిలో పోలీస్ పికెట్ ఏర్పాటు

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వాదంపల్లి గ్రామానికి వైసిపి నాయకులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గత వారం రోజుల వరకు అందరూ ఈ నీళ్లు పట్టుకునేవారు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన ఎనిమిది ముదిరాజు కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. మంగళవారం గ్రామంలోకి వచ్చిన నీటి ట్యాంకర్ వద్దకు నీటి కోసం వెళ్లిన ఈ కుటుంబాలకు చెందిన మహిళలను వైసిపి వారు అడ్డుకున్నారు. 'మా ట్యాంకర్ల నీళ్లు మీకెందుకు?' అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో నెలకొన్న వివాదం ఇరుగ్రూపులకు చెందిన పురుషుల మధ్య రాళ్ల దాడికి దారి తీసింది. ఇరుగ్రూపులకు చెందిన ఐదుగురు గాయపడ్డారు. అడిషనల్ ఎస్‌పి పోలీసు బలగాలతో గ్రామానికి వచ్చి ఘర్షణను అదుపులోకి తెచ్చి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

హింసపై గవర్నరుకు చంద్రబాబు లేఖ


- డిజిపికి ఫిర్యాదు
- ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల అనంతరం రాష్ట్రంలో టిడిపి కార్యకర్తలు, నాయకుల ఇళ్లపై వైసిపి దాడులకు పాల్పడిందని టిడిపి అధినేత చంద్రబాబు... గవర్నర్, డిజిపికి లేఖ రాశారు. ముఖ్యంగా తిరుపతిలో పులివర్తినాని, పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తల ఇళ్లపై దాడి అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో మాచర్ల నియోజకవర్గంలో ఎక్కువ దాడులు జరిగాయని తెలిపారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తిరుపతిలో పులివర్తినానిపై జరిగిన దాడిపై ఎన్నికల సంఘానికీ ఫిర్యాదు చేశారు. దాడులు అంశాన్ని ముందుగానే పోలీసులు తెలిపినా స్పందించలేదని లేఖలో పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో వైసిపి నాయకులు పోలీసులను తీవ్రంగా కొట్టారని, అడ్డూ అదుపు లేకుండా కర్రలు, కత్తులు, రాళ్లతో దాడులకు తెగబడ్డారని వివరించారు. 2000 మంది వైసిపి కార్యకర్తలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు నేతృత్వంలో తెలుగు దేశం నాయకులే లక్ష్యంగా దాడులకు దిగారని, వారిని హత్య చేయాలనే కుట్ర ఉందని తెలిపారు. తాడిపత్రిలోనూ రెండోరోజు పెద్దారెడ్డి అనుచరులు దాడులు చేశారని వివరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడి ఇంటిపై పెద్దారెడ్డి నేతృత్వంలో దాడి చేశారని అన్నారు. హింసకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో గొడవలు జరగకుండా చర్యలు చేపట్టాలని డిజిపిని కోరుతూ మరో లేఖ రాశారు. పల్నాడు జిల్లాలో వైసిపి అరాచకానికి గురైన టిడిపి కారకర్తలకు అండగా ఉండేందుకు ప్రత్యేక కమిటీని చంద్రబాబు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో వర్ల రామయ్య, నక్కా ఆనంద్ బాబు, బొండా ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, లావు శ్రీకృష్ణదేవ రాయలు, జంగా కృష్ణమూర్తి, జూలకంటి బ్రహ్మారెడ్డి ఉన్నారు.

'మత' రాజకీయ ప్రకటనలు !

- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌కు కోట్లలో చెల్లింపులు, సింహభాగం బిజెపిదే
- ఆ పార్టీకి అనుకూలంగా అదృశ్య ఖాతాలు, విద్వేషాలు రెచ్చగొట్టడమే వాటి లక్ష్యం



న్యూఢిల్లీ : ఈ నెల 7న లోక్‌సభ ఎన్నికల మూడో దశ పోలింగ్ జరగడానికి రెండు వారాల ముందు మెటా వేదికల్లో రాజకీయ ప్రకటనల కోసం పేరొందిన 20 ప్రచార సంస్థలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లకు రూ.17 కోట్లు చెల్లించాయి. వీటిలో కనీసం 30 ప్రకటనలు మతపరమైనవి. ముస్లిములకు వ్యతిరేకంగా విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వీటిని ఉద్దేశించారు. ఏప్రిల్ 23-మే 6 తేదీల మధ్య జరిపిన చెల్లింపుల్లో కేవలం ఐదు మాత్రమే రాజకీయ పార్టీల నుంచి జరిగాయి. మిగిలిన పదిహేను స్వయం ఉపాధి పొందుతున్న వారు జరిపిన చెల్లింపులే. ఇవి అదృశ్య ఖాతాల నుంచి జరుగుతుంటాయి. ఇవి ఎవరివో తెలుసుకోవడం అసాధ్యం. వీరందరూ తమ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీల నుంచి రాజకీయ ప్రకటనలు ఇచ్చారు.

బిజెపి ఖర్చే అధికం

మూడో దశ పోలింగ్‌కు రెండు వారాల ముందు మెటా వేదికల్లో రాజకీయ ప్రకటనల కోసం బిజెపి అత్యధికంగా రూ.5.63 కోట్లు ఖర్చు చేసింది. కాంగ్రెస్ పార్టీ రూ.4.81 కోట్లతో రెండో స్థానంలో ఉంది. బిజూ జనతాదళ్ (బిజెడి) తన అనుబంధ పేజీ అయిన 'అమా చిన్హా సంకా చిన్హా' నుండి ప్రకటనల కోసం రూ.2.15 కోట్లు ఖర్చు చేసింది. బిజెపి అనుకూల ప్రకటనలు ఇచ్చే చరిత్ర కలిగిన ఫిర్ ఏక్‌బార్ మోడీ సర్కార్, మనమోడీ పేజీలను నిర్వహించే గుర్తు తెలియని ఖాతాల నుండి రూ.57.64 లక్షలు, రూ.42.17 లక్షల చెల్లింపులు జరిగాయి. తెలుగుదేశం (రూ.32.16 లక్షలు), తృణమూల్ కాంగ్రెస్ (రూ.23.84 లక్షలు) కంటే ఈ అదృశ్య (గుర్తు తెలియని) ఖాతాల నుండే ఎక్కువ మొత్తంలో చెల్లింపులు జరిగాయి. కాంగ్రెస్, బిజెడి, తెలుగుదేశం, తృణమూల్ కాంగ్రెస్ పెట్టిన ప్రకటనల ఖర్చును మినహాయిస్తే మిగిలిన చెల్లింపుల్లో అధిక భాగం బిజెపికి మద్దతు ఇస్తున్న సంస్థలు చేసినవే.

అదృశ్య ఖాతాల నుండి అనుకూల ప్రకటనలు

ఏప్రిల్ 19న జరిగిన తొలి దశ పోలింగ్‌కు ముందు కూడా అనేక గుర్తు తెలియని సంస్థలు మెటా వేదికల్లో బిజెపి అనుకూల ప్రకటనలు ఇచ్చాయి. వాటిలో చాలా వరకూ మతపరమైనవే. మెటా నిబంధనల ప్రకారం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో రాజకీయ ప్రకటనలు ఇచ్చేవారు ముందుగా తమ ఫోన్ నెంబర్లు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈ నెంబరుతో ఉన్న ఫోన్లన్నీ స్విచ్ ఆఫ్ చేసి ఉండడం గమనార్హం. నిబంధనలను తరచూ ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తామని మెటా ప్రతినిధి తెలిపారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే గుర్తు తెలియని వ్యక్తులు లేదా సంస్థలు ఇచ్చే రాజకీయ ప్రకటనలు మెటా విధానాలను ఉల్లంఘించడం లేదు. అందువల్ల వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

బిజెపి కర్ణాటక రాష్ట్ర శాఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ పోస్ట్ పెట్టింది. కాంగ్రెస్ పార్టీ ముస్లిములకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి తరగతుల రిజర్వేషన్లను లాక్కొని ముస్లిములకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని దాని సారాంశం. ఈ వీడియోను తొలగించాలంటూ ఎక్స్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశించింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఆ వీడియోను ఎక్స్ తొలగించింది. మెటా వేదికల్లో వచ్చిన బిజెపి అనుకూల ప్రకటనల కోసం రూ.27.6 లక్షలు ఖర్చు చేశారు. బిజెపి అనుకూల ప్రకటనలు నడిపే 'సిద్ధ ఛష్మా' అకౌంట్ కూడా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ ఓ యాడ్ ఇచ్చింది. ఏప్రిల్ 24-27 తేదీల మధ్య ఈ ప్రకటన వచ్చింది. దీనికి లక్షలాది హిట్లు కూడా వచ్చాయి. వీటిపై సిద్ధ ఛష్మా రూ.16 లక్షలు ఖర్చు చేసింది. ముద్దే కీ బాత్ పేరుతో ఉన్న మరో పేజీలో కూడా ఈ ప్రకటన వచ్చింది. మొత్తంగా బిజెపి అనుకూల ప్రకటనల కోసం సిద్ధ ఛష్మా రూ.31.64 లక్షలు, ముద్దే కీ బాత్ రూ.21.4 లక్షలు ఖర్చు చేశాయి.

రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎండనకా, వాననకా, అర్ధరాత్రి వరకూ క్యూలో నిలబడి ఓటు వేసిన కోట్లాది మంది రాష్ట్ర ప్రజలకు సిపిఎం రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం పోటీచేసిన అరకుపార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు సహా ఇండియా బ్లాక్‌లోని సిపిఐ, కాంగ్రెస్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీలకు ఓటేసిన ప్రజలకు, శ్రేయోభిలాషులకు ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రత్యేకించి రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజల తరుపున నిరంతరాయంగా పనిచేసిన పౌర సంఘాల నాయకులకు, రాజ్యాంగ పరిరక్షణ సంస్థ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.విజయరావు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ తదితరులకు వారి బృందాలకు సిపిఎం రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. వివిధ రూపాల్లో మద్దతిచ్చిన సిపిఐఎంఎల్‌తో సహా అన్ని వామపక్ష పార్టీలకు, అమ్‌అద్మీ, విసికె పార్టీకి కూడా ధన్యవాదాలు తెలిపారు. లౌకికతత్వ పరిరక్షణ కోసం ఎన్నికల్లో పనిచేసిన వివిధ ప్రజా సంఘాలు ప్రత్యేకించి కార్మిక, రైతు, యువజన, విద్యార్థి, మహిళ, సామాజిక రంగాలకు, ఆదివాసీ, దళిత సంఘాల నాయకులకు, సోషల్‌మీడియా, జర్నలిస్టులకు ధనవ్యాదాలు తెలిపారు. ఎన్నికల్లో తీర్పు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల తరుపున సిపిఎం నిరంతరాయంగా నిలబడి భవిష్యత్‌లో కూడా పోరాడుతుందని హామీ ఇస్తున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

- 33 మంది అనుచరులపైనా...

ప్రజాశక్తి - బేతంచెర్ల (నంద్యాల) / చాపాడు (వైఎస్ఆర్ జిల్లా)

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపైనా, వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపైనా మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 13న నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పిఎన్‌బాబు బేతంచెర్లలోని పోలింగ్ బూత్‌లను సందర్శించడానికి తన కారులో వెళ్తుండగా బుగ్గన తన అనుచరులతో కలిసి పిఎన్ బాబుపై దాడి చేసి కులం పేరుతో దూషించారు. పిఎన్‌బాబు కారును ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై బాధితుడు బేతంచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రి బుగ్గన, తన అనుచరులు 33 మందిపై ఎఫ్ఐ ఆర్ నం.109/2024 U/S 427 R/W, 34 IPC,3(1)(R) 3,(1), సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు బేతంచెర్ల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మాసూం బాష తెలిపారు.

వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రఘురామిరెడ్డితో సహా ఆయన అనుచరులు 11 మందిపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం పోలింగ్ సందర్భంగా చాపాడు మండల పరిధిలోని చిన్నగులవలూరులో ఇద్దరు టిడిపి ఏజెంట్లు కుచ్చుపాప ఉగ్ర నరసింహులు, వినోద్‌లపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో ఇరువురికీ బలమైన గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని కర్నూలు ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డితోపాటు పాలగిరి లక్ష్మీనారాయణరెడ్డి, మనీష్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సగిలి చంద్ర ఓబుళరెడ్డి, గంజికుంట హర్షవర్ధన్‌రెడ్డి, బోరా శంకర్‌రెడ్డి, ఏరాశి భాస్కర్‌రెడ్డి, పాలగిరి చంద్రమోహన్‌రెడ్డి, చంగా చంద్ర ఓబుల్‌రెడ్డిలపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సోమవారం ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ వంద మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని చెప్పారు. 11 మందిపైనే కేసు నమోదు చేశామని చెప్పడం వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమానంతో భార్యపై దాడి

- ఆస్పత్రికి తరలించిన స్థానికులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అనుమానం పెనుభూతమై భార్యపైనే విచక్షణారహితంగా భర్త దాడి చేశాడు. ఈ ఘటన చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలం జానకారపల్లిలో దంపతులు ఉమాపతి, స్వాతి నివసిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉమాపతి జెసిబి మెకానిక్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల స్వాతి మీద అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇరివురి మధ్య గొడవలు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంగళవారం మధ్నాహ్యం తన పుట్టింటికి వెళ్లేందుకు యాదమరి మండలం బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి ముత్తరపల్లి బస్టాప్‌కు స్వాతి చేరుకున్నారు. ఉమాపతి కూడా బస్టాప్‌కు వచ్చి స్వాతిపై కత్తితో విచక్షణారహితంగా చెయ్యి, కాళ్లు, తల మీద దాడి చేశాడు. రక్తపుమడుగులో పడి ఉన్న స్వాతిని స్థానికులు గమనించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనాన్ని చూసి ఓర్వలేకే వైసిపి దాడులు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలింగ్ బూత్‌ల వద్ద జనసునామీని చూసి ఓర్వలేని జగన్, అతని గ్యాంగ్ దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, వైసిపి అభ్యర్థులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రగిరిలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని, దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. జూన్ 4న బ్యాలెట్ బాక్సులు తెరిస్తే.. వైసిపి నాయకులు రాష్ట్రం విడిచి పరారవుతారని, పగిన తలలకు, చిందిన రక్తానికి రెట్టింపు మూల్యం చెల్లించుకోవడానికి వైసిపి నేతలు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

మాచర్ల, చంద్రగిరి ఘటలనపై డిజిపితో మాట్లాడిన చంద్రబాబు

టిడిపి కార్యకర్తలు, వారి ఆస్తులపై వైసిపి వరుస దాడులు, విధ్వంసాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర డిజిపిని కోరారు. మాచర్ల, చంద్రగిరి, తాడిపత్రి ఘటనలపై ఆయన డిజిపితో మాట్లాడారు. పోలింగ్ అనంతరం వైసిపి ఎమ్మెల్యే పిన్నెల్లి దాడులకు పాల్పడుతున్నారని, మాచర్లలో వందల మంది ప్రైవేటు సైన్యంతో జరుగుతున్న దాడులను అరికట్టడానికి అదనపు బలగాలను పంపాలని చంద్రబాబు కోరారు. దాడులకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేయాలన్నారు.

సొంత కాంట్రాక్టర్లకు నిధులు చెల్లిస్తున్నారని ఫిర్యాదు

- గవర్నరుకు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లబ్ధిదారులకు చెందాల్సిన నిధులను సిఎం జగన్ సొంత కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నారని, తక్షణమే దీనిని నిలుపుదల చేయాలని గవర్నరు అబ్దుల్ నజీర్‌కు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మంగళవారం లేఖ రాశారు. జగన్ ప్రభుత్వం చివరి నిమిషంలో తన సొంత కాంట్రాక్టర్లకు నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు విడుదల చేసేందుకు సిద్ధమైందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌కు నెలల ముందు డిబిటి పథకాలకు ముఖ్యమంత్రి అధికారికంగా బటన్ నొక్కినా గడువులోపు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించిందన్నారు. 'అప్పులపైన ఆధారపడి రోజువారీ రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందన్న విషయం మీకు తెలిసిందే. ప్రభుత్వ నిర్వహణ కోసం భారత రిజర్వ్ బ్యాంకు, బ్యాంకుల నుంచి తరచూ ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లింది. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు, పిఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వాటిని కూడా చెల్లించకుండా ప్రభుత్వం బకాయిలు పెట్టింది. ఆరోగ్య శ్రీకి బకాయిలు చెల్లించకపోవడంతో సేవలు నిలిపేస్తామని ఆస్పత్రి యాజమాన్యాలు చెప్తున్నాయి. ఫైనాన్స్ కమిషన్ ద్వారా పంచాయతీరాజ్‌కు చెందాల్సిన నిధులనూ ప్రభుత్వం దారి మళ్లించింది. రుణాల కింద రూ.4 వేల కోట్లు, బాండ్ల ద్వారా రూ.7 వేల కోట్లను ప్రభుత్వం సమీకరించింది. ఈ నిధులన్నీ ఉద్యోగులకు, పంచాయతీలకు, ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు చెల్లించకుండా అనుకూల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు ప్రయత్నం చేస్తోంది' అని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే రాజకీయ స్వార్థం కోసం చేసే ఇటువంటి పనులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదముందని, లబ్ధిదారులకు మేలు చేసే డిబిటి పథకాలకు నిధులు చెల్లించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించాలని చంద్రబాబు ఆ లేఖలో గవర్నర్‌ను కోరారు.

తెలంగాణలో 65.67 శాతం పోలింగ్

- అత్యధికంగా భువనగిరిలో 76.78, ఖమ్మంలో 76.09
- అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48 శాతం
- ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ లోక్‌సభ 2024 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 65.67 శాతం పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యధికంగా భువనగిరిలో 76.78 నమోదు కాగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48 శాతం ఓటింగ్ జరిగిందన్నారు. అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ, మహబూబ్‌బాద్, ఖమ్మం తదితర పది జిల్లాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదైందని వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజక వర్గాల్లో ఎప్పటిలాగే 50 శాతం లోపు పోలింగ్ నమోదైందని తెలిపారు. మొత్తం 3,32,16,348 మంది ఓటర్లకు గాను 2,20,24,806 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇందులో ఓటర్ ఫెసిలిటీ సెంటర్లు, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ద్వారా 2,10,771 మంది ఓటేశారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే గతేడాది కన్నా 2.90 శాతం పోలింగ్ పెరిగిందని వివరించారు. అసెంబ్లీ సెంగ్మెట్ల వారీగా చూస్తే అత్యధికంగా నర్సాపూర్‌లో 84.25 శాతం, అత్యల్పంగా మలక్‌పేటలో 42.76 శాతం పోలింగ్ నమోదైందని, ఓట్ల పరంగా చూస్తే మేడ్చల్ నియోజకవర్గంలో అత్యధికంగా 3,85,149 ఓట్లు నమోదు కాగా, అత్యల్పంగా భద్రాచలంలో1,05,383 ఓట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత ఇవిఎంలను మూడంచెల భద్రత, నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంచామని పేర్కొన్నారు. జూన్ 4న కౌంటింగ్ కోసం ఒక్కో నియోజకవర్గానికి రెండు చొప్పున రాష్ట్రంలో 34 కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు,. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం

క్ర.సం	నియోజకవర్గం	2019	2024
1)	అదిలాబాద్(ఎస్‌టి)	69.81	77.03
2)	మహబూబాబాద్ (ఎస్‌టి)	68.60	71.85
3)	వరంగల్ (ఎస్‌సి)	64.08	68.86
4)	నాగర్ కర్నూల్ (ఎస్‌సి)	66.53	69.46
5)	పెద్దపల్లి (ఎస్‌సి)	63.86	67.87
6)	కరీంనగర్	67.67	72.54
7)	మెదక్	71.33	75.09
8)	మల్కాజిగిరి	46.27	50.78
9)	సికింద్రాబాద్	42.48	49.04
10)	నిజామాబాద్	67.96	71.92
11)	జహీరాబాద్	71.91	74.63
12)	హైదరాబాద్	39.17	48.48
13)	నల్లగొండ	70.36	74.02
14)	భువనగిరి	72.34	76.78
15)	ఖమ్మం	70.76	76.09
16)	మహబూబ్ నగర్	68.40	72.43
17)	చేవెళ్ల	53.15	56.50

అదరగొట్టిన ప్రభుత్వ బ్యాంక్‌లు

- రూ.1.4 లక్షల కోట్ల రికార్డ్ లాభాలు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మెరుగైన ప్రగతిని కనబర్చు తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో ఏకంగా 35 శాతం వృద్ధితో రూ.1.41,203 కోట్ల నికర లాభాలను సాధించాయి. దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంక్(పిఎస్‌బి)లు 2022-23లో రూ.1,04,649 కోట్ల లాభాలను ప్రకటించాయి. క్రితం ఆర్థిక సంవత్సరం మొత్తం లాభాల్లో ఒక్క ఎస్‌బిఐనే 40 శాతం వాటాను కలిగి ఉంది. మోడీ ప్రభుత్వ హయంలో చేపట్టిన పెద్ద నోట్ల రద్దు, లక్షల కోట్ల రుణాల మాఫీలోనూ పిఎస్‌బిలు రాణించడం విశేషం. 2023-24నకు సంబంధించిన ఆర్థిక ఫలితాలను ఇటీవల పిఎస్‌బిలు ప్రకటించాయి. దిగ్గజ ఎస్‌బిఐ ఏకంగా 22 శాతం పెరుగుదలతో రూ.61,077 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం 2022-23లో రూ.50,232 కోట్ల లాభాలను ఆర్జించింది. 2023-24లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) 228 శాతం వృద్ధితో రూ. రూ.8,245 కోట్ల నికర లాభాలను ప్రకటించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 62 శాతం పెరుగుదలతో రూ.13,649 కోట్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 61 శాతం వృద్ధితో రూ.2,549 కోట్ల చొప్పున లాభాలను నమోదు చేశాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా 50 శాతం పెరుగుదలతో రూ.6,318 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభాలు 56 శాతం పెరిగి రూ.4,055 కోట్లుగా, ఇండియన్ బ్యాంక్ 53 శాతం వృద్ధితో రూ.8,063 కోట్ల చొప్పున లాభాలు సాధించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.17,788 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.14,554 కోట్లు చొప్పున లాభాలను ప్రకటించాయి. పిఎస్‌బిల్లో ఒక్క పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ లాభాలు మాత్రమే 55 శాతం తగ్గి రూ.595 కోట్లుగా నమోదు చేసింది.

ఎఐతో ఉద్యోగాలకు పెను ముప్పు

- ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా హెచ్చరిక



జ్యూరిచ్ : కృత్రిమ మేధా(ఎఐ)తో ఉద్యోగాలకు పెను ముప్పు పొంచి ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. జ్యూరిచ్‌లో జరిగిన ఓ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎఐ ఉద్యోగ మార్కెట్‌పై సునామీలా విరుచుకుపడొచ్చని హెచ్చరించారు. వచ్చే రెండేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాల్లో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయని పేర్కొన్నారు. ఎఐ దెబ్బతో అభివృద్ధి చెందిన దేశాల్లో 60 శాతం ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా చూసినప్పుడు ఈ సంఖ్య 40 శాతం వరకు ఉండొచ్చన్నారు. ఎఐని సరిగ్గా నిర్వహించకుంటే ఆదాయ అసమానతలకూ దారి తీస్తుందని హెచ్చరించారు. ఎఐ అభివృద్ధి, ఆచరణలోకి తీసుకురావడానికి అన్ని దిగ్గజ కంపెనీలు పోటీ పడుతున్న విషయం తెలిసిందే. చాట్‌జిపిటి మాతృ సంస్థ ఓపెన్ ఎఐ జిపిటి-4 మోడల్‌ను ఆవిష్కరించగా.. గూగుల్ ఆండ్రాయిడ్ టెక్నాలజీకి మరిన్ని ఎఐ ఫీచర్లను జోడిస్తోంది.

ఐటిఐలలో ప్రవేశాల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలలో వివిధ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్‌లలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి, శిక్షణ సంస్థ డైరెక్టరు బి నవ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఐటిఐ.ఎపి.జివొవి.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఆఖరు తేదీ జూన్ 10గా నిర్ధారించామని, ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసే క్రమంలో ఎటువంటి తప్పులు లేకుండా సరిచేసుకుని నింపాలన్నారు. ఇతర వివరాల కోసం దగ్గర్లోని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని సూచించారు.

24న ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష

దేవానందరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఈ నెల 24న ఉదయం 9:30 నుంచి 12:45 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. 2024 మార్చిలో ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన అభ్యర్థులందరి హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీని ఎంచుకోవడం ద్వారా వారి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

8 వేల పేజీలతో కవితపై ఛార్జిషీట్

- 20న పరిశీలిస్తామన్న ట్రయల్ కోర్టు
- అప్పటి వరకు కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ లిక్కర్ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎనిమిది వేల పేజీలతో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపింది. ఈ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ఇడి తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్‌కె మట్ట కోరారు. ఇడి కేసులో గతంలో కవితకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగిసింది. దీంతో తీహార్ జైలు సిబ్బంది మధ్యాహ్నం 2 గంటలకు ఆమెను వర్చువల్ మోడ్‌లో ట్రయల్ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజా ముందు హాజరుపరిచారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం కవితకు మరో 6 రోజుల జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తున్నట్లు తెలిపారు. కాగా, సిబిఐ కేసులోనూ కవిత జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 20 వరకు పొడిగించింది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత పాత్రపై దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ఈ నెల 20న పరిశీలిస్తామని ట్రయల్ కోర్టు తెలిపింది. ఎమ్మెల్సీ కవిత, ఆప్ గోవా ప్రచారాన్ని నిర్వహించిన ముగ్గురు ఉద్యోగులు (చారియట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్) దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చన్‌ప్రీత్ సింగ్, ఇండియా ఎహెడ్ న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్లను తాజా ఛార్జ్‌షీట్‌లో నిందితులుగా ఇడి చేర్చింది.

వయోజనులందరికీ బిసిజి టీకా

- 16న 12 జిల్లాల్లో తొలి విడత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

18 ఏళ్లు నిండిన వారందరికీ బిసిజి టీకా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ నెల 16 నుంచి 12 జిల్లాల్లో మొదటి విడతగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 నాటికి రాష్ట్రంలో టిబిని నిర్మూలించడంతోపాటు, కేసులను గణనీయంగా తగ్గించేందుకు ఈ టీకా అందజేస్తున్నట్లు వారు ప్రకటించారు.

తొలి విడతగా అల్లూరి సీతారామరాజు, విశాఖ, విజయనగరం, నెల్లూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల, కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆరు కేటగిరీలకు చెందిన అర్హులైన వ్యక్తులకు మూడు నెలల వ్యవధిలో ఈ టీకా అందించనున్నట్లు వారు వివరించారు. జిల్లా క్షయ నివారణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారుల సంయుక్త ఆధ్వర్యాన ఈ కార్యక్రమం ఉంటుందని, క్షేత్రస్థాయిలో ఎఎన్ఎం, ఆశా, సిహెచ్, టిబి ఛాంపియన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే నోడల్ ఆఫీసర్లను నియమించామని చెప్పారు. ఐదేళ్ల క్రితం టిబి మందులు వాడి తగ్గించుకున్నవారు, ధూమపానం అలవాటు ఉన్నవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, తదితరులకు ఈ టీకా వేస్తామని వెల్లడించారు. బిసిజి టీకా వయోజనులకు సురక్షితమైనదని, టిబి రాకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ టీకా వేసుకోవాలని అధికారులు కోరారు.

తలకు దెబ్బ తగిలి ఉపాధి కార్మికురాలు మృతి

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

ఉపాధి పనులు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఉపాధి కార్మికురాలు దుర్మరణం చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని బిల్లగూడ కాలనీలో రూ.మూడు లక్షలు ఉపాధిహామీ నిధులతో కొండ వద్ద టెర్రసింగ్ రాతి కట్టు పనులు జరుగుతున్నాయి. అదే కాలనీకి చెందిన సవర ఆదమ్మ (48), గంగమ్మ తోటి కార్మికులతో కలిసి ఉపాధి పనులకు వెళ్లారు. పనులు జరుగుతుండగా, పై నుంచి రెండు రాళ్లుఆదమ్మ తలపై, గంగమ్మ కాలుపై పడ్డాయి. ఆదమ్మ తీవ్రంగా గాయపడడంతో ఆమెను కుసిమి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు.

అక్కడ ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. కాలికి గాయమైన గంగమ్మను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీతంపేట ఎస్ఐ జగదీష్ నాయుడు దర్యాప్తు చేస్తున్నారు. ఆదమ్మకు భర్త తుంబయ్య, కుమార్తె ఉన్నారు. ఎపిఒ సాగర్ శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని, గాయపడిన గంగమ్మను పరామర్శించారు.

సంపాదకీయం

ఘోర వైఫల్యం

అంధ విశ్వాసాలపై అలుపెరగని పోరాటం చేసిన సుప్రసిద్ధ హేతువాది డాక్టర్ నరేంద్ర దబోల్కర్ హత్య కేసులో పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదు. ఆ అంధ విశ్వాసాలతోనే అందలాలెక్కుతున్న నేతల ఒత్తిళ్లే ఈ కేసులో అసలు సూత్రధారులను తప్పించాయి. దబోల్కర్‌ను కాల్చి చంపిన సనాతన సంస్థకు చెందిన ఇద్దరికీ పుణె ప్రత్యేక కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించింది. తొలుత మహారాష్ట్ర పోలీసులు, ఆ తరువాత కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) పదేళ్లకుపైగా సాగదీసి ఆధారాలు సేకరించని అసమర్థత వల్లే ప్రధాన నిందితుడు వీరేంద్ర తవాడేతోపాటు సంజీవ్ పునలేకర్, విక్రమ్ భవే విడుదలయ్యారు. ఈ ముగ్గురి పాత్ర లేకపోవడం వల్ల విడుదల చేయడం లేదని, వారిపై అభియోగాలను నిరూపించడంలో మహారాష్ట్ర పోలీసులు, సిబిఐ వైఫల్యం వల్లే నిర్దోషులుగా విడుదల చేస్తున్నామని న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల లోపాలను కళ్లకు కడుతున్నాయి.

రాజ్యాంగంలో నిర్దేశించినట్లు శాస్త్రీయ, హేతువాద దృక్పథాన్ని ప్రచారం చేస్తూ, భిన్నత్వంలో ఏకత్వం ప్రాధాన్యతను చాటిచెప్పి, ప్రజల్లో ఐక్యత సాధించేందుకు డాక్టర్ దబోల్కర్ విశేష కృషి చేశారు. 2005 మహారాష్ట్ర మూఢ నమ్మకాల నిరోధక బిల్లు రూపుదిద్దుకోవడంలో కీలక పాత్ర పోషించారు. మూఢ నమ్మకాలపై డ్రాఫ్ట్ తయారు చేసి ఇచ్చినా అసెంబ్లీలో ఎందుకు చర్చించడం లేదని పాలక పక్షాలను నిలదీశారు. తాను రూపొందించిన బిల్లుపై చర్చించి ఆమోదించాలని ఒత్తిడి చేశారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు అనేక సమావేశాలు నిర్వహించారు. తమకు అభ్యంతరాలున్నాయంటూ బిజెపి, శివసేనతోపాటు పలు మితవాద సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించినా ఆయన ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. మూఢనమ్మకాలపై పోరాడుతున్న తనను హత్య చేసేందుకు మితవాద సంస్థలు కుట్రలు పన్నుతున్నాయని ఆయన స్వయంగా చెప్పినా రక్షణ కల్పించడంలో అప్పటి రాష్ట్రప్రభుత్వ విఫలమైంది. సైద్ధాంతిక విరోదులను హత్య చేయడానికి ప్రణాళికలు రూపొందించిన సనాతన సంస్థ సభ్యులిద్దరు 2013 ఆగస్టులో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఆయనను దారుణంగా కాల్చి చంపారు. దబోల్కర్ హత్య జరిగిన మరునాడే ఆయన రూపొందించిన ముసాయిదా బిల్లుకు క్యాబినెట్, అసెంబ్లీ ఆమోదం తెలిపాయి. ఇది రాష్ట్రపతి ఆమోదం పొందడం, చట్టం రూపం దాల్చడం ఇప్పటివరకూ జరగకపోవడం గమనార్హం. మహారాష్ట్ర, కర్ణాటక దర్యాప్తు సంస్థలందించిన వివరాల ప్రకారం దబోల్కర్ హత్యతోపాటు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో 2015లో వామపక్ష నేత గోవింద్ పన్సారే హత్య కేసులోనూ గోవాకు చెందిన సనాతన సంస్థ, దాని సోదర సంస్థ హిందూ జనజాగృతి పాత్రకు స్పష్టమైన ఆధారాలున్నాయి. 2015 ఆగస్టులో ప్రముఖ కన్నడ కవి, విద్యావేత్త డాక్టర్ ఎంఎం కల్బుర్గిని ధార్వాడ్‌లోనూ, కర్ణాటకకు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేష్‌ను బెంగళూరులో 2017 సెప్టెంబర్‌లోనూ హత్య చేయడానికి ఉపయోగించిన తుపాకీ ఒక్కటేనని దర్యాప్తు సంస్థల పరిశోధనల్లో తేలింది. సనాతన సంస్థకు చెందిన ముఠానే ఈ దారుణాలకు పాల్పడిందని తొలుత నిర్ధారించింది కర్ణాటక పోలీసులే కావడం గమనార్హం. సనాతన సంస్థకు చెందిన ఐదుగురిని ప్రధాన కుట్రదారులుగా పేర్కొన్న సిబిఐ.. ఈ కుట్ర మూలాల్లోకి వెళ్లడంలో, కీలక పాత్రదారులను గుర్తించడంలో వైఫల్యం మూటగట్టుకుంది. హేతువాదులు, ప్రజా చైతన్యం కోసం కృషి చేసేవారు, రచయితలు, జర్నలిస్టులు... ఇలా ఒక జాబితా తయారు చేసుకుని దారుణంగా హత్యలు చేసిన ఈ ముఠా ఆటకట్టించకపోవడం క్షమార్హం కాదు. 2013 తరువాత రాజకీయంగా వచ్చిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఈ కేసుపై ప్రభావం చూపాయి. ఈ కేసును మహారాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేయడంతోపాటు నిందితులందరికీ శిక్ష పడేలా చేయాలి. మూఢ నమ్మకాలను నిర్మూలించడానికి విజ్ఞానాన్ని, ఆలోచనలను పెంచడంతోపాటు అందుకు అవసరమైన చట్టాలు చేయాలని పోరాడిన దబోల్కర్ ఆశయాల సాధనకు చేసే పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలి. దబోల్కర్ హత్య కేసుతోపాటు గోవింద్ పన్సారే, డాక్టర్ కల్బుర్గి, గౌరీ లంకేష్ హత్యల వెనుకవున్న కుట్రలను బయటపెట్టి, భాగస్వాములందరినీ, ముఖ్యంగా హత్యల వెనుక ఉన్న సైద్ధాంతిక సూత్రధారులను శిక్షించినప్పుడే ఈ కేసులో న్యాయం జరుగుతుంది.

మంచి మాట



నిరుద్యోగ సైన్యం నిరంతరం సంసిద్ధంగా ఉంటేనే శ్రమ దోపిడీ యథేచ్ఛగా సాగుతుంది. అందుకే పెట్టుబడిదారీ విధానం ఉన్నంతకాలం నిరుద్యోగం ఉంటుంది.

- కారల్ మార్క్స్

Karl Marx

అంతర్జాతీయం

అమెరికా విద్యార్థి ఉద్యమం

నాడు వియత్నాం! నేడు పాలస్తీనా !



ఎం. కోటేశ్వరరావు

పాలస్తీనా ప్రాంతమైన గాజాలో ఇజ్రాయిల్ మిలిటరీ రఫా, తదితర ప్రాంతాల్లో మారణకాండను తీవ్రం చేస్తోంది. చివరకు ఐరాస తరపున పనిచేస్తున్న సహాయ సిబ్బందిని కూడా వదలటం లేదు. సోమవారం జరిపిన దాడుల్లో ఐరాస తరపున పనిచేస్తున్న వారిలో మన దేశానికి చెందిన వ్యక్తి మరణించాడు. రఫా లోని ఐరోపా ఆసుపత్రికి ఒక వాహనంలో ఇతరులతో కలసి వెళుతుండగా ఇజ్రాయిల్ మిలిటరీ జరిపిన దాడిలో అతడు మరణించగా మిగిలిన వారికి గాయాలయ్యాయి. గతేడాది అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు 35 వేల మందికి పైగా మరణించారు. వారిలో 70 శాతం పైగా పిల్లలు, మహిళలు ఉన్నారు. పాలస్తీనియన్ల ఊచకోత గురించి అణు మాత్రమైనా పట్టని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు యూదు వ్యతిరేకత పెరుగుతోందని మాత్రం గుండెలు బాదుకుంటున్నాయి. ఆ సాకుతో ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయి. కొద్ది వారాల క్రితం అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలోనే ప్రారంభమైన ఉద్యమం ఇప్పుడు కెనడా, ఐరోపా ముఖ్యంగా బ్రిటన్‌కు విస్తరించింది. రఫా మీద దాడులను అంగీకరించేది లేదన్నది అమెరికా ఉత్తుత్తి బెదిరింపు మాత్రమే అని తేలిపోయింది. మంగళవారం నాటికి అందిన సమాచారం మేరకు ఆ నగరం పరిసరాలలో ఉన్న 14 లక్షల మంది జనాభాలో సగం మంది దాడులను తప్పించుకొనేందుకు ఇతర ప్రాంతాలకు పారిపోయారు.

ప్రతి మతంలోనూ దురహంకారులు ఉంటారు. దానికి యూదు అతీతం కాదు. ఐరోపాలో ముందుకు తెచ్చిన యూదు వ్యతిరేకత వారిని అష్టకష్టాలపాలు చేసింది. లక్షలాది మంది ప్రాణాలు తీసింది. ఆ దుర్మార్గాన్ని యావత్ ప్రపంచం ఖండించింది. కానీ ఇప్పుడు అదే మత ప్రాతిపదికన ఏర్పడిన ఇజ్రాయిల్ పాలకుల అరబ్ లేదా ముస్లిం వ్యతిరేకతను అనేక పశ్చిమదేశాలు నిస్సిగ్గుగా సమర్థిస్తున్నాయి. పాలస్తీనా సాగిస్తున్న మారణకాండకు మద్దతు ఇస్తున్నాయి. దానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించి మానవ హక్కులను కాపాడాలని కోరుతున్నారే తప్ప యూదు వ్యతిరేకతను ముందుకు తీసుకురాలేదు. ఇజ్రాయిల్ పాలకులు యూదు దురహంకారులు తప్ప అక్కడ ఉన్న సామాన్య పౌరులందరూ అలాంటి వారే అనటం లేదు. ఐరాస తీర్మానం ప్రకారం పాలస్తీనా ఏర్పడకుండా అడ్డుకుంటున్నది అక్కడి పాలకులు, యూదు ఉన్మాదం తలకెక్కించిన మిలిటరీ, వారిని తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న పశ్చిమ దేశాలు తప్ప పౌరులు కాదు. పాలస్తీనాలోని గాజా, పశ్చిమ గట్టు, తూర్పు జెరూసలెం ప్రాంతాలలోని పౌరులపై దశాబ్దాల తరబడి సాగిస్తున్న దమనకాండ గురించి తన పౌరులకు బోధ చేసేందుకు ఎన్నడూ ఒక చట్టం చేయని అమెరికా పార్లమెంటు దిగువసభ ఇటీవల "యూదు వ్యతిరేక జాగృతి బిల్లు" తెచ్చింది. దానికి 91 మంది వ్యతిరేకంగా ఓటు వేయగా 320 మంది మద్దతు తెలిపారు. యూదు వ్యతిరేకత అమెరికాలో ఉన్న యూదు విద్యార్థుల మీద ప్రభావం చూపుతుందని చట్టం ప్రకటించింది. దాన్ని సెనెట్ కూడా ఆమోదిస్తే అధ్యక్షుడి ఆమోదంతో చట్టంగా మారుతుంది. ఒకసారి అది ఉనికిలోకి వస్తే వివాదాస్పద యూదు వ్యతిరేక నిర్వచనాలతో విద్యార్థులు, ఇజ్రాయిల్ దమనకాండపై గళమెత్తే ఇతరులను అణచివేసే అవకాశం ఉంది. ఈ బిల్లును సెనెట్ ఆమోదించకూడదని అనేక మంది కోరుతున్నారు. విద్యార్థులు చేస్తున్నది మరొక యుద్ధ వ్యతిరేక ఉద్యమం కాగా దాన్ని యూదు వ్యతిరేకమైనదిగా పశ్చిమ దేశాల మీడియా చిత్రించటం పాలక వర్గాల కనుసన్నలలో నడవటం తప్ప మరొకటి కాదు.

గతంలో వియత్నాంపై జరిపిన దురాక్రమణ, హత్యాకాండ, అత్యాచారాలకు నిరసనగా అమెరికా యువత పెద్ద ఎత్తున నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. చివరకు బతుకు జీవుడా అంటూ అమెరికన్లు అక్కడి నుంచి పారిపోయి వచ్చారు. అక్కడ కనీసం 30 లక్షల మంది అమాయక పౌరులను అమెరికన్ సైనికులు హతమార్చారు. గతంలో వియత్నాంలో మాదిరి ఇప్పుడు గాజాలో జరుగుతున్న మారణ కాండలో అమెరికా ప్రత్యక్ష భాగస్వామి కాదు. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వటాన్ని వ్యతిరేకించటం అమెరికా యువతలో పెరిగిన చైతన్యానికి ఒక నిదర్శనం. గతంలో మాదిరి జరుగుతున్నవాటిని మూసి పెట్టటం ఇప్పుడు సాధ్యం కాదు. అమెరికాలో జరుగుతున్నదాని గురించి ఒక విశ్లేషకుడు ఒక సినిమా కథతో పోల్చాడు. 'మోర్ఫస్' అనే చిత్రంలో ఒక వ్యక్తి తన వద్దకు వచ్చిన ఆశ్రితుడికి ఎరుపు, నీల వర్ణపు రంగుల మాత్రలు ఇచ్చి ఏదో ఒకటి తీసుకోమంటాడు. ఎరుపు రంగు దాన్ని సేవించిన వారికి తమ చుట్టూ జరుగుతున్న భయంకర అంశాలన్నీ కనిపిస్తాయి. అదే నీలి రంగు మాత్ర వేసుకుంటే నిజంగా జరుగుతున్నదాన్ని మరిపింపచేస్తుంది. ఆ సినిమాలో ఆశ్రితుడు ఎర్ర రంగు మాత్ర తీసుకున్నట్లుగా ఇప్పుడు అమెరికా సమాజంలోని నవ తరం కూడా అదే మాదిరి పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ జరుపుతున్న అకృత్యాలను చూస్తున్నారని, వ్యతిరేకంగా స్పందిస్తున్నారని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా జరుగుతున్న చర్చలో ఒక్క ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వటమే కాదు తమ ప్రభుత్వం అనేక చోట్ల ఉగ్రవాద వ్యతిరేక చర్యల పేరుతో జరుపుతున్న దారుణాలను కూడా ఇప్పుడు విద్యార్థులు స్పష్టంగా చూస్తున్నారు.

> **"గతంలో వియత్నాంపై జరిపిన దురాక్రమణ, హత్యాకాండ, అత్యాచారాలకు నిరసనగా అమెరికా యువత పెద్ద ఎత్తున నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. చివరకు బతుకు జీవుడా అంటూ అమెరికన్లు అక్కడి నుంచి పారిపోయి వచ్చారు. అక్కడ కనీసం 30 లక్షల మంది అమాయక పౌరులను అమెరికన్ సైనికులు హతమార్చారు. గతంలో వియత్నాంలో మాదిరి ఇప్పుడు గాజాలో జరుగుతున్న మారణకాండలో అమెరికా ప్రత్యక్ష భాగస్వామి కాదు. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వటాన్ని వ్యతిరేకించటం అమెరికా యువతలో పెరిగిన చైతన్యానికి ఒక నిదర్శనం."**


అమెరికా జరుపుతున్న దారుణాలను ప్రపంచం చూస్తున్నప్పటికీ ఇటీవలి కాలంలో అమెరికన్లు వాటిని ఏ మేరకు గమనించారన్న చర్చ ఒకటి ఉంది. ఏదైనా శృతి మించితే వారు కూడా స్పందిస్తారని తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. పాలస్తీనా విముక్తి కోసం పోరాడుతున్నవారిని ఉగ్రవాదులని అమెరికా ఎప్పటి నుంచో చిత్రిస్తున్నది. ప్రతి దేశంలో సామ్రాజ్యవాదం, నిరంకుశ పాలకులు చేసింది అదే. ఉగ్రవాదంపై పోరు పేరుతో అమెరికా సాగిస్తున్న చర్యలతో నిజానికి ఉగ్రవాదం పెరిగింది తప్ప తగ్గలేదు. అనేక మందిని ఉగ్రవాదులుగా మార్చిందంటే అతిశయోక్తి కాదు. బ్రౌన్ విశ్వవిద్యాలయం జరిపిన ఒక విశ్లేషణ ప్రకారం వివిధ దేశాలలో అమెరికా కారణంగా 45 లక్షల మంది మరణించారు. వారిలో అమెరికా మిలిటరీ ప్రత్యక్షంగా తొమ్మిది లక్షల మందిని చంపివేసింది. కనీసం 3.8 కోట్ల మంది తమ నెలవులు తప్పారు. ఎమెన్ అంతర్యుద్ధంలో అమెరికా మద్దతు, పథకం ప్రకారం జోక్యం చేసుకున్న సౌదీ అరేబియా కారణంగా దశాబ్ది కాలంలో 2.33 లక్షల మంది మరణించారు. ఐరాస కార్యాలయం 2020లో చెప్పినదాని ప్రకారం వారిలో ఆహారం, ఆరోగ్యసేవలు, మౌలిక సదుపాయాల లేమి వంటి పరోక్ష కారణాలతో మరణించిన వారు 1.31 లక్షల మంది ఉన్నారు. ఇటీవలి ప్రపంచ పరిణామాల్లో సౌదీ అరేబియా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఎమెన్‌లో జోక్యానికి స్వస్తి పలికింది. సద్దాం హుస్సేన్‌ను తమ పలుకుబడి కిందకు తెచ్చుకొనేందుకు ఇరాక్‌పై అమెరికా అమలు జరిపిన ఆంక్షల కారణంగా ఐదు లక్షల మంది పిల్లలు మరణించారని అంచనా. ఇంకా ఇలాంటి అనేక దారుణాల్లో తమ నేతల, దేశ పాత్ర గురించి...విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో గుడారాలు వేసుకొని నిరసన తెలుపుతున్న విద్యార్థులు అరచేతిలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని అధ్యయనం చేస్తున్నారు.

అమెరికా ప్రత్యక్షంగా పాల్గొనటమే కాదు, అనేక దేశాల పాలకులను ప్రోత్సహించి లక్షలాది మంది మరణాలకు బాధ్యురాలైంది. ప్రస్తుత బంగ్లాదేశ్ 1971కి ముందు పాకిస్తాన్‌లో భాగంగా ఉన్న సంగతి తెలిసిందే. అక్కడ తలెత్తిన ప్రభుత్వ వ్యతిరేకతను అణచివేసేందుకు 'పాక్ మిలిటరీ ఆపరేషన్ సెర్చ్ లైట్' పేరుతో జరిపిన మారణకాండలో మూడు లక్షల మంది మరణించగా కోటి మంది తమ ప్రాంతాల నుంచి పారిపోవాల్సి వచ్చింది. దానికి అమెరికా పూర్తి మద్దతు ఇచ్చింది. మన దేశం జోక్యం చేసుకొని పాక్ మిలిటరీని ఓడించి బంగ్లాదేశ్ విముక్తికి తోడ్పడింది. అంతకు కొద్ది సంవత్సరాల ముందు ఇండోనేషియాలో కమ్యూనిస్టులను అణచివేసేందుకు మిలిటరీ నియంత సుహార్తోను గద్దె మీద కూర్చోబెట్టి కనీసం పది లక్షల మందిని ఊచకోత కోయించటంలో సిఐఏ ప్రధాన పాత్ర పోషించింది. రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా మిత్రపక్ష దేశాల మీద యుద్ధం ప్రకటించిన హిట్లర్ వంటి వారిని తప్ప ప్రపంచంలో నియంతగా పేరు మోసిన ప్రతి వాడినీ అమెరికా బలపరిచింది. హిట్లర్‌కు సైతం ఆయుధాలు అమ్మి తొలి రోజుల్లో మద్దతు ఇచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధంతో బ్రిటన్ ప్రపంచాధిపత్యం అంతరించి అమెరికా రంగంలోకి వచ్చింది. అప్పటి నుంచి సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా సోషలిస్టు దేశాలతో సాగించిన ప్రచ్ఛన్న యుద్ధంలో తాము విజేతలం అని ప్రకటించుకొనే వరకు అంటే 1949 నుంచి 1989 వరకు వివిధ దేశాలలో పాలకులను మార్చేందుకు అమెరికా 72 ప్రయత్నాలు చేయగా 29 సందర్భాలలో అమెరికా కుట్రలో భాగస్వాములైన వారు జయప్రదమయ్యారు. కూల్చిన వాటిలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు ఆరు ఉన్నాయని బోస్టన్ కాలేజీ రాజకీయ శాస్త్ర అధ్యాపకురాలు లిండ్సే ఓ రూర్కే పేర్కొన్నారు. ఒక వలసవాదిగా అమెరికా దుర్మార్గం చిన్నదేమీ కాదు. ఆసియాలోని ఫిలిప్పైన్స్‌ను ఆక్రమించుకొని అక్కడ మొదటి ప్రపంచ యుద్ధానికి ముందే రెండు నుంచి ఆరు లక్షల మందిని జాత్యహంకారం, ఇతర కారణాలతో అమెరికన్ పాలకులు హత్య చేశారని అంచనా.

1968లో వియత్నాంలో దురాక్రమణ, మారణకాండలకు వ్యతిరేకంగా విద్యార్థులు జరిపిన ఆందోళనకు, ఇప్పుడు గాజాలో జరుపుతున్న ఇజ్రాయిల్ మారణకాండకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి విద్యార్థిలోకం గళమెత్తటానికి గల పోలికలు చర్చలోకి వచ్చాయి. అప్పుడూ ఇప్పుడూ ఆందోళన కాలేజీ ప్రాంగణాల్లోనే ప్రారంభమైంది. నాడూ నేడు పోలీసులను పిలిపించి అణచివేతకు పాల్పడ్డారు. నవతరం-పాతవారి మధ్య కొన్ని సైద్ధాంతిక విబేధాలు గతంలోనూ వర్తమానంలోనూ ఉన్నాయి. నిజానికి ఇవి పెద్ద అంశాలు కావు. ఫ్రెంచి వలస ప్రాంతంగా ఉన్న ఇండోచైనాను రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఆక్రమించింది. అది ఓడిన తరువాత తిరిగి ఫ్రాన్సు ఆక్రమించిన వియత్నాంలో విముక్తి పోరాటం కారణంగా 1954లో స్వాతంత్ర్యం వచ్చింది. ఉత్తర, దక్షిణ వియత్నాంలుగా దాన్ని విభజించారు. ఫ్రెంచి పాలకులు తప్పుకున్న తరువాత దక్షిణ వియత్నాం కేంద్రంగా అమెరికా రంగంలోకి వచ్చి ఉత్తర వియత్నాంను ఆక్రమించేందుకు, దక్షిణ వియత్నాంలో విముక్తి పోరాటాన్ని అణచేందుకు చూసింది. స్వతంత్ర పాలస్తీనాను రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రెండుగా చీల్చి ఇజ్రాయిల్‌ను ఏర్పాటు చేశారు. ఆ వెంటనే పాలస్తీనా ప్రాంతాలను పశ్చిమ దేశాల మద్దతుతో అది ఆక్రమించి ఇప్పటి వరకు పాలస్తీనా స్వతంత్ర దేశం ఏర్పడకుండా అడ్డుకుంటున్నది. మానవత్వానికి ముప్పు తెచ్చిన కారణంగా విద్యార్థులు వీధుల్లోకి రావటం చైతన్యానికి నిదర్శనం. రఫాలో దాడులను అడ్డుకోవటంలో విఫలమైన తమ ప్రభుత్వం మీద అమెరికా విద్యార్థులు మరింతగా వీధుల్లోకి వస్తారా, ఏం జరగనుంది అన్నది ఆసక్తికరంగా మారింది.

వ్యాఖ్య

ఆరోగ్య హక్కు చట్టం అవసరం



టి. కామేశ్వరరావు

ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాలను అనుసరించి...ఆరోగ్యానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు చేయాలి. ప్రజలందరికి రక్షిత మంచినీరు, సమతుల ఆహారం అందించాలి. పటిష్ట ఆసుపత్రుల వ్యవస్థ, సరిపడ ఆరోగ్య, వైద్య సిబ్బంది, ఆసుపత్రులలో మౌలిక వసతులను కల్పించాలి. దీనితో పాటు ప్రజలందరికి అందుబాటు ధరల్లో మందుల లభ్యత మొదలగునవన్నీ కల్పించడం ద్వారా రోగులకు ఉపశమనం కల్గించడం ప్రధానంగా ప్రభుత్వ బాధ్యత. కానీ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మందుల ధరలను నియంత్రించే బాధ్యత నుండి అడ్డగోలుగా తప్పుకున్నది. అసలే వైద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ధరల పాలసీ రోగులపై మరింత భారం అవుతుంది. ఇటీవల ఏప్రిల్ 1వ తేదీ నుండి 800 రకాల మందుల ధరలు పెరగడం ఈ విధానంలో భాగమే. మందుల కంపెనీ యజమానులకు అనుకూల విధానాలు చేయడంలో మోడీ ప్రభుత్వం ఏ మాత్రం వెనకాడటం లేదు. ఈ ధరాఘాతం బి.పి, షుగర్ (పట్టిక) మాత్రమేగాక...అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందుల పైనా పడి ప్రజలు భారం మోయలేకున్నారు.

ప్రభుత్వ విధానాలే అనుకుంటే...ఇటు మందుల కంపెనీల అనైతిక వ్యాపార విధానాలు బజారులో పెచ్చుమీరుతున్నాయి. వైద్యులను, ఫార్మసీల యజమానులను ప్రలోభపెట్టడం, విపరీతమైన కమీషన్లు-ప్రోత్సాహకాలు ఇవ్వడం, విదేశీ యానాలు, ఖరీదైన బహుమతులు ఇవ్వడం, బల్క్ పర్చేజ్ పేరుతో ఆసుపత్రులు, ఇన్‌స్టిట్యూషన్ల పర్చేజ్ పేరిట డిపార్టుమెంటు సిబ్బందికి విపరీతమైన లాభాల మార్జిన్లు ఆఫర్ చేయడంతోపాటు, బల్ల కింద లంచాల వరకు అన్ని రకాల అనైతిక చర్యలకు మందుల కంపనీల యాజమాన్యాలు పాల్పడుతున్నాయి.

ఈ ఫార్మా కంపెనీల మందుల అమ్మకాల విధానాలపై చట్టపరమైన నియంత్రణ వుండాలని చాలా సంవత్సరాలుగా జన్ స్వాస్థ్య అభియాన్ (జె.ఎస్.ఎ), ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్.ఎమ్.ఆర్.ఎ.ఐ), ఆల్ ఇండియా డ్రగ్ యాక్షన్ కమిటీ (ఎ.ఐ.డి.ఎ.సి) వంటి స్వచ్ఛంద సంస్థలు పోరాడుతున్నాయి. యుసిపిఎంపి ముసాయిదాను చట్టం చేసి, పటిష్టంగా అమలు చేసి, చట్టాన్ని ఉల్లంఘించే యజమానులను శిక్షించాలని పోరాడుతున్నాయి. కానీ కార్పొరేట్ అనుకూల మోడీ ప్రభుత్వం కనీసం యు.సి.పి.ఎం.పి పై పార్లమెంటులో చర్చించకుండా, దాన్ని చట్టంగా కాకుండా కేవలం కంటి తుడుపు చర్యగా స్వచ్ఛందంగానే ఈ కోడ్‌ని అమలు చేసుకోమని ఫార్మా కంపెనీలకు అప్పచెప్పింది. అంటే ఫార్మా కంపెనీ యజమానుల కమిటీ సభ్యులే మందుల మార్కెటింగ్‌లో కంపెనీలు ఈ కోడ్ అమలు చేసే రీతిని సమీక్షించి నివేదిక ఇస్తారన్నమాట. పర్యవసానంగా మందుల కంపెనీలు నిర్ద్వంద్వంగా రోగులను లూటీ చేసే పరిస్థితి ఇంకా పెరుగుతున్నది.

యుసిపిఎంపి చట్టాన్ని అమలు చేసి రోగులకు ఉపశమనం కల్పించాల్సిన మోడీ ప్రభుత్వం చాలా ఉదాసీనంగా వ్యవహరించడానికి కారణం ఇటీవల ఎన్నికల బాండ్ల ద్వారా మందుల కంపెనీలు బిజెపికి కోట్ల రూపాయల నిధులు ఇవ్వడం. ఈ వ్యవహారం కంపెనీలకు ప్రభుత్వానికి మధ్య జరిగిన క్విడ్ ప్రో కో అని అర్థం చేసుకోవాలి. ఎస్‌బిఐ ఎలక్టోరల్ బాండ్ల డేటా గమనిస్తే మన దేశంలో కేవలం 9 బడా మందుల కంపెనీల యజమానులే బిజెపికి 400 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్ల ద్వారా చందా ఇచ్చారు. ఇంకా చిన్నా పెద్దా కంపెనీలు కలసి ఎన్ని కోట్ల రూపాయల చందాలు ఇచ్చాయో తెలియాలి. ఇది పెద్ద స్కామ్. ఈ ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన కంపెనీల జాబితాలోని ఒక కంపెనీయే చిన్న పిల్లల ప్రాణాలతో చెలగాటమాడే నాసిరకం మందులు తయారు చేసినట్టుగా ఇటీవల చాలా వార్తలు పత్రికల్లో రావడం చూశాం. యుసిపిఎంపి చట్టం అమలు లేకపోవడంవల్లే బాబా రాందేవ్ లాంటి వ్యాపారవేత్తలు బిజెపి ప్రభుత్వ వత్తాసుతో తమ పతంజలి ఉత్పత్తులపై తప్పుడు ప్రకటనలు, తప్పుడు మార్కెటింగ్ విధానాలతో ఇష్టారాజ్యంగా వ్యాపారాన్ని విస్తరించుకోవడం, దానిపై ఇటీవల సుప్రీం కోర్టు పతంజలి కంపెనీపై సీరియస్ అవ్వడం, పతంజలి కంపెనీ బహిరంగ క్షమాపణ చెప్పడం చూశాం.

పెరిగిన కొన్ని మందుల ధరలు

మందు పేరు	ప్యాకింగు		పాత ధర రూ.	కొత్త ధర రూ.
బిపి	టెల్మి సార్టన్ 40 ఎంజి	10 మాత్రలు	265	290
షుగర్	గ్లిమిప్రైడ్ 1 ఎంజి	30 మాత్రలు	109.87	125.32
అల్సర్	రాబిప్రజోల్ డోంపెరిడాన్	10 మాత్రలు	298	328
కరోనాలో వాడిన మందు	ఐవర్మెక్టిన్ 12 ఎంజి	10 మాత్రలు	195	350
నెలసరి మందు	నార్ ఎథిస్టిరాన్	10 మాత్రలు	58	98

గణాంకాల ప్రకారం మన దేశంలో 47 నుంచి 50 శాతం వైద్య ఖర్చును ప్రజలు తమ జేబుల నుండే పెట్టుకుంటున్నారు. అసలే ఒక పక్క ద్రవ్యోల్బణం పెరుగుతూ ప్రజల ఆదాయాలు తగ్గుతూ, పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్య, ఇతర రోజువారీ ఖర్చులు సగటు మనిషికి పెనుభారం అవుతుంటే ప్రభుత్వం...రోగాల చికిత్సలు, మందులు ఇతర వైద్య ఖర్చులపై విపరీతమై జిఎస్‌టి పన్ను భారం వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్య వేదిక (పిఎవి), జన్ స్వాస్థ్య అభియాన్ (జెఎస్ఎ) వంటి సంస్థలు ఆరోగ్య హక్కు చట్టంగా తేవాలని అప్పుడే ప్రజలందరికి వైద్య ఖర్చుల భారం నుండి ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వాలను డిమాండు చేస్తున్నాయి. 2024 ఎన్నికల నేపథ్యంలో పిఎవి ఆరోగ్య హక్కు చట్టం ముసాయిదాని రూపొందించి అన్ని రాజకీయ పార్టీలకు పంపించింది. అలాగే తమ మ్యానిఫెస్టోలో ఆరోగ్య హక్కు చట్టంపై అన్ని పార్టీలు తమ విధానం తెలియజేయాలని డిమాండు చేసింది. కేవలం వామపక్ష పార్టీలు మినహా ఏ ఇతర రాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందించలేదు. పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ హెల్త్ ఇన్సూరెన్సే సంజీవని అని ప్రజల్ని మభ్యపెడుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు ప్రతీ ప్రభుత్వం జిడిపిలో 5 శాతాన్ని బడ్జెట్ ప్రజారోగ్యంపై కేటాయించాలి. మన దేశంలో ప్రభుత్వాలు 1.5 శాతం-1.8 శాతం మించి కేటాయింపులు చేయడం లేదు. ఇంత తక్కువ బడ్జెట్‌లో ప్రైమరీ ఆసుపత్రులను మొదలుకొని టెర్షియరీ కేర్ ఆసుపత్రుల వరకు ఉన్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించడం, మందులు/వైద్య పరికరాలు, ఆసుపత్రుల నిర్వహణ, అంబులెన్సుల నిర్వహణ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సరిపడ వైద్య ఆరోగ్య సిబ్బంది నియామకాలు, వారి జీతాలు...ఎలా సాధ్యం? తక్కువ బడ్జెట్ కేటాయింపుల కారణంగానే ప్రైమరీ కేర్ మొత్తం నిర్వీర్యం అయ్యింది. ప్రభుత్వాలు ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత నుండి పూర్తిగా తప్పుకోడానికి ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి హెల్త్ ఇన్సూరెన్సు స్కీములను తీసుకొచ్చాయి. రోగుల భవిష్యత్ అంతా ఆసుపత్రుల యాజమాన్యాలు, ఇన్సూరెన్సు కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఇన్సూరెన్స్ విధానంలో ఆసుపత్రులు-ఇన్సూరెన్స్ కంపెనీలు కుమ్మక్కై మరింత దోపిడి చేసే అవకాశం ఉంది. కాగ్ నివేదిక ప్రకారం 2022-23లో ఆయుష్మాన్ భారత్ స్కీము అమలులో 13,51,299 కేసులు నకిలీవని తేల్చింది. ఈ నివేదికపై మోడీ ప్రభుత్వం మౌనం వహించింది.

కరోనా కాలంలో సంభవించిన లక్షల మరణాలు, ఆసుపత్రులలో ఆక్సిజన్ మొదలుకొని పడకలు, మందులు, వైద్య పరికరాల అందుబాటు, సిబ్బంది కొరత ఇలా ప్రతీ అంశంలో మన ఇన్సూరెన్సు మోడల్ ఆరోగ్య వ్యవస్థలో లోపాలు బయటపడ్డాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సి వచ్చింది. అదే సమయంలో ధనికులకు మాత్రం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందాయి. పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. అందుకే మన దేశంలో ఆరోగ్య హక్కు చట్టంతో మాత్రమే ప్రజల ఆర్థిక అసమానతలతో తావు లేకుండా అందరికి సామానంగా వైద్యం అందించడం సాధ్యమవుతుంది. ఆరోగ్య హక్కు చట్టం లేనంతకాలం ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జవాబుదారీగా ఉండజాలదు.

ఇప్పటికైనా ఆరోగ్యం అన్న సబ్జెక్టు ఒక రాజకీయ అంశంగా ప్రజలు గుర్తించి పాలకులను ఆరోగ్య హక్కు చట్టం తెచ్చి అమలు చేసే రీతిలో ఒత్తిడి చేయాలి. అలాగే ప్రభుత్వాలు కూడా చికిత్స కంటే వ్యాధి నివారణే ప్రధానం అనే విధానం రూపొందించాలి. ఆరోగ్య శ్రీ / ఆయుష్మాన్ భారత్ కేటాయింపులను ఆరోగ్య బడ్జెట్‌గా కాకుండా హెల్త్ ఇన్సూరెన్స్ ఖర్చుగా పేర్కొనాలి. ఆరోగ్య బడ్జెట్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాలు అమలు చేస్తూ, కావాలంటే వేరేగా హెల్త్ ఇన్సురెన్సుపై నిధులు ఖర్చు చేయాలి. ప్రజారోగ్య వేదిక రూపొందించిన ఆరోగ్య హక్కు ముసాయిదాను...ఎన్నికలైన వెంటనే కొత్త ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టి, చట్ట రూపకల్పన చేసి తక్షణం అమలు చేయాలి.

/ వ్యాసకర్త ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /







లెక్క తేలాల్సిందే..!

● ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల నిమగ్నం

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో అభ్యర్థులు మంగళవారం ఎవరికి వారు గ్రామాలు, మండలాలు, వార్డులు, బూత్‌ల వారీగా లెక్కల్లో నిమగ్నమయ్యారు. పోలింగ్ ఏజెంట్ నుంచి పోలైన ఓట్ల జాబితాను ముందు పెట్టుకొని పార్టీ ముఖ్యనేతలతో కలిసి అంచనా వేస్తున్నారు. ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి? తమకు ఎన్ని వస్తాయి? అని పూర్తిస్థాయిలో అంచనాలు వేస్తున్నారు. తగ్గిన, పెరిగిన ఓట్లతో సైలెంట్ ఓటింగ్ ఎటువైపు మొగ్గు చూపే అవకాశం ఉందనే అంశాలపై ఆరాలు తీస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో ఇప్పటికే గెలుపు ఓటములపై అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏం జరుగుతుందనే భయం ఉన్నప్పటికీ ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓ పార్టీ 20 వేలకు పైబడి మెజార్టీ వస్తుందని అంచనా వేస్తోంది. మరో ప్రధాన పార్టీ 1000 ఓట్ల తేడాతో అయినా తామే గెలుస్తామని కుండ బద్దలు కొట్టి మరీ చెబుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఓ ప్రధాన పార్టీ 1500, మహిళా ఓటర్లకు క్వాలిటీ చీరలు, కొన్ని సామాజిక తరగతుల మహిళలకు రూ.100 అదనంగా, పురుషులకు మద్యం అందించారు. మరో పార్టీ వారు వెయ్యి రూపాయలు ,కొన్ని చోట్ల మందు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి పోలైన ఓట్లు ఎవరికి లాభం చేకూరుస్తాయో? ఎవరికీ నష్టం కలిగిస్తాయో? అని రాజకీయ విశ్లేషకులు అంచనాలు చేస్తున్నారు. వాటి ప్రభావం ఎలా ఉంటుందో మరి జూన్ 4 వరకూ వేచి చూడాల్సిందే.

మోడీ మళ్లీ ప్రధానైతే

దేశంలో ఎన్నికలే జరగవు: ఖర్గే



మహారాజ్‌గంజ్ (యూపీ): ప్రధాని మోడీని 'ఝూథోన్ కా సర్దార్' (అబద్ధాల రాజు) అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభివర్ణించారు. ఆయన మళ్లీ ప్రధాని అయితే దేశంలో ఇక ఎన్నికలు జరగవని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వీరేంద్ర చౌదరికి మద్దతుగా ఇక్కడ జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఖర్గే మాట్లాడారు. ప్రధాని మోడీ అనేక హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ యాదవ్‌తో సహా పలువురు ఇండియా బ్లాక్ నాయకుల సమక్షంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ, "ప్రధాని అబద్ధాలు చెబుతున్నారు. మోడీ అబద్ధాలకోరు, దగాకోరు ('ఝూథోన్ కా సర్దార్')." "ఈ వ్యక్తి (మోడీ) మళ్లీ (ప్రధానిగా) వస్తే, ఎన్నికలు ఉండవు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు లేదా మహిళా అభ్యర్థులు ఉండరు." అని స్పష్టం చేశారు. ఎన్నికలను సైద్ధాంతిక పోరుగా పేర్కొన్న ఖర్గే, "మేం మోడీ లేదా యోగి కావచ్చు ఏ వ్యక్తిపైనా పోరాడటం లేదు, ఇది వ్యక్తిగత పోరాటం కాదు" అని అన్నారు.

70 ఏళ్లలో మేం ఏం చేశామని అడుగుతున్నారు. మేం ఏమీ చేయకపోతే మీరు ప్రజాస్వామ్యానికి ప్రధాని కాలేరు. మేం (కాంగ్రెస్) రాజ్యాంగాన్ని రూపొందించి ప్రజాస్వామ్యాన్ని కాపాడినందున మీరు ప్రధాని అయ్యారు. "మీరు ఆ ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని, రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది జరగదు. దేశంలోని దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, రైతులు , మేధావులు రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయనివ్వరు" అని ఆయన అన్నారు. మహారాజ్‌గంజ్ ఎంపీగా ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి పంకజ్ చౌదరిని ఉద్దేశించి ఖర్గే, "మీరు ప్రతినిధిగా ఎన్నికై ఏమైనా అభివృద్ధి చేశారా" అని ప్రశ్నించారు. ఈ జిల్లాకు నేపాల్‌తో సరిహద్దు ఉంది. రాజకీయంగా ప్రాధాన్యత ఉంది, ఇప్పటికీ జిల్లా కేంద్రాన్ని రైల్వే లైన్‌తో అనుసంధానం చేయలేదు. మోడీ హయాంలో ఇక్కడ నుంచి అనేక చక్కెర మిల్లులు అదృశ్యమయ్యాయి, ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా కూర్చున్నారు? అని యోగిని నిలదీశారు. "వారు డబుల్ ఇంజిన్ల గురించి మాట్లాడతారు, వాటిలో ఒకటి విఫలమైంది. మరొకటి పట్టాలు తప్పింది" అని అతను ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ చేసిన పనితో పోలిస్తే ఈ డబుల్ ఇంజిన్లు ఏమీ చేయలేవని ఆయన అన్నారు.

ఆనకట్టలు, వంతెనలు, పెద్ద ప్రాజెక్టులను పూర్తిచేసిన కాంగ్రెస్‌ను దుర్వినియోగం చేయడమే వారి (బిజెపి) పని అని ఆయన అన్నారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మండిపడ్డారు. "జపాన్ నుంచి రూ.లక్ష కోట్ల రుణం తీసుకున్నారు. అవి ఎక్కడ ఖర్చు చేశారు? బుల్లెట్ రైలు ఎక్కడ ఉంది?" అని ఖర్గే అన్నారు. కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం ద్వారా బీజేపీ ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. "కళంకిత" నాయకులను తమ పార్టీలో చేరమని బలవంతం చేయడానికి ఇడి, సిబిఐని ఉపయోగించుకుంటోందని ఆరోపించారు.

డబుల్ లైన్‌లో రైల్వే అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

కోరాపుట్ - సింగాపూర్ రోడ్ డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీపూర్ రోడ్ - సింగారం - టికిరి రైల్వే సెక్షన్ల మధ్య కొత్తగా నిర్మించిన 21.750 కిలోమీటర్ల డబుల్ లైన్‌ను సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా మంగళవారం పరిశీలించారు. ఆ మార్గంలో ప్రధాన, చిన్న వంతెనలు, వంపులు 25టి యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా నిర్మించబడ్డాయని ఆయనకు సిబ్బంది తెలిపారు. అనంతరం మంగళవారం నిర్వహించిన స్పీడ్ ట్రయల్స్ విజయవంతం కావడంతో ఈ మార్గం పూర్తి స్థాయి కమీషన్‌ను చేపట్టేందుకు అధికారులు అనుమతి మంజూరు చేశారు. తనిఖీల్లో వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏజీ శ్రీనివాస్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.సన్నన్‌వాలా, చీఫ్ బ్రిడ్జ్ ఇంజినీర్ విఎస్‌కె.రాజ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ / కన్‌స్ట్రక్షన్ అశోక్ కుమార్, ఎడిఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ / కన్‌స్ట్రక్షన్ విష్ణుమూర్తి, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ పాల్గొన్నారు.

కింగ్స్ కార్నర్ స్టోన్ కాలేజీతో ఆర్‌ఎంటి వర్సిటీ భాగస్వామ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

కింగ్స్ కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజీతో ఆర్‌ఎంటి వర్సిటీ భాగస్వామ్యమైంది. ఈ సందర్భంగా ఆ విద్యా సంస్థల ప్రతినిధులు ప్రొఫెసర్ అభిజిత్ మణి, నికోల్ ఆర్విన్, ప్రొఫెసర్ రాజారామన్ ఏరి ఆ వివరాలను ఎంవిపి.కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. విద్యార్థులు తమ ఉన్నత విద్యా ప్రయాణం కోసం భారతదేశం నుంచి ఆస్ట్రేలియాకు సజావుగా మారడానికి వీలు కల్పిస్తున్నాయన్నారు. రెండు సంస్థలు ఢిల్లీలోని ఆస్ట్రేలియన్ హై కమిషన్‌లో 2016లో ఆస్ట్రేలియన్ బదిలీ కార్యక్రమాన్ని సహకరించడానికి, అందించడానికి ఒక ఒప్పందంపై సంతకం చేశాయన్నారు. ఇది విద్యార్థులకు అసమానమైన విద్యావకాశాలను అందించనుందని తెలిపారు. ప్రతినిధి బందం మెల్‌బోర్న్ క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాలు, సహాయ సేవలను తెలియజేసింది.

వృద్ధుడి గొంతులో నెల రోజులుగా ఉన్న ఎముక తొలగింపు



హైదరాబాద్ : తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు నెల రోజుల క్రితం ఓ వివాహ వేడుకలో మటన్ తింటూ పొరపాటున ఓ ఎముకను మింగేశారు. ఆహారనాళంలో ఇరుక్కుపోయిన ఆ ఎముక లోపల రంధ్రం పడి తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. నెల రోజులుగా అవస్థలు పడుతున్న ఆ వృద్ధుడికి హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్‌లో ఉన్న కామినేని ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్స అవసరం లేకుండానే ఆ ఎముక తొలగించి గొప్ప ఊరట కల్పించారు. ఈ మేరకు కామినేని ఆసుపత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. తొలుత నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి వెళ్లగా అక్కడ ఎండొస్కొపీ చేసి ఎముక ఉందన్న విషయాన్ని వైద్యులు గుర్తించి ఎల్బీనగర్ ఆస్పత్రికి పంపించారు. ఇక్కడ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాధిక నిట్టల వైద్య బృందం ఆయనను క్షుణ్ణంగా పరిశీలించి శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎండొస్కోపిక్ ప్రణాళికతోనే ఆ ఎముకను ఎంతో చాకచక్యంగా బయటకు తీశారు. దీనికి సంబంధించిన వివరాలను డాక్టర్ రాధిక తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేన్ గ్రామానికి చెందిన 66 ఏళ్ల శ్రీరాములుకు దవడ పళ్లు లేకపోవడంతో నమలలేరు. కానీ ఒక పెళ్లికి వెళ్లి అక్కడ మటన్ ఉండటంతో తినాలనుకున్నారు. పళ్లు లేకపోవడం వల్ల నమలకుండా నేరుగా మింగేశారు. దీంతో 3.5 సెంటీమీటర్ల పొడవున్న ఒక ఎముక లోపలకు వెళ్లిపోయింది. రెండు మూడు రోజుల తర్వాత ఛాతీలో నొప్పి రావడంతో స్థానిక వైద్యులకు చూపిస్తే అల్ట్రాసౌండ్ స్కానింగ్ తీసి గ్యాస్ట్రిక్ ట్రబుల్ అనుకొని మందులు ఇచ్చారు. కానీ నొప్పి మాత్రం తగ్గలేదు. దాంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి వెళ్లగా అక్కడ ఎండోస్కొపీ చేసి లోపల ఎముక ఇరుక్కుందన్న విషయాన్ని వైద్యులు నిర్ధారించారు. సాధారణంగా ఎముక ఇరుక్కుంటే ఎవరైనా తీసేస్తారు. అది నెల రోజులుగా బయటకు తీయకపోవడంతో ఆహారనాళానికి రంధ్రం చేసింది. అది కొంచెటం అటూ ఇటూ అయినా ఆహారనాళానికి పూర్తిగా రంధ్రం పడిపోవడమే కాకుండా గుండెకు కూడా ప్రమాదకరంగా మారుతుంది. ఒకవేళ ఇలాంటి పరిస్థితుల్లో అన్నం తింటే ఆ మెతుకులు మళ్లీ సంక్రమణ అయిన దగ్గర మళ్లీ ఇన్ఫెక్షన్ అవుతుందని రాధిక తెలిపారు. దీన్ని అత్యంత జాగ్రత్తగా ఎండోస్కొపీ ప్రొసీజర్‌లోనే తొలగించాలని వైద్యులు తెలిపారు. అప్పుడు తప్పనిసరిగా మేజర్ సర్జరీ చేయాలన్నారు. అందుకే ఆయనకు కొంతకాలం పూర్తిగా ద్రవపదార్థాలు మాత్రమే తీసుకోవాలని చెప్పినట్లు వైద్యులు పేర్కొన్నారు. కొబ్బరినీళ్లు, మంచినీళ్లు లాంటివి మాత్రమే తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఇలా ఒక నెల రోజులపాటు ఎముక లోపల ఉండిపోవడం ఎప్పుడూ చూడలేదని డాక్టర్ రాధిక అన్నారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-విశాఖపట్నం

దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం రాత్రి ప్రకటించారు. రైలు నెంబర్ 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు రద్దు చేశారు. రైలు నెంబర్ 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు రద్దుచేశారు. రైలు నెంబర్ 22701 విశాఖపట్నం-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు నడిచే రోజులలో విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది. రైలు నెంబర్ 22702 గుంటూరు-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు నడిచే రోజులలో విజయవాడ నుంచి బయలుదేరుతుంది. రైలు నెంబర్ 07466 రాజమండ్రి-విశాఖపట్నం, 07467 విశాఖపట్నం-రాజమండ్రి రైళ్లు ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ అధికారులు అభ్యర్థించారు.

వర్షంతో సేదతీరిన ప్రజలు

ప్రజాశక్తి - తాళ్లపూడి (తూర్పుగోదావరి జిల్లా)

వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు మంగళవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షంతో సేదతీరారు. రోజురోజుకీ పెరుగుతున్న ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. మంగళవారం కూడా ఎండ తీవ్రంగా కాసింది. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వాతావరం చల్లబడటంతో వృద్ధులు, చిన్నారులు సేద తీరారు. వర్షం కారణంగా మెయిన్ రోడ్ లో కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి చిన్న చెరువుల్లా దర్శనమిచ్చాయి. దేవరపల్లిలో వాతావరణం ఒక్క సారిగా చల్లబడి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి ముఖ్యంగా కాలనీలో నీరు నిలిచిపోవడంతో రోడ్లు బురదమయం అయ్యాయి దీంతో జనాలు అవస్థలు పడ్డారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందిన కొంత ఇబ్బంది పడ్డారు.

ఇజ్రాయిల్ దాడి హమాస్‌ను నిర్మూలించే అవకాశం లేదు


- బ్లింకెన్



రఫా: దక్షిణ గాజాలోని రఫాపై ఇజ్రాయిల్ పూర్తి స్థాయి దాడి అరాచకత్వాన్ని పెంచుతుందే తప్ప హమాస్‌ను నిర్మూలించే అవకాశమే లేదని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ అన్నారు. హమాస్‌ను అంతమొందించడంలో ఇజ్రాయిల్ వ్యూహాలు విఫలమయ్యాయని, ఈ స్థితిలో గాజా నుండి ఇజ్రాయిలీ దళాలు బయటకొస్తాయనే తాము ఆశిస్తున్నామని అన్నారు. గాజా ఉత్తర ప్రాంతంలో కొన్ని భాగాలను హమాస్ గ్రూపు తిరిగి తన అధీనంలోకి తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

జట్టుగా ఇండియా బ్లాక్

- ఎస్‌పి - కాంగ్రెస్ ఐక్యతారాగం
- అమేథీ, రాయ్‌బరేలీలో విజయం కోసం కృషి



లక్నో : ఉత్తర ప్రదేశ్ రాజకీయాల్లో అనూహ్య మార్పు కనిపిస్తోంది. ఎస్‌పి – కాంగ్రెస్ కూటమి ఐక్యతారాగాన్ని ఆలపిస్తోంది. సీట్ల సర్దుబాట్ల తర్వాత అఖిలేశ్, రాహుల్ హవా నడుస్తోంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌పి – కాంగ్రెస్ కూటమి విఫలమైన విషయాన్ని రెండు పార్టీలు గుర్తించాయి. ఇప్పుడు కలిసి పోటీకి దిగటంతోపాటు విజయం సాధించాలన్న పట్టుదల ఆ రెండు పార్టీల్లోనూ కనిపిస్తోంది. అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా ఇరు పార్టీల కార్యకర్తలు మైదానంలో ఒక జట్టుగా పని చేస్తున్నట్టు సంకేతాలిస్తున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా అమేథీ, రాయ్‌బరేలీలలో బ్యాక్–టు–బ్యాక్ కార్నర్ సమావేశాలు, ర్యాలీలతో దూసుకెళు తున్నారు. ఆమె బహిరంగ కార్యక్రమాలతో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రెడ్ క్యాప్ క్యాడర్‌లో జోష్ కనిపిస్తోంది. 2017లో పొత్తుల హడావుడి అట్టడుగు స్థాయికి చేరుకోలేక పోయిందని, కాగితాలపైనే మిగిలిపోయిందని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈసారి మాత్రం అందుకు భిన్నంగా ఉందని ఇక్కడి ఎస్‌పి, కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు.

మా అధినేత అఖిలేశ్ యాదవ్ పొత్తును ప్రకటించిన వెంటనే కాంగ్రెస్‌కు ఇచ్చిన 17 స్థానాల్లోని ఆఫీస్ బేరర్లు, ముఖ్య నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి.. 'మీ పార్టీలా ఎన్నికల్లో పోరాడండి' అని చెప్పారని బరేలీ జిల్లా చీఫ్ వీరేంద్ర యాదవ్ తెలిపారు. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ, అమేథీలో కిషోరీ లాల్ శర్మను విజయం వైపు నడిపించటానికి సర్వశక్తులు ఒడ్డినట్టు చెప్పారు. బిజెపితో పట్ల ప్రజలు విసిగిపోయారని, రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ రికార్డు మెజార్టీతో గెలుస్తారని, అమేథీలో శర్మ మంచి మెజార్టీతో గెలుస్తారని ఎస్‌పి, కాంగ్రెస్ కార్యకర్తలు నమ్మకంగా ఉన్నారని చెప్పారు. ఇక్కడి ఎస్‌పి కార్యకర్తలు కూడా కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు, హామీ కార్డులను ప్రజల్లోకి తీసుకెళు తున్నారని తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో మీడియా ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు అన్షు అవస్తీ మాట్లాడుతూ రాయ్‌బరేలీ, అమేథీలలో ఎస్‌పి కార్యకర్తలు గాంధీ కుటుంబంతో సన్నిహితంగా, కుటుంబ పరంగా, చాలా భావోద్వేగ అనుబంధాన్ని కలిగి ఉన్నారని, ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొంటున్నారని చెప్పారు.

రాయ్‌బరేలీలో ఎస్‌పి జిల్లా మాజీ అధ్యక్షుడు రామ్ నరేష్ యాదవ్ మాట్లాడుతూ తమ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తల మాదిరిగానే ఉత్సాహంగా ఉన్నారని, రాయ్‌బరేలీ, అమేథీలలో ఇండియా వేదిక అభ్యర్థులు భారీ విజయం సాధించేలా కృషి చేస్తున్నారని తెలిపారు. రాయ్‌బరేలీ నియోజకవర్గం ఐదు అసెంబ్లీ సెగ్మెంట్‌లను కలిగి ఉంది. బచ్రావాన్ హర్‌చంద్‌పూర్, రాయ్ బరేలీ, ఉంచాహర్, సరేని. అమేథీ పార్లమెంటరీ నియోజకవర్గం తిలోయి, సలోన్, జగదీష్‌పూర్, గౌరీగంజ్ , అమేథీ అసెంబ్లీ సెగ్మెంట్‌లను కలిగి ఉంది. 10 అసెంబ్లీ సెగెంట్లలో ఆరుగురు ఎస్‌పి ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఇద్దరు బిజెపికి మద్దతు పలికారు. సాంప్రదాయకంగా ఎస్‌పి పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు నిశ్శబ్దంగా మద్దతునిస్తుంది, గాంధీ కుటుంబానికి అండగా నిలుస్తోందని ఎస్‌పి శ్రేణులు అంటున్నాయి. ఈసారి రెండు పార్టీల మధ్య ప్రకటిత పొత్తు ఉండడంతో రెండు పార్టీల కార్యకర్తల మధ్య సమన్వయం కనిపిస్తోంది.

ఏదైనా ర్యాలీ లేదా కార్నర్ మీటింగ్‌లో రెండు పార్టీల కార్యకర్తలు మమేకమవుతున్నారు. గౌరీగంజ్‌లోని కాంగ్రెస్ కార్యాలయం ప్రధాన గేటుపై రెండు పార్టీల జెండాలు ఉన్నాయి. ఆ కార్యాలయంలో ఎక్కడ చూసినా రెండు పార్టీల జెండాలే దర్శనమిస్తున్నాయి. ప్రియాంక గాంధీ లేదా కిషోరి లాల్ శర్మ లేదా ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రసంగించే ఏదైనా కాంగ్రెస్ బహిరంగ సభకు గణనీయమైన సంఖ్యలో ఎస్‌పి కార్యకర్తలు హాజరవుతున్నారు. ఇది కేవలం పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలకే పరిమితం కాలేదని తెలుస్తోంది. మద్దతుదారులు కూడా పొత్తుపై ఉత్సాహంగా ఉన్నారు. అమేథీలోని షాఫర్ గ్రామానికి చెందిన కమలేష్ యాదవ్ మాట్లాడుతూ తాను అఖిలేశ్ యాదవ్‌కు గట్టి మద్దతుదారునని, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నందున తన ఓటు, మద్దతు కాంగ్రెస్‌కేనని చెప్పారు. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో బ్రాహ్మణ, యాదవుల జనాభా గణనీయంగా ఉంది. రాయ్‌బరేలీలో బిజెపి అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్‌పై రాహుల్ గాంధీ పోటీ చేస్తుండగా, గాంధీ కుటుంబ సన్నిహితుడు లాల్ శర్మ అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీపై పోటీ చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు మే 20న ఐదో దశ పోలింగ్ జరగనుంది.

ప్రశ్నించడం నా నైజం.. అందుకే నిలదీశా

- గొట్టిముక్కల సుధాకర్



విజయవాడ : అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించడం తనకు చిన్నతనం నుంచి అలవాటు అని, ఆ వైఖరి వల్లే తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివశంకర్ ను నిలదీసినట్లు స్థానిక ఓటరు గొట్టిముక్కల సుధాకర్ తెలిపారు. ఈ నెల 13న తెనాలిలోని ఐతా నగర్ పోలింగ్ కేంద్రంలో సుధాకర్ చెంపపై ఎమ్మెల్యే శివకుమార్ కొట్టడం..అంతే వేగంగా సుధాకర్ కూడా ఎమ్మెల్యే చెంప చెల్లుమనిపించడం తెలిసిందే. ఆ తర్వాత ఎమ్మెల్యే అనుచరుల దాడిలో గాయపడిన సుధాకర్ ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే శివకుమార్, అతని కుటుంబసభ్యులు క్యూలైన్లో కాకుండా నేరుగా వెళ్లి ఓటు వేయడం వల్ల అప్పటికే మూడు, నాలుగు గంటల పాటు ఎండలో ఉన్న వద్ధులు, మహిళలు ఇబ్బంది పడ్డారని, అందుకే అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సుధాకర్ తెలిపారు. ఎన్నికల సంఘం కూడా ఇప్పటికే ఎమ్మెల్యేతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. పోలింగ్ కేంద్రంలో ఓటరుపై దాడి చేసిన ఘటనలో గుంటూరు జిల్లా తెనాలి వైసిపి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో పాటు మరో ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బాధితుడు గొట్టిముక్కల సుధాకర్ ఫిర్యాదుతో ఐపిసి 341, 323 సెక్షన్ల కింద తెనాలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

1,274 ఓట్ల పోలింగ్‌కు 18 గంటలు

ప్రజాశక్తి– భోగాపురం (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా భోగాపురం పంచాయతీ అప్పన్నపేట పోలింగ్ కేంద్రంలో (230) 18 గంటల పాటు పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఇవిఎంలు మొరాయించడంతో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. మరోవైపు సాయంత్రం ఎక్కువ మంది ఓటర్లు ఓటేసేందుకు రావడంతో పోలింగ్ సమయం ముగిసేసరికి సుమారు ఐదు వందల మంది ఓటర్లు క్యూలో ఉండడంతో వారంతా ఓటు వేసేందుకు తెల్లవారుజామున 3 గంటలైంది. దీంతో, పోలింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పోలింగ్ కేంద్రంలో 1,274 ఓట్లు ఉన్నాయి. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి వరుసలో ఉన్న సుమారు 500 మందికి అధికారులు టోకెన్లు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం చిన్నదిగా ఉండడం, ఆలస్యం కావడంతో ఓటర్లంతా ఒకేసారి వెళ్లేందుకు ప్రయత్నించడంతో రద్దీ నెలకొంది. అర్ధరాత్రి 12 గంటలు దాటాక తేదీ మారిపోతుండడంతో అధికారులు వెంటనే మరో ఇవిఎంను ఏర్పాటు చేశారు.

వినియోగదారుల కోర్టుల్లో లాయర్లపై దావాలు చెల్లవు

- సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు
- 2007 నాటి ఫోరం తీర్పు కొట్టివేత

న్యూఢిల్లీ : సేవల్లో లోపాన్ని ఎత్తిచూపుతూ న్యాయవాదులపై వినియోగదారుల కోర్టుల్లో దావాలు వేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లాయర్లు ఫీజు తీసుకుని కేసులు వాదిస్తుంటారని, దాన్ని వినియోగదారుల పరిరక్షణ చట్టం కింద 'సేవ'గా పరిగణించలేమని తేల్చి చెప్పింది. సేవల్లో లోపాన్ని ఎత్తిచూపుతూ న్యాయవాదులపై వినియోగదారుల న్యాయస్థానాల (కన్స్యూమర్ కోర్టు)ల్లో దావాలు వేయకూడదని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిథాల్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది.

ఆ తీర్పు చెల్లదు!

న్యాయవాదులపై కన్స్యూమర్ కోర్టుల్లో దావాలు వేయొచ్చంటూ 2007 సంవత్సరంలో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. న్యాయవాదులు అందించే సేవలు వినియోగదారుల రక్షణ చట్టం 1986లోని సెక్షన్ 2 (ఓ) పరిధిలోకి వస్తాయని అప్పట్లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ పేర్కొంది. అయితే ' కమిషన్ తీర్పు వ్యాపారం, వాణిజ్యం నుంచి వృత్తిని వేరు చేసింది. ఒక ప్రొఫెషనల్‌కు ఉన్నత స్థాయి విద్య, నైపుణ్యం, మానసిక శ్రమ అవసరం. వృత్తి నిపుణుడి విజయం వారి నియంత్రణలో లేని వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. .

90 శాతం ఫిర్యాదులు పరిష్కరించాం: ఇసి

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కోడ్ ఉల్లంఘనకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల్లో 90 శాతానికి పైగా పరిష్కరించామని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీల నుండి వచ్చిన పెద్ద ఫిర్యాదులు పెండింగ్‌లో లేవని తెలిపింది. కాంగ్రెస్, బిజెపి ల నుండి వచ్చిన కొన్ని ఫిర్యాదులు తప్ప అన్నీ పరిష్కరిం చామని పేర్కొంది. ఎంసిసి అమల్లోకి వచ్చినప్పటి నుండి దాదాపు రెండు నెలలు పూర్తయినందున, నియోజక వర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచారం హింసకు తావులేకుండా జరిగింది' అని ఇసి పేర్కొంది.

వెయ్యికిపైగా స్కైపీ ఐడిలపై నిషేధం

న్యూఢిల్లీ : వెయ్యికి పైగా స్కైపీ ఐడిలపై ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి) మంగళవారం నిషేధం విధించింది. ఈ స్కైపీ ఐడిలతో సైబర్ నేరగాళ్లు బ్లాక్ మెయిల్, దోపిడీలు, 'డిజిటల్ అరెస్టులు'కు పాల్పడుతుండటంతో కో ఆర్డినేషన్ సెంటర్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ స్కైపీ ఐడిలతో సైబర్ నేరగాళ్లు సిబిఐ, నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్, ఆర్‌బిఐ, ఇడి వంటి సంస్థల అధికారులుగా నటిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగించే సిమ్‌కార్డులు, మొబైల్ పరికరాలు, నకిలీ ఖాతాలను కూడా ఐ4సి నిషేధించింది. సైబర్ నేరాల గురించి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి)కి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నట్లు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

హెచ్‌డి రేవణ్ణ బెయిల్‌పై విడుదల

బెంగళూరు : కిడ్నాప్ కేసులో బెయిల్ లభించడంతో కర్ణాటక మాజీ మంత్రి హెచ్‌డి రేవణ్ణ మంగళవారం మధ్యాహ్నం పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. బయటకు వచ్చిన రేవణ్ణకు పెద్ద సంఖ్యలో జెడి(ఎస్) కార్యకర్తలు స్వాగతం పలికారు. జైలు నుంచి నేరుగా ఈ నెల 4న తనను అరెస్టు చేసిన, పద్మనాభనగర్‌లోని తన తండ్రి, మాజీ ప్రధాని దేవగౌడ ఇంటికి రేవణ్ణ చేరుకున్నారు. నివాసం బయట పెద్ద సంఖ్యలో జెడి(ఎస్) కార్యకర్తలు గుమిగూడి ఉండగా, రేవణ్ణ లోపల తన సోదరుడు, జెడి(ఎస్) రాష్ట్ర అధ్యక్షులు హెచ్‌డి కుమారస్వామితో కలిసి ఉన్నారు. బుధవారం తన స్వగ్రామం, తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న హోలెనరసిపూర్ నియోజకవర్గానికి రేవణ్ణ వెళ్లనున్నారు. తన కుమారుడు, జెడి(ఎస్) ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసులో బాధితురాల్ని కిడ్నాప్ చేశారనే ఆరోపణలతో హెచ్‌డి రేవణ్ణను అరెస్టు చేశారు. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు రేవణ్ణకు సోమవారం సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది.

ప్రజల కష్టాలను ప్రధాని పట్టించుకోరు

- అమేథీలో ప్రియాంక

అమేథీ (యుపి) : "ప్రధాని మోడీ ప్రజల కష్టాలు పట్టించుకోరని, "సంబంధం లేని" విషయాలనే మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. అమేథీ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కిషోరీ లాల్ శర్మకు మద్దతుగా మోహియా కేసరియాలో ఏర్పాటుచేసిన ఎన్నికల సభలో ఆమె ప్రసంగించారు. ప్రధాని ప్రజలను ప్రేమించడం లేదని, ఏ రైతు ఇంటికి వెళ్లలేదని ఆమె అన్నారు. "నిన్న అతను వారణాసిలో రోడ్ షో నిర్వహించారు. ఎత్తైన వాహనంపై, చుట్టూతా భద్రతా సిబ్బంది మధ్య నిలబడి చేతులు ఊపారు. మీ బాధ ఏమిటో అతనికి ఎలా తెలుస్తుంది? (అతను) కేవలం 'సేతులు' (వ్యాపారవేత్తలతో) మాత్రమే కనిపిస్తారు" ఆమె అన్నారు. అమేథీలో ప్రజలు ఓడించిన తన సోదరుడు రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4,000 కిలోమీటర్లు నడిచి దేశప్రజల సమస్యలు విన్నారని ఆమె అన్నారు. ఎన్నికల సమయంలో గేదెలు, మంగళసూత్రాలు, గుళ్లు, మసీదుల గురించి మాట్లాడకూడదని మోడీకి చెప్పాలని ప్రియాంక గాంధీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాన మంత్రి, అమేథీ ఎంపీ (స్మృతి ఇరానీ) సహా బిజెపి నేతలు ప్రజల పట్ల జవాబుదారీతనం లేదని భావిస్తున్నారని చెప్పారు. మతం ప్రాతిపదికన ఓటు వేస్తారని భావిస్తున్నారని ఆమె అన్నారు. రైతుల కోసం మోడీ ఏం చేశారో చెప్పలేరని అన్నారు. అక్కడక్కడా మాట్లాడి ప్రజల దృష్టిని మరల్చుతున్నారని ఆమె అన్నారు. "ఎలక్టోరల్ బాండ్లతో అతిపెద్ద అవినీతి పథకాన్ని మోడీ తీసుకువచ్చారు. ఇందులో విరాళం ఇచ్చే వ్యక్తి పేరు రహస్యంగా ఉంటుంది" అని ప్రియాంక గాంధీ చెప్పారు.

సిపిఐ ఎంపీ సెల్వరాజ్ మృతి



చెన్నై : సిపిఐ నాయకుడు, నాగపట్నం పార్లమెంటు సభ్యుడు ఎం.సెల్వరాజ్ (67) శ్వాస సంబంధిత వ్యాధితో చెన్నైలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కె. బాలకష్ణ సంతాపం వ్యక్తం చేశారు. సెల్వరాజ్ తిరువారూర్ జిల్లా నీడమంగళం ప్రాంతంలో తన తల్లిదండ్రులతో కలిసి చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేశారని పేర్కొన్నారు. నాగపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలో నాలుగు సార్లు గెలుపొంది, నియోజకవర్గ ప్రజల గౌరవాభిమానాలను పొందారని తెలిపారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని బాలకృష్ణ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

మేఘాలయలో భూకంపం

షిల్లాంగ్ : మేఘాలయలో మంగళవారం భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై భూకంప తీవ్రత 3.1గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మేఘాలయలోని వెస్ట్ జైంతియా హిల్స్ జిల్లాలో మంగళవారం ఉదయం 7.49 గంటల సమయంలో భూకంపం సంభవించింది. వెడల్పు : 25.17, పొడవు : 92.13, 25 కిలోమీటర్ల లోతులో భూప్రకంపనలు సంభవించినట్లు ఎన్‌సిఎస్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ ఘటనకు సంబంధించి ఆస్తి, ప్రాణ నష్టాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

పెరిగిపోతున్న క్యాన్సర్ రోగులు

- ఏటా 20 శాతం పెరుగుదల
- సొమ్ము చేసుకునే పనిలో కార్పొరేట్ ఆసుపత్రులు



న్యూఢిల్లీ : రానున్నరోజుల్లో దేశవ్యాప్తంగా క్యాన్సర్ రోగుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు అంచనా వేశారు. దీంతో ఆధునిక చికిత్స సదుపాయాల పేరుతో క్యాన్సర్ రోగుల నుంచి డబ్బులు గుంజే ప్రయత్నంలో కార్పొరేట్ ఆసుపత్రులు తలమునకలవుతున్నాయి. వైద్య రంగంలో వందల కోట్లలో పెట్టుబడులు పెట్టి.. వేల కోట్లలో లాభాలర్జించేందుకు తహతహలాడుతున్నాయి. అందుకు తగ్గట్టుగానే కార్పొరేట్ ఆసుపత్రులు పడకల విస్తీర్ణాన్ని పెంచే యోచనలో ఉన్నాయి. క్యాన్సర్ చికిత్స కోసం హాస్పిటల్స్‌లో బెడ్స్‌ని పెంచే కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ముందు వరసలో రాజీవ్ గాంధీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ (ఆర్‌సిఐఆర్‌సి), ఆస్టర్ డిఎం హెల్త్‌కేర్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, యధార్థ్ హాస్పిటల్స్ ఉన్నాయి. ఇవి రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్యకు తగ్గట్టుగా పడకలను కూడా పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి.

భారత్‌లో భవిష్యత్తులో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతుందని 'అపోలో హాస్పిటల్స్' 'హెల్త్ ఆఫ్ ది నేషన్ 2024' గత నెల (ఏప్రిల్ 3)లో విడుదల చేసిన నివేదిక తెలియజేసింది. 2020లో 1.39 మిలియన్ క్యాన్సర్ కేసులు ఉన్నాయి. అవి కాస్తా.. 2025 నాటికి 1.57 మిలియన్ల కేసులకు పెరిగే అవకాశం ఉంది. అంటే ఐదేళ్ల కాలంలో క్యాన్సర్ కేసుల సంఖ్యలో సుమారు 13 శాతం పెరుగుదల కనిపిస్తోంది. లక్షల సంఖ్యలో క్యాన్సర్ రోగులు పెరగడంతో.. వారి జీవిత కాలం కూడా తగ్గిపోతోంది. క్యాన్సర్ మహమ్మారి వల్ల జీవన ప్రమాణం తగ్గిపోయే వారి సంఖ్య 2021లో 27 మిలియన్ల నుండి 2025 నాటికి దాదాపు 30 మిలియన్లకు పెరిగే అవకాశం ఉందని అపోలో నివేదిక తెలిపింది. బహుశా వికసిత్ భారత్ భవిష్యత్తులో 'క్యాన్సర్ కాపిటల్' అన్న పేరు సంపాదించుకుంటుందని అపోలో నివేదిక స్పష్టం చేసింది.

ద నేషనల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఢిల్లీ ఆర్‌జిసిఐఆర్‌సి రాబోయే మూడు సంవత్సరాల్లో 155 పడకల్ని పెంచే యోచనలో ఉన్నట్లు ఆర్‌జిసిఐఆర్‌సి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.ఎస్ నేగి అన్నారు.

ఏటా 20 శాతం మేర క్యాన్సర్ రోగుల పెరుగుదల

ఇప్పటివరకు 1,30,000 మందికి క్యాన్సర్ ఉందని గుర్తించడం జరిగింది. ఇక వారిలో ఏడువేల మందిలో ప్రీ క్యాన్సర్ స్టేజ్‌లో ఉన్నారు. 690 మంది ఈ వ్యాధి ప్రారంభ దశలో ఉన్నారు. 2022లో క్యాన్సర్ రోగుల సంఖ్య 50 శాతం పెరిగింది. ప్రతి ఏడాదీ ఈ వ్యాధికి గురయ్యే వారి సంఖ్య 20 శాతం మేర పెరుగుతూనే ఉన్నారని బెంగళూరులోని ఫోర్టిస్ హెల్త్‌కేర్ నివేదిక వెల్లడించింది. క్యాన్సర్ రోగులకు ప్రత్యేక చికిత్స సదుపాయాల కోసం ఫోర్టిస్ హెల్త్‌కేర్ రూ. 450 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులే పెట్టింది. ఇంకా మరిన్ని పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఫోర్టిస్ హెల్త్‌కేర్ గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనిల్ వినాయక్ అన్నారు. బ్లడ్ క్యాన్సర్‌లను గుర్తించడంలో ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కి ప్రత్యేక స్థానం ఉంది. బోన్ క్యాన్సర్‌కి గురైన వారికి ఎముక మజ్జని మార్పిడి చేసే ప్రత్యేక సదుపాయాలు కలిగిన హెల్త్‌కేర్ ఫోర్టిస్‌దేనని ఆయన అన్నారు. క్యాన్సర్ చికిత్స కోసం చేసే వ్యాపారంలో 2024-2025 సంవత్సరంలో 20 నుంచి 25 శాతం మేర పెరిగి సుమారు రూ.1,400 కోట్ల రాబడి వస్తుందని అనీల్ వినాయక్ తెలిపారు.

శస్త్రచికిత్స, రేడియేషన్‌తో సహా అంకాలజీ, రోబోటిక్ సర్జరీ వంటి అధునాతన పద్ధతుల కోసం ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచేందుకు ఆస్టర్ డిఎం హెల్త్‌కేర్ లక్ష్యంగా పెట్టుకుంది. 2026-27 నాటికి 1,700 పడకల్ని పెంచేదిశగా ఈ కార్పొరేట్ ఆసుపత్రి ప్రయత్నిస్తోంది. వీటి కోసం వెయ్యి కోట్ల రూపాయల్ని ఖర్చు చేయనుంది. 2027 నాటికి తిరువనంతపురంలో 454 పడకలు గల ఆసుపత్రి నిర్మించనుంది. కాసరగోడ్‌లో 264 పడకలు, దేశవ్యాప్తంగా 6,600 పడకలు గల ఆసుపత్రుల్ని నిర్మించబోతున్నట్లు ఆస్టర్ డిఎం హెల్త్‌కేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నితీష్ శెట్టి అన్నారు. ఇలా చికిత్స కోసం ఆసుపత్రిల్ని రీ మోడల్ చేయించడం కోసం పెట్టిన పెట్టుబడుల్లో కనీసం 15 శాతం వృద్ధి ఉంటుందని శెట్టి అన్నారు.

ఇక యథార్థ్ హెల్త్‌కేర్ కూడా పడకల విస్తరణకు ప్రయత్నిస్తోంది. ఈ హెల్త్‌కేర్ ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాలపై దృష్టిపెట్టింది. దేశ రాజధాని ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆసుపత్రుల్లోని పడకల విస్తరణను పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు డైరెక్టర్ యధార్త్ త్యాగి తెలిపారు.

20 వేల కోట్లు ఖర్చు చేసినా గంగ మురికిగానే ఎందుకుంది?

- మోడీని ప్రశ్నించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి మోడీ దత్తత తీసుకున్న వారణాసి గ్రామాలను ఎందుకు వదిలేశారని, రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా గంగా నది ఇంకా మురికిగానే ఎందుకుంది? అని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రశ్నించింది. వారణాసి లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేసిన మోడీ ఇక్కడ తన 'వైఫల్యాలు'కు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. 'రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా గంగా మురికిగా ఎందుకుంది? ప్రధానమంత్రి మోడీ తాను దత్తత తీసుకున్న వారణాసి గ్రామాలను ఎందుకు వదిలివేశారు? వారణాసిలో మహాత్మా గాంధీ వారసత్వాన్ని నాశనం చేయాలని ప్రధాని మోడీ ఎందుకు సంకల్పించారు?' అని పోస్టులో ఆయన ప్రశ్నించారు. 2014లో వారణాసికి వచ్చిన సందర్భంలో గంగా జలాలను శుద్ధి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నమామి గంగే ప్రాజెక్టుతో రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా నదిలో కాలుష్యం ఇంకా ఎక్కువయిందని విమర్శించారు. రూ.20 వేల కోట్లలో అవినీతితో ఎంత సొమ్మును స్వాహా చేశారని ప్రశ్నించారు. వారణాసి నగరం వెలుపల ఎనిమిది గ్రామాలను మోడీ దత్తత తీసుకున్నారని, ఈ గ్రామాల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదని పేర్కొన్నారు. ఆచార్య వినోభా భావే ప్రారంభించిన సర్వ సేవా సంఘ్‌ను నాశనం చేసే స్థాయికి ప్రధాని దిగజారారని విమర్శించారు. 'స్వదేశంలో గాంధేయ సంస్థలను నాశనం చేస్తూ.. విదేశాల్లో గాంధీజిని ప్రశంసించాలనే కపట ధోరణిలో ప్రధాని ఉన్నారు' అని పేర్కొన్నారు. మోడీ అనుసరించేది గాడ్సే సిద్ధాంతమని, గాంధీ సిద్ధాంతం కాదని అందరికీ తెలుసునని విమర్శించారు.

గౌతమ్ నవ్‌లఖా బెయిల్‌పై స్టే ఎత్తివేసిన సుప్రీం



న్యూఢిల్లీ : బీమా కొరెగావ్ హింస కేసులో యుఎపిఎ కింద అభియోగాలు మోపిన గౌతమ్ నవ్‌లఖాకు బాంబే హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆదేశాలపై సుప్రీం మంగళవారం స్టే ఎత్తివేసింది. నవ్‌లఖా ఇప్పటికే జైల్లో నాలుగేళ్లకు పైగా గడిపారని, ఆయన 70వ పడిలో వున్నారని, ఆయన విచారణకు ఏళ్లు పట్టే అవకాశం వుందని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. యుఎపిఎ కింద ఆయన తీవ్రవాద చర్యలకు పాల్పడ్డారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) చెబుతున్న వాదనలకు రుజువులు లేవని బెంచ్ పేర్కొంది. ఆయన బెయిల్‌పై సుప్రీంలో సవాలు చేయడానికి ఎన్ఐఎ కొంత గడువు కోరడంతో మూడు వారాల పాటు బెయిల్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీర్ఘకాలంగా జైల్లో వుండడం వల్ల ఆయన అస్వస్థతతో బాధపడుతున్నారని మంగళవారం సీనియర్ న్యాయవాది నిత్యా రామకృష్ణన్ చెప్పారు. ఇప్పటికే గృహ నిర్బంధం ఖర్చుల కింద రూ.2.4 లక్షలు చెల్లించారని తెలిపారు.

ఇజ్రాయిల్ దురాగతాలపై రేపటి నుండి ఐసిజె విచారణ



గాజా : రఫాలో ఇజ్రాయిల్ దురాగతాలపై అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) గురువారం విచారణ చేపట్టనుంది. శుక్రవారం కూడా విచారణ కొనసాగనుంది. రఫాపై రాక్షస దాడులకు తెగబడుతున్న నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా ప్రకటించాలని కోరిన దక్షిణాఫ్రికాకు ఈజిప్టు, టర్కీ తాజాగా తోడయ్యాయి.

రఫాపై ముమ్మరంగా క్రూరమైన దాడులకు ఇజ్రాయిల్ దిగడంతో కైరో చర్చలు విఫలమయ్యాయని మధ్యవర్తిత్వం నెరపిన ఖతార్ పేర్కొంది. గత కొద్ది వారాలుగా పరిస్థితులు దారుణంగా దిగజారాయని ఖతార్ ప్రధాని మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం ఇజ్రాయిల్ బలగాలు తూర్పు రఫాలోని మారుమూల ప్రాంతాలపైనా బాంబుల వర్షం కురిపించాయి. జాబాలియా శరణార్థ శిబిరాన్ని ధ్వంసం చేసింది. తూర్పు రఫా, జీటూన్ ఏరియాల్లో నివాస ప్రాంతాలపైన దాడులు జరపడంతో అనేక మంది చనిపోయినట్లు వార్తలొస్తున్నాయి. నుస్రత్ శరణార్థ శిబిరంలో జరిగిన దాడిలో పిల్లలతో సహా 20మంది మరణించారు. ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులు పాలస్తీనియన్ల ఇళ్లను నేలమట్టం చేస్తూ, పెద్ద ఎత్తున విధ్వంసానికి పాల్పడ్డాయి.

గాజాలో ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోతున్న పాలస్తీనా పౌరులకు సంబంధించి పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేస్తున్న రోజువారీ గణాంకాలు అత్యంత విశ్వసనీయమైనవని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) పేర్కొంది. ఇప్పటివరకు ఈ దాడుల్లో 35వేలమంది వరకు మరణించారని, వీరిలో దాదాపు 25వేల మందిని గుర్తించామని ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. ఇన్ని వేల మందిని గుర్తించారంటేనే ఈ డేటాలో ఎలాంటి తప్పు లేదని స్పష్టమవుతోందని డబ్ల్యుహెచ్‌ఓ ప్రతినిధి క్రిస్టినా లిండ్‌మేర్ తెలిపారు. ఇజ్రాయిల్ ఈ గణాంకాలను విమర్శించిన నేపథ్యంలో డబ్ల్యుహెచ్‌ఓ వివరణ వెలువడింది. ఇప్పటివరకు 35,173మంది మరణించగా, 79,061మంది గాయపడ్డారు.

సహాయక సిబ్బంది కష్టాలు

రఫాపై ఉధృతంగా జరుగుతున్న దాడులతో నిర్వాసితులైన వేలాదిమంది పాలస్తీనియన్లకు ఆహారం, ఇతర సరఫరాలు పంపిణీ చేయడంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని సహాయక కార్యకర్తలు తెలిపారు. గత వారం రోజుల్లో రఫా నుండి 3,60,000మంది పాలస్తీనియన్లు వెళ్ళిపోయారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ తెలిపింది. ఎయిడ్ క్రాసింగ్‌లను తెరిచామని ఇజ్రాయిల్ ఆదివారం ప్రకటించింది. కానీ గత వారం రోజులుగా దక్షిణ గాజాలోని రెండు ప్రధాన క్రాసింగ్‌ల్లోకి ఆహార ట్రక్కులు ఒక్కటి కూడా రాలేదు.. పరిస్థితులు రాన్రానూ భయంకరంగా తయారవుతున్నాయని ఐక్యరాజ్య సమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ ప్రతినిధి అబీర్ ఇటెఫా వ్యాఖ్యానించారు.

16, 17 తేదీల్లో పుతిన్ చైనా పర్యటన

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ ఈ వారం చైనాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో రష్యా, చైనా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించనున్నారు. ఈ సందర్భంగా అనేక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశముంది. రష్యా అధ్యక్షుడిగా అయిదవ సారి బాధ్యతలు చేపట్టిన తరువాత పుతిన్ జరుపుతున్న మొదటి విదేశీ పర్యటన ఇది. చైనా ఆహ్వానం మేరకు ఆ దేశంలో ఈ నెల 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు పుతిన్ అధికారికంగా పర్యటించనున్నారని రష్యా అధ్యక్ష భవనం (క్రెమ్లిన్) మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపింది. ఇరు దేశాల అధినేతల మధ్య జరిగే శిఖరాగ్ర సమావేశంలో సమగ్ర భాగస్వామ్యం, వ్యూహాత్మక అంశాలపై ప్రధానంగా చర్చ ఉంటుందని క్రెమ్లిన్ తెలిపింది. రష్యా ప్రధాని లీ కియాంగ్‌తో కూడా పుతిన్ సమావేశమవుతారు. ఈశాన్య చైనాలోని హర్బిన్ నగరాన్ని కూడా ఆయన సందర్శిస్తారు. దీనిని 19వ శతాబ్దం చివరిలో రష్యన్ సెటిలర్ల కోసం స్థాపించారు. రష్యా, చైనా అనేక దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలను కలిగివున్నాయి. 2022 ఫిబ్రవరి ప్రారంభంలో " రెండు దేశాల మధ్య స్నేహానికి హద్దుల్లేవు. సహకారానికి 'నిషిద్ధ' ప్రాంతాలు లేవు" అని ఇరు దేశాలు ప్రకటించాయి. చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ 2023లో రష్యాలో జరిపిన పర్యటన ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఆర్థిక సహకారానికి సంబంధించి పలు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. అదే సంవత్సరం అక్టోబరులో పుతిన్ బీజింగ్‌లోని బెల్ట్ అండ్ రోడ్ ఫోరమ్‌కి హాజరయ్యారు.

కెటలానియా ప్రాంతీయ ఎన్నికల్లో సోషలిస్టుల ఘన విజయం

బార్సిలోనా : ఆదివారం జరిగిన కెటలానియా ప్రాంతీయ ఎన్నికల్లో స్పానిష్ సోషలిస్టు పార్టీ చారిత్రాత్మక విజయం సాధించింది. ఇదివరకెన్నడూ లేని రీతిలో స్పెయిన్ రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయిన ఆరేళ్ల తర్వాత కెటలానియా ప్రాంతంలోని వేర్పాటువాద పార్టీలపై సోషలిస్టు పార్టీ విజయాన్ని నమోదు చేసింది. మాజీ ప్రాంతీయ అధ్యక్షుడు కార్లెస్ పుడ్జెమాంట్‌కి చెందిన టుగెదర్ పార్టీ నేతృత్వంలో స్వాతంత్ర్య అనుకూల నాలుగు పార్టీలు మొత్తంగా 61 సీట్లను గెలవాల్సి వుంది. చాంబర్‌లో మెజారిటీకి 68సీట్లు అవసరం. మాజీ ఆరోగ్య మంత్రి సాల్వడార్ ఇల్లా నేతృత్వంలోని సోషలిస్టులు కెటలన్ ఎన్నికల్లోనే ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తంగా 42 సీట్లు గెలిచారు. 2021లో కేవలం 33సీట్లు మాత్రమే గెలిచారు. అప్పుడు వారు ఎక్కువ ఓట్లు గెలుచుకున్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. కెటలాన్ ఎన్నికల్లో సోషలిస్టులు ఓట్లు, సీట్లు గెలుచుకోవడం ఇదే మొదటిసారి. ఈ విజయంతో కెటలానియాలో కొత్త అధ్యాయం ఆరంభమవుతుందని ఇల్లా ప్రకటించారు. కెటలానియా అధ్యక్షుడిగా ఇలా బాధ్యతలు చేపట్టాలంటే ఇతర పార్టీల మద్దతు కూడా సోషలిస్టులకు అవసరం. 2012 నుండి బార్సిలోనాలో వేర్పాటువాదులే ప్రాంతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ వచ్చారు. అప్పటి నుండి వరుసగా నాలుగు ప్రాంతీయ ఎన్నికల్లోనూ వారే గెలుస్తూ వచ్చారు.

ఐఎంఎఫ్ షరతులకు తలొగ్గిన షెహబాజ్ ప్రభుత్వం

- ప్రైవేటీకరణ మంత్రం జపిస్తున్న ప్రధాని

ఇస్లామాబాద్ : ఏ ఆర్థిక విధానాలైతే పాకిస్తాన్‌ను పీకల్లోతు సంక్షోభంలోకి నెట్టాయో అవే విధానాలను పట్టుకుని షెహబాజ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వేలాడుతోంది. ఐఎంఎఫ్ నుంచి రుణం తీసుకున్నందుకు అది విధించిన షరతుల అమలులో బాగంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుంది. వ్యూహాత్మకంగా కీలకమైన పిఎస్‌యులను మినహాయించి మిగతా అన్నిటినీ అమ్మకానికి పెడుతున్నట్లు ప్రధాని షెహబాజ్ ప్రకటించారు. తొలుత నష్టాలు వస్తున్న ప్రభుత్వ సంస్థలనే ప్రైవేటీకరించాలని ప్రభుత్వం భావించింది. కానీ, ఐఎంఎఫ్ ఒత్తిడికి తలొగ్గి పాక్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌తో సహా లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టాలని నిర్ణయించింది. మలి విడత రుణం కోసం ఐఎంఎఫ్‌తో చర్చలు ప్రారంభించిన మరుసటి రోజు ఈ ప్రకటన వెలువడింది. వ్యాపారం చేయడం ప్రభుత్వ పని కాదని, వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి సానుకూల వాతావరణాన్ని కల్పించే ఫెసిలిటేటర్ పాత్రకే పరిమితం కావాలన్నదే తన అభిమతమని ఆయన అన్నారు. . ప్రైవేటీకరణ కమిషన్‌తో సహకరించాల్సిందిగా అన్ని మంత్రిత్వ శాఖలను ఆయన ఆదేశించారు. బిడ్డింగ్, ఇతర ముఖ్యమైన చర్యలతోసహా పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పిఐఎ) ప్రైవేటీకరణ క్రమాన్ని టెలివిజన్‌లో ప్రసారం చేయాల్సిందిగా ప్రధాని ఆదేశించారు. పిఐఎ ప్రైవేటీకరణ తుది దశలో వుందన్నారు.

పారిస్‌లో జైలు వ్యాన్‌పై దుండగుల దాడి

ఇద్దరు అధికారులు మృతి, తప్పించుకున్న ఖైదీ

పారిస్ : ఖైదీని తీసుకువెళుతున్న ఒక జైలు వ్యాన్‌పై మంగళవారం దాడి జరగడంతో ఇద్దరు జైలు అధికారులు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈలోగా ఆ ఖైదీ తప్పించుకుని పారిపోయాడని పారిస్ పోలీసు వర్గాలు న్యాయశాఖ మంత్రి ఎరిక్ దూపాండ్ మొరెటికి తెలిపాయి. ఉత్తర ఫ్రాన్స్‌లోని ఇంకారవిల్లె ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి కారకులైన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.. రెండు వాహనాల్లో వచ్చిన పలువురు వ్యక్తులు దాడి తర్వాత అక్కడ నుండి పారిపోయారని, వారిలో ఒకరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. అసలు ఎంతమంది దాడికి పాల్పడ్డారనేది కచ్చితంగా తెలియరాలేదు. ఈ దాడి తమకు దిగ్భ్రాంతి కలిగించిందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నేరస్తులను పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



జలందర్ లోక్‌సభ స్థానం నామినేషన్ దాఖలు చేస్తున్న సిపిఎం అభ్యర్థి ప్రశోతమ్ లాల్ బిల్గా

జలందర్ లోక్‌సభ అభ్యర్థిగా బిల్గా నామినేషన్

జలందర్ : పంజాబ్‌లోని జలందర్ లోక్‌సభ స్థానం సిపిఎం అభ్యర్థి ప్రశోతమ్ లాల్ బిల్గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దేశ్ భగత్ మెమోరియల్ హాల్‌లో నిర్వహించిన సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, రాష్ట్ర కార్యదర్శి సుఖ్వీందర్‌సింగ్ సెఖాన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి భంత్‌సింగ్ బ్రార్ తదితరులు ప్రసంగించారు.

ఢిల్లీ మద్యం కేసులో సహనిందితురాలిగా ఆప్

- హైకోర్టుకు తెలిపిన ఇడి

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసులో తదుపరి దాఖలు చేయబోయే ప్రాసిక్యూషన్ ఫిర్యాదు (ఛార్జిషీట్)లో ఆప్ ఆద్మీ పార్టీ (ఆప్)ను సహ నిందితురాలిగా చేరుస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మంగళవారం ఢిల్లీహైకోర్టుకు తెలిపింది. మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంలో ఇడి ఈ విషయాన్ని వెల్లడించింది. సిసోడియాకు బెయిల్ మంజూరు చేయవద్దని కోరింది. ఈ కేసులో అభియోగాలు నమోదు చేయకుండా ఆలస్యం చేసేందుకు నిందితులు శతవిధాల ప్రయత్నిస్తున్నారని ఇడి తెలిపింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ ముందు ఇడి తరుపున న్యాయవాది వాదనలు వినిపించారు. సిసోడియా తరుపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ సిసోడియాకు బెయిల్ మంజారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో ఇడి, సిబిఐలు వరసగా వ్యక్తులను అరెస్టు మాత్రమే చేస్తున్నాయని, విచారణను త్వరగా ముగించే ప్రశ్నే లేదని తన వాదన వినిపించారు. ఈ వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు సిసోడియా బెయిల్ పిటీషన్‌పై తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ఈ కేసులో గత ఏడాది ఫిబ్రవరిలో సోసిడియాను ఇడి అరెస్టు చేయగా, తరువాత నెలలో సిబిఐ ఆరెస్టు చేసింది. తన బెయిల్ పిటీషన్‌ను ఏప్రిల్ 30న రోస్ అవెన్యూ కోర్టు తిరస్కరించడంతో హైకోర్టును సిసోడియా ఆశ్రయించారు.

మోడీ ఆస్తులు రూ.3 కోట్లు

- ఎక్కువ శాతం ఎఫ్‌డిలే



న్యూఢిల్లీ : వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రధానమంత్రి మోడీ బిజెపి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం మోడీ ఆస్థుల విలువ రూ.3,02,06,889. ఇందులో ఫిక్స్‌డ్ డిపాజిట్లే ఎక్కువగా ఉన్నాయి. ఎస్‌బిఐలో మొత్తం రూ.2.85 కోట్లు మోడీ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. 45 గ్రాముల బరువైన నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. వీటి విలువ రూ. 2.67 లక్షలుగా తెలిపారు. రూ.52,920 చేతిలో ఉన్న నగదుగా తెలిపారు. రూ.9.12 లక్షలు విలువైన నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్స్ ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 3.33 లక్షల ఆదాయ పన్ను మినహాయింపును మోడీ పొందారు. అఫిడవిట్ ప్రకారం మోడీకి సొంత ఇల్లు, కారు లేదు. జశోధబెన్‌ను తన భార్యగా పేర్కొన్నారు. ఆమెకు ఉన్న ఆస్థుల గురించి తెలియదని స్పష్టం చేశారు. తనపై ఒక్క క్రిమినల్ కేసు కూడా పెండింగ్‌లో లేదని పేర్కొన్నారు. అహ్మదాబాద్ నివాసిగా మోడీ పేర్కొన్నారు. 1967లో ఎస్ఎస్‌సి, 1978లో ఢిల్లీ యూనివర్శిటీ నుంచి బిఎ డిగ్రీ, 1983లో గుజరాత్ యూనివర్శిటీ నుంచి ఎంఎ చదివినట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో మోడీ తన ఆస్థుల విలువ రూ. 2.5 కోట్లుగా ప్రకటించారు. 2014లో రూ.1.65 కోట్లుగా వెల్లడించారు.

రామ్‌దేవ్ ప్రభృతులకు కోర్టు ధిక్కార నోటీసులపై తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

న్యూఢిల్లీ : ప్రజలను తప్పుదారి పట్టించేలా వాణిజ్య ప్రకటనలు జారీ చేస్తున్న కేసులో యోగా గురు రామ్‌దేవ్, ఆయన సహాయకుడు బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద లిమిటెడ్‌కు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేయడంపై సుప్రీంకోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వ్ చేసుకుంది. లైసెన్సులు రద్దు చేయబడిన పతంజలి ఉత్పత్తులకు సంబంధించిన యాడ్స్‌ను రీకాల్ చేయడానికి తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని పతంజలి తరపు న్యాయవాది కోర్టును కోరారు. మూడు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం బెంచ్ ఆదేశించింది. వారికి కోర్టు ధిక్కార నోటీసులను జారీ చేయడంపై ఆదేశాలను రిజర్వ్ చేసుకున్నామని జస్టిస్ హిమా కొహ్లి, జస్టిస్ అసనుద్దీన్ అమనుల్లాలతో కూడిన బెంచ్ తెలిపింది. విచారణ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షుడు ఆర్.వి.అశోకన్ బెంచ్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇటీవల పిటిఐకి ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా ఆశోకన్, సుప్రీంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. ఈ తరుణంలో అశోకన్ క్షమాపణ చెబుతూ ఇచ్చే అఫిడవిట్‌ను ఆమోదించలేమని బెంచ్, ఐఎంఎల్ తరపు న్యాయవాదికి తెలిపింది. అశోకన్ తీవ్రమైన, ఆమోదయోగ్యం కాని ప్రకటనలు చేశారని బెంచ్ వ్యాఖ్యానించింది.

స్వాతి మాలివాల్‌పై కేజ్రీవాల్ పిసి అసభ్య ప్రవర్తన

- కఠిన చర్యలు తీసుకుంటామన్న ఆప్ నేత

న్యూఢిల్లీ : ఆప్ రాజ్యసభ ఎంపి స్వాతి మాలివాల్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి వైభవ్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన సంచలనంగా మారింది. సోమవారం సిఎం అధికారిక నివాసంలో కేజ్రీవాల్‌ను స్వాతి మాలివాల్ కలవడానికి వెళ్లి సందర్భంలో ఈ ఘటన జరిగింది. డ్రాయింగ్ రూమ్‌లో స్వాతి మాలివాల్ వేచివుండగా, వైభవ్ కుమార్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడని ఆప్ నాయకులు సంజయ్ సింగ్ తెలిపారు. ఈ ఘటన ఖండించదగినదని, కేజ్రీవాల్ కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ విషయంపై సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన స్వాతి మాలివాల్ కేజ్రీవాల్ వ్యక్తిగత సిబ్బంది తనపై దాడి చేశారని అక్కడ అధికారులకు తెలిపారు. పోలీసులకు అధికారంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఈ అంశంపై ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసిడి) మంగళవారం సమావేశంలో గందరగోళం చెలరేగింది. మంగళవారం సమావేశం ప్రారంభమైన వెంటనే బిజెపి, కాంగ్రెస్ కౌన్సిలర్లు వెల్‌లోకి దూసుకెళ్లి కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేజ్రీవాల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో మేయర్ సభను వాయిదా వేశారు.

ముంబైలో 14కి పెరిగిన మృతులు

ముంబయి : ముంబయిలో సోమవారం గాలివాన బీభత్సానికి మరణించిన వారి సంఖ్య 14కి పెరిగింది. మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘోర ఘటనలో మరో 74 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలుంటాయని ముంబయి పోలీస్ కమిషనర్ వివేక్ ఫన్సాల్కర్ తెలిపారు. ఇప్పటికే 'ఇగో మీడియా ప్రైవేట్ లిమిటెడ్' యాడ్ ఏజెన్సీ యజమాని భవేశ్ భిండేపై కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. కూలిన హోర్డింగ్ కింద నుజ్జునుజ్జయిన కార్లలో ఇంకా కొంతమంది చిక్కుకొని ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. బలమైన ఈదురుగాలుల ధాటికి ఘట్‌కోపర్‌లోని సమతా నగర్‌లో సోమవారం 100 అడుగుల ఎత్తైన ఇనుప హోర్డింగ్ పక్కనే ఉన్న పెట్రోల్ పంపుపై కూలిన విషయం తెలిసిందే. ఈ హోర్డింగ్‌కు అనుమతులు లేవని పోలీసులు గుర్తించడం విశేషం.

మృతులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం : సిఎం ఏక్‌నాథ్ షిండే

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నగరంలోని అన్ని హోర్డింగ్‌లను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన వాటితోపాటు ముప్పు పొంచి ఉన్న అన్నింటినీ తొలగించాలని ఆదేశించారు. తాజా ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన షిండే.. కారకులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.

వేసవి విడిది

భావి భారత పౌరులం



బాలలం మేము బాలలం..
పాలబుగ్గల పసివాళ్లం
అమ్మానాన్నలకు ఆశాజ్యోతులం
భావితరానికి పునాదిరాళ్లం

బాలలం మేము బాలలం..
చాచా నెహ్రూకి ప్రియమైన
చిన్నారులం
కల్లాకపటం ఎరుగని నిర్మల
మనస్కులం
మోసాలు, ద్వేషాలు తెలియని
అమాయకులం

బాలలం మేము బాలలం.
క్రమశిక్షణలో మెలిగే విద్యార్థులం
ఆటపాటలతో అలరారే చలాకీ
పిల్లలం
సెలవుల్లో విహారాలు చేసే
సరదాగాళ్లం


బాలలం మేము
బాలలం..

భరతమాత ముద్దు బిడ్డలం
నవభారత నిర్మాణానికి
భాగస్వాములం
భావి భారత పౌరులం

- పి. వర్షిక,
7వ తరగతి, సెయింట్ పీటర్స్ హై స్కూల్, సికింద్రాబాద్,
95505 25130.



బొమ్మరిల్లు





ఇ. ఈశ్వర్,
ఎస్‌డీఆర్ వరల్డ్ స్కూల్,
నంద్యాల.









జి. గంగా గౌతమ్,
6వ తరగతి,
స్వామి వివేకానంద స్కూల్,
పులివెందుల,
వై.ఎస్.ఆర్. జిల్లా.

కలిసి మెలిసి ...

రవి, లాస్య ఇద్దరూ అన్నాచెల్లెళ్లు. ఎప్పుడూ నేను గొప్ప అంటే, నేను గొప్ప అని కొట్టుకుంటూ ఉండేవారు. 'నేను పెద్దవాడిని నేనే గొప్ప' అనేవాడు రవి. 'నాకు తెలివితేటలు ఉన్నాయి. నేనే గొప్ప' అని లాస్య వాదులు ఆడుకునేవారు. తండ్రి ఎన్నోసార్లు నచ్చజెప్పాలని చూసినా, వినేవారు కాదు. పిల్లలకి అర్థమయ్యేలా చెప్పాలని ఆయన ఎంతో ఆలోచించాడు.

ఒక రోజు పిల్లలు బయట ఆడుకుంటూ ఉంటే, ఒక కోతి చెట్టుపై కాయలు తింటూ ఉంది. చెల్లిని ఏడిపించాలని చూసిన రవి, ఆ కోతిని లాస్య మీదకి ఉసికొల్పాలని చూశాడు. అయితే ఆ కోతి లాస్య వెంటే కాకుండా, పక్కనే ఉన్న రవి వెంట కూడా పడింది. ఊహించని ఈ పరిణామంతో రవి బిక్కచచ్చిపోయాడు. కోతి వెంటాడుతుంటే భయపడిపోయిన లాస్య, రవితో పరుగెత్తలేక కిందపడిపోయింది. ఆ కోతి అమాంతం లాస్య మీద పడబోయింది. అయితే 'చెల్లిని ఎక్కడ రక్కేస్తుందో' అని భయపడ్డ రవి, వెనక్కి తిరిగి, కిందపడిన లాస్య చెయ్యి పట్టుకుని తండ్రి వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్లాడు. అప్పుడు వాళ్ళ నాన్న ఆ కోతిని తరిమేశారు. 'మీ ఇద్దరూ కలిసి మెలిసి ఉంటే ఎంతటి కష్టాన్నయినా అధిగమించగలరు. చూశారా, ఇప్పుడు ఎలా తప్పించుకున్నారో?' అని వాళ్లకి అర్థమయ్యేలా చెప్పారు. ఆ రోజు నుండి రవి, లాస్య ఇద్దరూ కలిసి మెలిసి ఉన్నారు.

- సిహెచ్. దీపు కార్తికేయ,
6వ తరగతి, అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.



గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా 'చిన్నారి', 'వేసవి విడిది'గా ముస్తాబవుతుంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్

JEEVANA జీవన the family

జీవన సారథం

లక్ష్యం అవకాశం కాదు..
ఎదురు చూడాల్సింది కాదు..
ఎన్నుకోవాల్సింది.

సహాయకులకు ఒక పలకరింపు ..!

ఇంట్లో అమ్మ, అక్క, నాన్న మొదలుకొని, వీధిలో కూరగాయలు, పండ్లు, పూలు అమ్మేవారు, ట్రాఫిక్ పోలీసులు, ఆటోడ్రైవర్లు, రిక్షా కార్మికులు.. ఇలా ఎంతోమందిని నిత్యం కలుస్తుంటాం. వాళ్లు చేసే పని ఎంత గొప్పది అయినా, ఒక్కసారి కూడా వాళ్లవైపు కన్నెత్తి చూడం. ఒక చిన్న చిరునవ్వు రువ్వి, అభినందనపూర్వకంగా పలకరించం. 'వాళ్ల పని వాళ్లు చేస్తున్నారు. వాళ్లతో మానకేం పని?' అన్నట్టు మసలుకొంటాం. అయితే అటువంటి వారి కళ్లల్లో ఆనందం కోసం 37 ఏళ్ల అభినవ్ మల్హోత్రా ఓ వినూత్న ప్రయత్నం చేస్తున్నాడు. ప్రత్యేకంగా గ్రీటింగ్ కార్డులు తయారు చేయిస్తున్నాడు. ఆ కార్డును, ఓ పువ్వునూ జత చేసి, స్వయంగా తానే ఒక చిర్నవ్వుతో వారికి అందిస్తున్నాడు. ఇది చాలా చిన్న అభినందన.. కానీ అది వాళ్ల జీవితంలో ఎప్పుడూ తారసపడనిది. ఎవ్వరూ ఇవ్వనిదీ. అందుకే వాళ్ల పట్ల అభినవ్ చూపిస్తున్న కృతజ్ఞతకి ఎంతగానో సంతోషపడుతున్నారు. మనసారా ధన్యవాదాలు చెబుతున్నారు.



ఢిల్లీలో నివసించే అభినవ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. 'దేవుడు గుళ్లల్లో, చర్చిల్లో, మసీదుల్లో ఉండడు. నిత్యం మీ కళ్ల ముందు కనిపించే శ్రమ జీవుల్లో ఉంటాడు' అంటాడు. 'షాపుకెళ్లినప్పుడు బయట ఉండే సెక్యూరిటీ గార్డుని ఒక్కసారి పలకరించి చూడండి. అతని కళ్లల్లో ఆనందం స్పష్టంగా కనిపిస్తుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ పోలీసును ఒక్కసారి పలకరిస్తే, అతను ఎంత ఆనంద పడతాడో తెలుస్తుంది. మీ ఇంటికి రోజూ కూరగాయలు ఇచ్చే వ్యక్తిని గుర్తుపెట్టుకుని మరీ పలకరించి చూడండి. అతను మీ పట్ల ఎంత కృతజ్ఞత చూపిస్తాడో' అని ఒక్కొక్క వ్యక్తి గురించి తన అనుభవాలను మనకూ పరిచయం చేస్తాడు.

'హ్యాపీనెస్ బ్రిగేడ్', 'రబ్ శుక్రాన్' పేరుతో 2019 నుంచి తన మిత్రుల సహకారంతో అభినవ్ ఈ పలకరింపు కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఈ కృతజ్ఞత తెలియజేయడం అనే ఆలోచన ఎందుకు వచ్చిందీ అని అడిగితే, ఇలా చెబుతాడు : 'మా నాన్న మా కోసం ఎంతో కష్టపడేవాడు. చెల్లిని, నన్ను చదివించాలని తన సంతోషాలు, సుఖాలు అన్నీ వదులుకున్నాడు. ఇవేమీ మాకు తెలియదు. ఆయన చివరి రోజుల్లో మంచంపై పడుకుని శూన్యంలోకి అలా చూస్తూ ఉండేవాడు. ఏమీ మాట్లాడేవాడు కాదు. నాన్న కోలుకోవాలని ఎన్నో దేవుళ్లని వేడుకున్నాను. ఎవ్వరూ నా మొర ఆలకించలేదు. నాన్న చనిపోయాక దేవుణ్ణి నమ్మడం మానేశాను. నాన్న చివరి క్షణంలో ఆయన ముఖంలో కనిపించిన వెలితి నన్ను చాలాకాలం వెంటాడింది. నాన్న మా కోసం అంత కష్టపడ్డాడు కదా! ఒక్కసారైనా నేను ఆయనకి కృతజ్ఞత చెప్పానా? అని ఆలోచించాను. లేదు. ఇప్పుడు మా నాన్నని గట్టిగా హత్తుకుని కృతజ్ఞత చెప్పాలని ఉంది. కానీ ఆయన లేడు.. అప్పుడే 'రబ్ శుక్రాన్' ఆలోచన వచ్చింది. నా చుట్టూ ఎంతోమంది నాన్న లాంటి వారు కష్టపడుతున్నారు. వాళ్లందరికీ కృతజ్ఞతలు చెప్పాలనుకున్నాను. స్నేహితులతో చర్చించాను. వాళ్లు కూడా నాతో చేయి కలపడానికి సిద్ధపడ్డారు.'



రోడ్డు మీద రిక్షా తొక్కుకుంటూ జీవనం సాగిస్తున్నాడు బషీర్. తన కొడుకును బాగా చదివించాలన్నది ఆయన కోరిక. అభినవ్‌కి బషీర్ బాగా తెలుసు. కుటుంబం కోసం ఎంత కష్టపడుతున్నాడో రోజూ చూస్తున్నాడు. అందుకే ఒక రోజు ఓ చక్కని సందేశం రాసి వున్న గ్రీటింగ్ కార్డుతో బషీర్ రిక్షా దగ్గరికి వెళ్లాడు. అభినవ్‌ని చూస్తూనే 'ఎక్కడికి బాబూ?' అని అడిగాడు బషీర్. 'ఎక్కడికీ వద్దు గానీ, ఇదిగో ఈ గ్రీటింగ్ కార్డు తీసుకో. ఈ పువ్వు కూడా నీ కోసమే తెచ్చాను' అంటూ అతనికి అందించాడు. బషీర్ అయోమయంగా అలా చూస్తూ ఉండిపోయాడు. అప్పుడు అభినవ్ అతనికి అర్థమయ్యేలా విషయం చెప్పాడు. అతను చెప్పడం పూర్తి అవ్వటంతోనే, బషీర్ సంతోషంతో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

'నా కష్టాన్ని గుర్తించే వారు ఇప్పటివరకు నాకు కనిపించలేదు. ఇంట్లో వాళ్లు కూడా ఎప్పుడూ అలా ప్రవర్తించలేదు. నువ్వు మాత్రం నా కష్టాన్ని గుర్తించావు. కృతజ్ఞత చెబుతున్నావు. చాలా చాలా సంతోషంగా ఉంది.' అని అభినవ్ చేతులు పట్టుకుని అదేపనిగా ఊపేశాడు. ఇది రబ్ శుక్రాన్ ప్రయాణంలో ఓ చిన్న ఉదాహరణ. ఇలాంటి సంఘటనలకు గుర్తుగా అభినవ్ ఇప్పటివరకు 15 వేల గ్రీటింగ్ కార్డులు వివిధ రకాల వృత్తులు చేసుకునే వారికి పంచిపెట్టాడు. ఒకసారి ట్రాఫిక్ పోలీసుకి ఇచ్చినప్పుడు అతను ఎంతో సంతోషంగా తనని అభినందించిన సందర్భాన్ని అభినవ్ గుర్తు చేసుకుంటాడు.

'ఓసారి ప్రధాని నరేంద్రమోడీ ఇంటి గుమ్మం దగ్గర సెక్యూరిటీ చేసే గార్డులకు గ్రీటింగ్ కార్డులు పంచిపెట్టాను. ఇంటికి వచ్చిన అరగంట తర్వాత నాకు ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఒక సెక్యూరిటీ గార్డు ఫోన్ చేసి అదే పనిగా ఏడుస్తున్నాడు. "నేను చాలా ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నాను. నిత్యం వందల కార్లు బయటికి వెళతాయి. లోనికి వస్తాయి. ఎవ్వరూ మావైపు కన్నెత్తి చూడరు. కుటుంబానికి దూరంగా నెలల తరబడి పనిచేస్తాం. ఈ ఉద్యోగం చేయడం గర్వకారణంగా ఉన్నా, మా త్యాగాలను ఎవ్వరూ గుర్తించరు. ఈ రోజు నువ్విచ్చిన చిన్న గ్రీటింగ్ కార్డు నాకు కొండంత సంతోషాన్ని ఇచ్చింది. నా ఆనందాన్ని నీతో పంచుకోవాలని ఫోను చేశాను.' అని అతను చెప్పిన సందర్భాన్ని అభినవ్ ఎప్పుడూ గుర్తు చేసుకుంటాడు.


"ఇలాంటి వ్యక్తులను ఎంతోమందిని చూస్తున్నాను. ఓ చిన్న కృతజ్ఞత వారిని ఎంత ఆనందానికి గురిచేస్తుందో తెలిసాక, నా ప్రయాణాన్ని మరింత ఉత్సాహంగా చేస్తున్నాను" అని చెబుతున్నాడు అభినవ్.

20న 'కన్నప్ప' టీజర్ విడుదల




విష్ణు మంచు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 14 నుంచి 2 వరకూ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ వేదికపైన 20న 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప'గా కన్నప్ప మూవీ టీజర్‌ని ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని విష్ణు మంచు సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. 'మేం ఎంతో ఇష్టంగా రూపొందిస్తున్న కన్నప్పను ప్రపంచ ప్రేక్షకులకు చూపించేందుకు కాన్స్ అనువైన వేదికగా ఉపయోగపడుతుంది. మన భారతీయ చరిత్రను ప్రపంచ వేదికపైకి తీసుకురావడం, మన కథలు, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు తెలియజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ట్వీట్ చేశారు విష్ణు.

నేడు 'డబుల్ ఇస్మార్ట్' టీజర్ విడుదల



హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్'(2019) మూవీ సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా వీరి కాంబినేషన్‌లో 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' మూవీ రూపొందుతోంది. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలకపాత్రలో నటిస్తున్నారు. పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' నుంచి ఓ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. బుధవారంనాడు రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రామ్ సరికొత్త పోస్టర్ విడుదల చేశారు. ఫేస్ మాస్క్, పులి చారల చొక్కా, టోర్న్ జీన్స్ ధరించి ఒక చేతిలో సిగరెట్, మరో చేతిలో క్రాకర్స్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌తో కనిపించారు రామ్.



'ఆ పిల్ల కనులే..' పాట విడుదల

అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. యూత్ ఫుల్ లవ్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతోంది. 'ఆ పిల్ల కనులే..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహిస్తున్నారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. హిప్ హాప్ తమీజా సంగీతాన్ని అందించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్లలోకి రానుంది.

కల్కిలో దీపికా డబ్బింగ్ పూర్తి



ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. హీరోయిన్ దీపికా పదుకొనే తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వైజయంతీ మూవీస్‌పై సి.అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 27న విడుదల కానుంది. 'కల్కి 2898 ఏడీ'లో తన పాత్రకి సంబంధించిన డబ్బింగ్‌ని దీపికా పదుకొనే పూర్తి చేశారు. హిందీ, కన్నడ భాషల్లో ఆమె డబ్బింగ్ చెప్పినట్లు సమాచారం.

హాలీవుడ్ 'డ్యూన్' వెబ్ సిరీస్‌లో టబు

టబు ప్రతిష్టాత్మకమైన డ్యూన్ : ప్రొఫెసీ హాలీవుడ్ వెబ్ సిరీస్‌లో నటించనున్నారు. 'డ్యూన్: ప్రొఫెసీ'లో టబు పాత్రను వెల్లడిస్తూ ఆంగ్ల మ్యాగజైన్ కథనాన్ని ప్రచురించింది. 'ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో టబు నటిస్తున్నారు. బలమైన, తెలివైన, ఆకర్షణీయమైన పాత్రిది. ః అందరికీ నచ్చుతుంది. ఒకప్పుడు చక్రవర్తి ప్రేయసిగా ఉన్న ఆమె తిరిగి ప్యాలెస్‌కు రావడంతో ఇది మొదలవుతుంది' అంటూ టబు పాత్ర గురించి మ్యాగజైన్ పేర్కొంది. ఈ 'డ్యూన్: ప్రొఫెసీ' సిరీస్‌ను మొదట 2019లో ప్రకటించారు. డ్యూన్: సిస్టర్‌హుడ్ పేరుతో రానున్నట్లు తెలిపారు. మనిషి మనుగడకు ముప్పు తెచ్చే శక్తులతో హర్కొనెన్ సిస్టర్స్ ఎలా పోరాడారనే అంశంపై దీని తెరకెక్కిస్తున్నారు.



హీరో ధనుష్ రూ.కోటి విరాళం

కోలీవుడ్ హీరో ధనుష్ 'సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' నూతన భవన నిర్మాణం కోసం రూ.కోటి విరాళం అందించారు. చెక్కును నాజర్‌కు అందజేశారు. నటుడు నాజర్ అధ్యక్షుడిగా, విశాల్ ప్రధాన కార్యదర్శిగా, కార్తి కోశాధికారిగా నడిగర్ సంఘం బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సంఘం నూతన భవన నిర్మాణం కోసం ఇప్పటికే పలువురు ప్రముఖులు విరాళం అందచేశారు. కథానాయకులు కమల్ హాసన్, విజయ్ గతంలో దీని కోసం రూ.కోటి చొప్పున విరాళంగా ఇచ్చారు. హీరో శివ కార్తికేయన్ రూ.50 లక్షలు అందించారు. ప్రస్తుతం నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఆఖరులో ఈ భవనాన్ని ప్రారంభించనున్నారు.

గెలిచినా.. ఢిల్లీకి కష్టమే...

- **ఓటమితో లక్నో ఆశలూ ఆవిరి**



అభిషేక్ పొరెల్(58)

న్యూఢిల్లీ: ప్లే-ఆఫ్‌కు చేరడం కష్టమే అయినా.. చివరి మ్యాచ్‌లో ఢిల్లీ గెలిచి చిగురాశలతో మిగతాజట్ల ఫలితాలకు వేచిచూస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన తన చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 19 పరుగులు తేడాతో గెలిచి ఈ సీజన్‌లో 7వ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో మొత్తంగా 14 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఢిల్లీ 14పాయింట్లతో ప్రస్తుతానికి పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. ఇప్పటికే 14 పాయింట్లు సాధించిన జట్లతో పోటీపడినా ఢిల్లీ (-0.482) రన్‌రేట్ అన్ని జట్లకంటే తక్కువగా ఉంది. పైగా మరికొన్ని జట్లుకు 14 పాయింట్లు సాధించే అవకాశం ఉండటంతో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు వదులుకోవాల్సిందే. మరోవైపు ఓడిన లక్నో జట్టు ప్రస్తుతం 12 పాయింట్లతో 7వ స్థానంలో ఉంది. ఈ జట్టుకు మరొక మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. చివరిమ్యాచ్‌లో విజయం సాధించినా ప్రస్తుత రన్‌రేట్‌తో లక్నో కూడా ప్లేఆఫ్‌కు చేరడం అసాధ్యం.

మంగళవారం మ్యాచ్‌లో ఢిల్లీ విధించిన 209 పరుగుల చేధనలో లక్నో పోరాడినా ఫలితం సాధించలేకపోయింది. 20 ఓవర్లు ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి 189 పరుగులు మాత్రమే సాధించింది. చేధనలో ఢిల్లీ ఓపెనర్లు డికాక్, కెఎల రాహుల్‌తో పాటు, స్టోయిన్స్, దీపక్ హుడా తీవ్రంగా నిరాశపర్చారు. దీంతో 4 వికెట్ల నష్టానికి 44 పరుగులు మాత్రమే చేసింది. అయితే ఈ దశలో పూరన్ (61 పరుగులు) దాటిగా ఆడటంలో లక్నో రేసులోకి వచ్చింది. ఈ తరువాత అర్షద్ ఖాన్ (58 నాటౌట్) జట్టును గెలిపించడానికి ప్రయత్నించాడు. దీంతో చివరిలో ఓవర్‌లో విజయం కోసం 23 పరుగులు చేయాలి ఈ స్థితిలో రషిక్ సలాన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చాడు. దీంతో లక్నోకు ఓటమి తప్పలేదు. మూడు కీలక వికెట్లు తీసిన ఢిల్లీ బౌలర్ ఇశాంత్ శర్మకు ప్లేయర్ ఆఫ్ మ్యాచ్ అవార్డు లభించింది.

మంగళవారం మ్యాచ్‌లో టాస్ ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్‌లో బ్యాటర్లు కదం తొక్కారు. ఓపెనర్ అభిషేక్ పోరెల్, మిడిలార్డర్ బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్ అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 208పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు శుభారంభం దక్కలేదు. ఫ్రేజర్(0) రెండో బంతికే డకౌట్ కావడంతో ఢిల్లీ కష్టాలతోనే ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ డకౌటైనా.. మరో ఓపెనర్ అభిషేక్ పొరెల్(58) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో రెండో అర్ధ సెంచరీ నమోదు చేశాడు. అయితే.. నవీన్ ఉల్ హక్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడి బౌండరీ వద్ద పూరన్ చేతికి దొరికాడు. ఆ తర్వాత షాయ్ హోప్(38) అండగా పొరెల్ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. బౌలర్ మారినా బంతి లక్ష్యం బౌండరీయే అన్నట్టుగా చిచ్చరపిడుగు చెలరేగాడు. హోప్ సైతం ధనా ధన్ ఇన్నింగ్స్‌తో రాణించడంతో వీరిద్దరూ రెండో వికెట్‌కు 92 పరుగులు జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ ద్వయాన్ని బిష్ణోయ్ విడదీశాడు. హోప్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(33) ఆచితూచి ఆడాడు. ఆ తర్వాత క్రీజ్‌లో నిలదొక్కుకున్నాక బ్యాట్ ఝుళిపించాడు. 23బంతుల్లో 5ఫోర్లు సాయంతో 33పరుగులు చేసి నవీన్-ఉల్-హక్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. చివర్లో స్టబ్స్(57నాటౌట్; 25బంతుల్లో 3ఫోర్లు, 4సిక్సర్లు), అక్షర్ పటేల్(14నాటౌట్) రాణించడంతో ఢిల్లీ జట్టు భారీస్కోర్ నమోదు చేసింది. ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు ఇదే ఆఖరి మ్యాచ్ కాగా.. ఆ జట్టు 12పాయింట్లతో 6వ స్థానంలో కొనసాగుతోంది. లక్నో బౌలర్లు నవీన్-ఉల్ హక్‌కు రెండు, బిష్ణోయ్, ఆర్షాద్ ఖాన్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి.

సెమీస్ రిజర్వు డేలకు ఐసిసి 'నో'

వర్షంతో రద్దు అయితే రన్‌రేట్‌తో ఫలితం

టై అయితే సూపర్ ఓవర్ • టి20 ప్రపంచకప్



దుబాయ్: వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జరిగే టి20 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) స్పష్టతనిచ్చింది. రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వు డేలను కేటాయించడం లేదని స్పష్టం చేసింది. అనివార్య కారణాలవల్ల సెమీఫైనల్స్ మ్యాచ్‌లు నిలిచిపోతే అవసరమైతే 250 నిమిషాలు(సుమారు 4గంటలు) తర్వాత అయిన మ్యాచ్‌ను కొనసాగిస్తామని తెలిపింది. అంతేగాని సెమీస్ మ్యాచ్‌లను మరుసటిరోజుకు వాయిదా వేసే ప్రసక్తి లేదని పేర్కొంది. మ్యాచ్‌లను మరుసటిరోజుకు వాయిదా వేయడం వల్ల ఫైనల్లో ఆడే ఆటగాళ్లు ఇబ్బందులు పడతారని తెలిపింది. సెమీస్ ముగిసిన మరుసటిరోజే ఆ జట్టు ఫైనల్ మ్యాచ్ ఆడాల్సి ఉంటుందని అందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఒకవేళ సెమీస్ మ్యాచ్ టై అయిన పక్షంలో నిబంధనల ప్రకారం సూపర్ ఓవర్ ద్వారా ఫలితాన్ని నిర్ణయిస్తామని, వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దయిన పక్షంలో రెండో లీగ్ పోటీలు ముగిసిన తర్వాత మెరుగైన రన్‌రేట్ కలిగి మొదటిస్థానంలో ఉన్న జట్టు ఫైనల్‌కు చేరందని ఆ ప్రకటనలో తెలిపింది. ఐసిసి టి20 ప్రపంచకప్ సెమీఫైనల్స్ జూన్ 27న ట్రినిడాడ్, గయానా వేదికలుగా జరగనున్నాయి. జూన్ 28న ట్రావెల్ డేగా, 29న ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు ఐసిసి తెలిసింది.

ఐపిఎల్‌లో నేడు

రాజస్తాన్ × పంజాబ్
వేదిక: గౌహతి; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
కోల్‌కతా	13	9	3	1	19	1.42
రాజస్తాన్	12	8	4	0	16	0.34
చెన్నై	13	7	6	0	14	0.52
సన్‌రైజర్స్	12	7	5	0	14	0.40
ఢిల్లీ క్యాపిటల్స్	13	6	7	0	14	-0.37
బెంగళూరు	14	7	7	0	12	0.38
లక్నో	13	6	7	0	12	-0.78
గుజరాత్	13	5	7	1	11	-1.32
ముంబయి	13	4	9	0	8	-0.27
పంజాబ్‌కింగ్స్	12	4	8	0	8	-0.42

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; ర: రద్దునె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68